తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



జనవరి 01, 2021

సంపుటి 01 సంచిక 06

*Complimentary Copy - 6*



జాతి గౌరవం దశ దిశలా చాటిన మహా మనీషి...

## స్వామి వివేకానంద

***Printed and Published by : TELANGANA JAGRUTHI***
Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda,
Hyderabad - 500 029. Telangana State.
E-mail : editor@thangedu.co.in

# విషయ సూచిక




మార్నింగ్ వాక్‌ని
తాత్వికంగా
ఆవిష్కరించిన
**డా॥ ఎన్. గోపి** కవిత... 04

19 **శేషప్ప కవి నారసింహశతక పద్యాలు** ఇప్పటికీ
ఎందరో అవిద్యావంతులకు కూడా కంఠస్థం.
నరసింహుని కొలువులోని శేషప్ప కవిని వివరించిన
**ఆచార్య వెలుదండ నిత్యానందరావు**





05
వెట్టిమాదిగను రక్తం కారేవరకు కొట్టిన
కఠినాత్ముడైన పటేల్.... నాటి గ్రామ
వ్యవస్థలో ఉత్పత్తి కులాలపైన జరిగిన
దౌర్జన్యం చిత్రించిన **భాగ్యరెడ్డి వర్మ**
నాటి కథ **వెట్టి మాదిగ...**





14
వరూధిని ప్రవరుల సౌందర్యాన్ని
మరోసారి నిష్పన్నం చేసిన
**వరూధినీ ప్రవరులు** మారన
విరచిత పద్య ఖండిక...





09
భారతదేశంలో సజీవ సంస్కృతిని మన
కళ్ళెదుట పెడుతున్న జాషువా కవిత్వం
ఆవిష్కరించిన **డా॥ సిద్దెంకి యాదగిరి**
వ్యాసం **జాషువా సాహిత్యం...**





07
నగరానికి దూరంగా ఉన్న
ఊరిలో జరిగిన ప్రేమ
ఉదంతాన్ని చెప్పిన **బివిఎస్**
**రాములు** కథ
**మా ఊరు...**





15
కరోనాపై కలబడుతున్న కవిత్వాన్ని
చెబుతూ కవుల చైతన్యం
వ్యాసీకరించిన **గుడిపాటి...**
**కరోనాపై కవిత్వ సమరం**





33
వివాహబంధం రక్షించడానికి ఏర్పడ్డ
వ్యవస్థను దుర్వినియోగం చేసిన ఓ
యువతి.. **అంపశయ్య నవీన్**
**కొత్త కోడలు...**

**ఒక పాప.. మరో బుద్ధుడు** బుద్ధుని విస్తారమైన తాత్వికతను స్పృశిస్తున్న **సీతారాం కవిత...** **28వ పేజీలో**

అనువాదపు శ్రమ తెలియకుండా కథను సజీవం చేసిన **అచ్యుతుని రాజ్యశ్రీ** అనువాద కథ... **నమ్మశక్యం కానిది... 29వ పేజీలో**

నాన్న అలాగే జీవిస్తున్న వైనాన్ని ఆర్ద్రంగా చెప్పిన్న **పసునూరి రవీందర్** కవిత.. **38వ పేజీలో**

నాటి తెలంగాణ సమాజాన్ని దర్శింప ప్రయత్నం చేసిన వ్యాసం **తొలి తరం కథలలో తెలంగాణ... 41వ పేజీలో**

కాళోజీ అవార్డు గ్రహీత **రామా చంద్రమౌళి**తో **మామిడాల** ముఖాముఖి... **43వ పేజీలో**

రచయితగా తన **సాహితీ ప్రయాణాన్ని** వివరిస్తూ స్ఫూర్తి నిచ్చిన **పెద్దింటి అశోక్ కుమార్... 25వ పేజీలో**

**ప్రయాణమే జీవితం..**
ప్రొ॥ పి. లక్ష్మినారాయణ... **23**

**ఉత్తేజమైన ఆలోచనలు...**
గోపగాని రవీందర్... **31**

**దిగులు వసంతం...**
గజ్జెల రామకృష్ణల కవితలు... **32**

**సభలు సమావేశాలు, శ్రీకారం, పుస్తక పరిచయం, కొత్త పుస్తకాలు, దృశ్య సాహిత్యం...** ఇంకా మరెన్నో....

# తంగేడు సంచికకు స్పందన...

తంగేడు మనసుకు ఇంపుగా, ముచ్చటగా ఉంది.
- పగడాల నాగేందర్ (కవి)

మీ పత్రిక చిరకాలం నిలుస్తుంది. ముస్తాబు, కంటెంటు పోటీ పడుతున్నాయి. అభినందనలు
- విష్ణువర్ధన్ రాజు (సామాజిక కార్యకర్త)

తంగేడు అపురూపం. అందులోని ప్రచురణలు చాలా ఆకర్షిస్తున్నాయి
- మధుకర్ వైద్యుల (కవి, రచయిత)

యాభై రెమ్మల ఈ తంగేడులో ప్రతి రెమ్మా ఓ సాహితీ పరిమళం. కథా ప్రియులకు కొంగు బంగారం
- డా॥ అమ్మిన (తెలుగు సేవకుడు)

భండారు అచ్చమాంబ కథా పరిచయం నన్నాకర్షించింది. వ్యాసాలన్నీ బాగున్నాయి
- చందుపట్ల అంబదాస్ (కవి)

తంగెడు సూపర్‌గా వస్తుంది. అభినందనలు
- తమ్మబోయిన వాసు (కవి)

తంగేడు చాలా బాగుంది. అభినందనలు
- గోరేటి వెంకన్న (కవి, గాయకుడు)

పత్రిక బాగుంటుంది. క్రమంగా అన్ని విషయాలలో అభివృద్ధి సాధిస్తున్నది
- గుడిపాటి (పాలపిట్ట సంపాదకులు)

తంగేడు రెగ్యులర్ గా చూస్తున్నాను.బాగుంటుంది. ఈ పక్షంలో 'జాతి నిర్మాతలు సృజన కారులే' సంపాదకీయం బాగుంది.
-అన్నవరం దేవేందర్

మీ తంగేడులో ఆర్టికల్స్ తో పాటు కవితలకు పద్యాలకు తగు ప్రాధాన్యం ఇవ్వడం సముచితం. భాషాపరమైన సమాచారం కూడా బాగా ఉంది
- రామేశ్వర రాజు (కవి, రిటైర్డ్ డి.ఇ.ఒ)

పత్రిక అద్భుతంగా ఉంది. మీ సెలెక్షన్ నాకు బాగా నచ్చింది
- కె.శివారెడ్డి (కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత)

సంపాదకీయం


తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

1 జనవరి, 2021

సంపుటి 01 సంచిక 06




శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్




డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614


# సృజన చింతనలో రైతు

తెలుగు సాహిత్యం రైతుకు మొదటినుండి పెద్ద పీట వేసింది. స్వేద జీవితాన్ని చిత్రించడంలో మన సృజనకారులు ఇతోధికం గా కృషి చేశారు. బహుశా రైతు కష్ట సుఖాలు కవులు గుర్తించినంతగా మరెవ్వరూ గుర్తించ లేదేమో?

పోతన స్వయంగా హలంతో పొలం దున్ని జీవనం సాగించాడు. "హాలికుడైన నేమి? అని రైతు ప్రసక్తి తెచ్చి ఆత్మాభిమానం ప్రకటించాడు. ప్రబంధ కాలంలో కృష్ణ దేవరాయల విల్లిపుత్తూరు వర్ణనలో రైతు జీవన ప్రసక్తి తీసుకొచ్చాడు. వానలు అధికంగా పడుతున్నప్పుడు రైతులు పగళ్ళు ఎట్లా గడిపారో చెప్పాడు తన "గురుగున్ చెంచలి" పద్యంలో. అట్లాగే "వరజు బడి రొంపి ద్రొక్కం" అన్న పద్యంలో రైతులు బురద దున్నుతున్నపుడు వాళ్ళ కాళ్ళకు నీరుకట్టెలు అనే పాములు చుట్టుకున్నాయట, అవి బంగారు రంగుతో ఉండడం వల్ల హాలికులకు బంగారు గండపెండేరంలా అమరినవని" అంటాడు. ప్రబంధాలలో అనేక సార్లు వ్యవసాయ వాతావరణపు వర్ణనలు కనిపిస్తాయి. మంచన, శ్రీనాధుడు, లాంటి కవులు ఎందరో రైతు స్ఫృహతో సాహిత్యం సృష్టించారు.

ఆధునిక కాలంలో దువ్వూరు రామిరెడ్డి 'కృషీవలుడు' కావ్యం, అట్లాగే తుమ్మల సీతారామమూర్తి "క్షేత్ర జీవి" కావ్యం రైతు ను వస్తువుగా చేసుకొని రచించనవే. గుర్రం జాషువా, కరుణ శ్రీ, శ్రీశ్రీ, కుందుర్తిలాంటి కవులెందరో రైతుశ్రమకు నీరాజనాలిచ్చారు. గంగుల సాయిరెడ్డి తన కావ్యంలో తెలంగాణ కర్షకుని జీవన రేఖలు చిత్రించారు. "న్యాయ మూర్తులు నీ వార లడుగర్రైరి, న్యాయ వాదులు నీ వార లడుగర్రైరి, ఇంక పరవారి ముచ్చట లెందుకయ్య, కర్షకా నీదు కష్టముల్ గాంతురెవరు?" అని ఆవేదనతో ప్రశ్నించారు. వానమామలై జగన్నాథాచార్యులు రైతు రామాయణం రచించారు. ఇక దాశరధి "తెలంగాణము రైతుదే" అని రైతు పట్ల ప్రకటించిన అభిమానం మనకు తెలిసిందే.

కవి సాహిత్యం అనే పొలంలో శ్రమిస్తే రైతు భౌతికమైన పాడి పంటల్లో పరిశ్రమిస్తాడు. ఒకరిది హృదయమథనం. రెండవది ఖరీదు కట్టే షరాబు లేని ఘర్మ జల ప్రవాహం. శిశువు నుంచి పశువు వరకు ఊపిరి పీల్చడానికి మూలమైన ఆహార సాధనం.

అట్లాంటి రైతు ఇపుడు న్యాయ పోరాటం చేస్తున్నాడు. "అయినను బోయి రావలయు హస్తినకున్" అని వెళ్లి తన గమ్యాన్ని వెతుక్కొంటున్నాడు.

అట్లాంటి అన్నదాతకు సృజనలోకం తమ అక్షరాలతో సంఘీభావం తెలుపుతున్నది. కొన్ని సాహితీ సంస్థలైతే సంయుక్తంగా సమ్మేళనాలే నిర్వహించాయి.

మనం కూడా తంగేడు పక్షాన అన్నదాతకు సంఘీభావం ప్రకటిద్దాం. మన సృజన సంగమం నుండి కర్షక విజయం ఆకాంక్షిద్దాం.

నూతన సంవత్సర శుభాకాంక్షలతో,

జై తెలంగాణ.. జై జాగృతి...

కవిత కల్వకుంట్ల

# మార్నింగ్ వాక్



డా॥ ఎన్. గోపి

పొద్దున లేవాలంటే
దేహం మొరాయిస్తుంది
అంతా ఒక్క క్షణం!
అటు పొర్లితే పడక
ఇటు తిరిగితే నడక.

చీకటికి స్పర్శ ఉన్నట్టే వుంది
నడుస్తుంటే
కాళ్లకు తగిలి చెదిరిపోతుంది.

దూరాన ఆమె నడక
గాలికి లయను నేర్పుతున్నట్టే వుంది
ఆమె వెళ్లినంతమేరా
శూన్యంలో అజంతా విగ్రహాలు
మిగిలిపోతున్నాయి.

ఆ బాటనీ ప్రొఫెసర్ చెప్పేదాకా
అది నిద్రగన్నేరు చెట్టని తెలియదు.
దాని ఆకులు
వాలిన రెప్పల్లా వున్నాయి.

తొలి కిరణం ఏ వస్తువుపై పడ్డా
అది ఓ కాంచనోజ్వలజ్వలనం.
నాలుగు దశాబ్దాలుగా నడుస్తున్నాను
ఆ మైదానం
క్షణక్షణ విస్ఫారిత
జీవన మహేతిహాసం!

ఇవాళ రోజూ కనబడే మిత్రుడేడని
అడుగుతున్నదో పిట్ట
"హీ ఈజ్ నో మోర్" అన్నారెవరో
వెలుగులు చీకటి కలుగులోకి
నిష్క్రమిస్తున్న స్ఫురణ.

ఇప్పుడు అడుగులు
గతంలోకి పడుతున్నాయి
జ్ఞాపకాలు ముసురుతుంటే
బరువుగా ఇల్లు చేరుకున్నాను.



## రచయితలకు సూచనలు

- సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి
- పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి
- మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి
- పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.

**తెలంగాణ జాగృతి**
పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# వెట్టిమాదిగ

నాటి గ్రామపాలకుల దౌర్జన్యం చెప్పే కథ...
అదే సమయంలో నిమ్న కులస్థుని దైన్యం కూడా ఇక్కడ చూస్తాం...



(అజ్ఞాతవాసి)
మ్యాదరి వెంకట భాగ్యరెడ్డి వర్మ

పోలీసు పటేలగు రామిరెడ్డి గ్రామ చావడిపై కూర్చొని యుండెను. అతడేదో తొందర పనిచే మనో వైకల్యము గల వాని వలె గన్పట్టు చుండెను. రామిరెడ్డి గ్రామము నందు పలుకుబడిగల రెడ్డి కుటుంబమున జన్మించెను. ఈతనికి సుమారు రెండు వందల ఎకరముల భూమి గలదు. దీనివలన సంవత్సర మునకు ఇంచుమించు అయిదారు వందల యాదాయము వచ్చును. మన రెడ్డి గారికి తెనుగు నందును, ఉర్దూ భాష యందును కొంత జ్ఞానము కలదు. ఐనను వాక్పటిమలో నీతని సరిపోలు పోలీసు పటేండ్లు అరుదుగా నుందురు. గ్రామములో ఒకనితో నింకొకనికి కలహములు కలిగించుట యందీతనికి పెట్టినది పేరు. గ్రామములో రెడ్డి గారిని మనసార దూషించని వారు లేరని చెప్పిన తప్పు కాదు. ఐనను వీరికి జంకియో లేక వారితో నేదేని పని గలుగుననియో అందరును వీరిని గౌరవ భక్తులతో జూతురు. రెడ్డి గారితో కించిద్విరోధ మెవరికైన గలగెనా నాతడు అచటి నుండి వేరొక గ్రామమునకు లేచి పోవలసినదే. లేనిచో నాతడు కష్ట నష్టములకు పాలగుటయే గాక కొద్ది దినములలోనే యేదేని నేరము క్రింద న్యాయస్థానమున కీడ్వబడి నేరారోపితుడై శిక్షకు పాత్రుడైన కావలయును. లేదా దుండుగుల పాలై "అన్నమో రామచంద్రా" యను సప్తాక్షరి మంత్రోపాసన నైనను చేయవలయును. ఈ కారణము వలననే చండశాసనుడగు రామిరెడ్డిగా రనిన గ్రామ ప్రజలకు భయము.

రామిరెడ్డి గారి కత్యవసరమైన కార్యముపై మూడామడ దూరముపై నున్న యతని బంధువు యింటికి యుత్తరము పంపవలసి యుండెను. తలారిని యూరివంతు మాదిగను పిలుచుకొని వచ్చుటకై పంపెను. కాని తలారి రిక్త హస్తములతో వచ్చి వంతు మాదిగవానికీ రోజు ఆవశ్యక కార్యము కలుగుటచే రాజాలననెనని రెడ్డిగారితో నుడివెను. ఇది వినగానే రెడ్డిగారు తోకదొక్కిన కాల భుజంగము వలె క్రుద్ధుడై ఏమి! వంతు మాదిగకు ఆవశ్యకమైన పని గలదా! నా పని ఎవ్వరు చేయుదురు. నీ తాతనా లేక నీ ముత్తాతనా? నీకు బుద్ధి లేదు. తుచ్ఛుడగు మాదిగ వానిని పిలుచుకొని రాక యింకను సిగ్గు లేక నాతో చెప్పుచున్నావా? నీ కింతయైనను సత్తువ లేదా యనుచు పాదమున నున్న చెప్పునూడదీసి తలారిని కోపమడుగు వరకు మోది ఐదు నిముషములలో మాదిగవాడు రాకున్న నీ ప్రాణముల తీసెదనని బెదరించెను. తలారియు పటేలు గారి ప్రతాప మెరిగిన వాడగుటచే కిక్కురుమనక మాదిగవాడ దారిబట్టెను. పటేలు గారికి క్రోధముడుగక యిట్లు తిట్ట నారంభించెను. ఏమి, మాదిగ వాని కావశ్యక కార్యమా! ఇక్కడ సర్కారు పని నెవ్వరు చేతురని తలచెనో, నేడు రేపటి కాలమే మారినది. మాదిగలకు గూడ కనులు నెత్తికెక్కి క్రిందు మీదు కానరాకుండ నైనవి. రేపే వీరిపని

**వెట్టి మానినచో పాషాణ హృదయుడగు పటేలు గారి క్రోధాగ్నికింధనము నగుదునను జంకు - ఇట్లు చింతించుచు పటేలు గారిని బ్రతిమాలు కొని నేటికింకొకరిని తోలుట కొప్పించుటకై పటేలు గారి సన్నిధానమునకు పోవుటకై ప్రయాణ మయ్యెను. ఇంతలోనే తలారి కోఘూర్ణిత నయనములతో వచ్చి మల్లనిని తిట్టుచు కొట్టుచు పటేలు గారి కడ కీడ్చుకొని పోజొచ్చెను.**

పట్టించెదను. ఈ సారి వీరి మాన్యమును చేయించకున్న నేను రామిరెడ్డినే కాను ఇప్పుడదేమి విచిత్ర కాలమో కాని సర్కారనిన అందరికి నిరక్ష్యమే కలిగినది. పాపము వారి నెందుకు కష్టపెట్టవలెనని దయదలచిన వారు నెత్తికెక్కిపోవుచున్నారు. అందుకనే పెద్దలు చెప్పుతో నలుగ రాచవలయునని చెప్పిరి. వెట్టంటే వీరికి కష్టమట. వీరిని ఊళ్ళో ఉండనిచ్చిన దెందుకో, వీరికి రైతులతో బిచ్చము బలిపెట్టించే దెందుకో - ఇంట్లో కూర్చొని దొరల వలె తినుటకు కాబోలు. ఇక నా ప్రతాపమును చూపింతును. వీరల కొంపలు నాశనము చేతును. ఎవ్వరడ్డము వచ్చెదరో చూచెదను కాక.



కార్తీక మాసము ఆరు నెలలు కష్టపడి గింజలు పండించుకొని నాలుగు అయిదు నెలల వరకు కలియో గంజియో త్రాగుదుమని యువ్విళ్ళూరుచు పండించిన ధాన్యపు కుప్పలను కొట్టుకొను సమయము. బొక్కెనలకు తొండము లిచ్చి, వ్యవసాయమునకు కావలసిన యితర పరికరముల నొసగి మీదు మిక్కిలి భూకామందుతో కలిసి రాత్రింబగళ్ళు పనిచేసిన వెట్టి ఫలితమిపుడే తేలగలదు. ఆ దినమున మాదిగ మల్లడు వంతు పోవలసి యుండెను. కాని నాడే అతడు వెట్టిచేసిన భూకామందు కుప్పలు కొట్టుచుండెను. అందుచే మల్లడు సంకటమున చిక్కెను. ఒకవేళ వెట్టిపనికి పోయినచో గవ్వ లాభముండక పోవుటయే గాక రావలసిన బిచ్చములో తచ్చుగును. వెట్టి మానినచో పాషాణ హృదయుడగు పటేలు గారి క్రోధాగ్నికింధనము నగుదునను జంకు - ఇట్లు చింతించుచు పటేలు గారిని బ్రతిమాలు కొని నేటికింకొకరిని తోలుట కొప్పించుటకై పటేలు గారి సన్నిధానమునకు పోవుటకై ప్రయాణ మయ్యెను. ఇంతలోనే తలారి కోపఘూర్ణిత నయనములతో వచ్చి మల్లనిని తిట్టుచు కొట్టుచు పటేలు గారి కడ కీడ్చుకొని పోజొచ్చెను.

**గ్రామములో రెడ్డి గారిని మనసార దూషించని వారు లేరని చెప్పిన తప్పు కాదు. ఐనను వీరికి జంకియో లేక వారితో నేదేని పని గలుగుననియో అందరును వీరిని గౌరవ భక్తులతో జూతురు. రెడ్డి గారితో కించిద్విరోధ మెవరికైన గలగెనా నాతడు అచటి నుండి వేరొక గ్రామమునకు లేచి పోవలసినదే.**

అధైర్యుడును, న్యాయశాస్త్రమననేమో నెరుగనట్టియు మన మల్లడు యెవరి ధైర్యము చూచుకొని తలారి నెదిరింపగలడు? పటేలు గారు యితనిని చూచుటయే తడవుగ చేతిలోని కట్టెను సవరించుకొని మల్లనిపై బడెను. మల్లడేమైన మరల కొట్టగలడాయను ధైర్యముతో నతడు చేతులు నొప్పి యెత్తువరకు మర్దించెను. ఎంత కొట్టినను మల్లడు నోరైన యెత్తలేదు. తుదకు మల్లడు దెబ్బల కాగలేక స్పృహతప్పి పడిపోయెను. నెత్తి పైన బలమగు గాయము తగిలెను. నెత్తురు వరదలై ప్రవహింప దొడగెను. నెత్తురును కనుల చూచిన తోడనే పటేలు గారి కోపము శాంతించెను. అంత నాతడు తలారితో తన భృత్యుల నిద్దరిని బిలిపించి మల్లనిని యింటివద్ద విడిచి రమ్మనెను. వారును శవాకారముగా నున్న నాతనిని యింటికి కొనిపోయిరి. సుమారైదారు నెలల వరకును మల్లడు వ్యాధిపీడుతుడై కూర్చున్న చోట నుండి లేవలేని వాడై పడియుండెను. ఇన్ని దినములును తిన తిండిలేక, కట్టబట్టలేక ఆలుబిడ్డలు కృశించి యుండిరి. ఇది యంతయు కనులార జూచు చుండెడి పటేలుగారొక కాని సహాయమైనను చేయలేదు. రామిరెడ్డి ఎంత కఠినాత్ముడో పాఠకులే గ్రహించవలెను - ఇట్టి పటేండ్ల దేశము నందింకెంత మంది గలరో యూహించుకొనుడు.

క థ

# మా ఊరు

ప్రేమను
సందేశాత్మకం చేస్తున్న కథ...



బి.ఎస్. రాములు

సుజాత ఫోన్ చేద్దామని సెల్ ఫోన్ తీసేసరికి గోదావరి పంపిన వాట్సప్ మెసేజ్ కనపడింది. సారీ సుజాతా ! అని మొదలు పెట్టే సరికి గోదావరి మీద కోపం ముంచు కొచ్చింది.

"సారీ సుజాతా! నువ్వన్నట్టు చాలా కాలమై పోయింది. మనం కలిసి మల్ల పోవుడే కాలేదు. ఎపుడో కుక్కి, డొక్కు జీపులో పోయినం. ఆనాడు రోడ్డు సరిగ్గ లేక ఆ కుక్కి జీపులో ఎత్తేస్తుంటే నడుం విరిగినంత పనైపాయె. నీకు తొంటి పట్టుకునె! ఆ రోజులల్ల అన్ని వూర్లు గట్లనే ఉండెననుకో! జీపులు, ఎడ్లబండ్లు ఎక్కడవడితే అక్కడ బురద నీల్లల్ల దిగవడుతుండె.

అయితే ఆ మధ్య తార్రోడ్డు పడ్డదా! ఈ సారి ఇన్నోవా కారులో హాయిగా పోయి రావచ్చుంటవా! మునుపటి తీరు పోతె ఒకరోజు. వస్తె ఒకరోజు. మధ్యల ఒకరోజు. పోయి రావాలంటే మూడు రోజులు. ఇపుడు పొద్దున బయిలెల్లి రాత్రి వరకు మల్ల ఇంటికి చేరచ్చు అంటవు. మునుపటి తీరు ఇయ్యాల ఒక్కరోజైన ఉండుంద్రి. లేకపోతె ఎందుకచ్చినట్టు? అని ఇపుడెవలు బతిమాలెటోల్లు లేరంటవు. అందరిని కలిసి ఆపని కూడా చూసుకొని వెంటనే బయల్దేరి రావచ్చుంటవు.

మీ ఇన్నోవా కార్ల సుఖంగ పోయి రావచ్చుంటవు.

చింతకింది లచ్చన్న కొడుకు సంజీవ్ నీకన్న మూరెడు ఎత్తైండంటవు! ఔ కాడా

మరి! ఇపుడు పొలగాన్లు మస్తు పొడువు పెరుగుతన్నరు. మునుపు మనకు ఏం సుఖముండెనే! ఇపుడు సుఖంగ తింటున్నరు. సంజీవ్ ఉస్మానియాలో పి.జి చేసిండు! రైల్వే, బ్యాంకు, గ్రూపు పరీక్షలు రాసిండు! ఏదో ఒకటి వస్తదంటవు. లచ్చన్న తెలిసిన సంబంధం ఎత్తి పోవద్దని సంజీవ్‌ను తొందర పెడుతున్నడా? సంజీవ్‌కు ఆ సంబంధం ఇష్టం లేదా? మరి మనం పోయి ఎవరిని ఒప్పిచ్చుడు? తండ్రినా? కొడుకునా? సంజీవ్ గదుకే క్యాంపస్ ఇడిసి ఇంటికి పోతలేడా?

నిజమే గని మీ అక్క ఒప్పుకుంటదా? మీ బావ ఊకుంటడ? లచ్చన్న మాత్రం ఒప్పుకుంటడ?

సంజీవ్ కు ప్రతిమ అంటే ఇష్టం. ప్రతిమకు కూడా సంజీవ్ అంటే ఇష్టం. ఉస్మానియాలో వాళ్ళ స్నేహాలు, తెలంగాణ ఉద్యమంలో కలిసి పనిచేయడాలు ల్యాండ్ స్కేప్ గార్డెన్‌లో షికార్లు చర్చలు అన్ని వాళ్ళ మనసులు కలిపినై అంటవు.

నిజమేనే! వాళ్ళు మేజర్లు. వాళ్ళకు ఇష్టమైనపుడు మనం పెద్ద మనుషులుగ మాట్లాడితే మంచిదంటవు. మనం చేయకపోతే లేచిపోయి వాళ్ళే మ్యారేజి రిజిస్ట్రేషన్ చేసుకుంటే మన పెద్దరికం ఏం ఉంటదంటవు? మనమే మన చేతుల మీదుగా పెళ్లి జరిపిస్తే మంచిదంటవు. అది గూడ నిజమే!

కాని మీ పెదనాన్న ఊరుకుంటాడా? మీ పెద నాన్న ఆ వూర్లె ఇంకా పెత్తనమే సాగిస్తుండా? కొడుకు పెద్ద బిల్డర్లై పోయిండు. ఇంకా ఎందుకే ఊర్లె బోడి పెత్తనాలు? ఆ నడుమ జెడ్పీటీసీగా ఓడిపోయిండన్నవు. ఇంకా బుద్ధి రాలేదా? ఓ పెన్ల చింతకింది లచ్చన్న గెలిస్తే గూడ ఓర్వలేకే పోతుండన్నవు!

మరి గసొంటోడు గిట్ల లచ్చన్న కొడుకుతోని కులాంతర వివాహం మనం చేస్తం అంటె చూసుకుంటూ ఊకుంటడా? మనం మంచికి పోయి అందరికి కంటయితమా? ఆలోచించు!

'గోదావరీ! పెళ్లికి తల్లి దండ్రులు ఒప్పుకోలేదని నీహారిక, అబ్బాయి ఇద్దరు ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకునిరి. అది యాది కచ్చినపుడల్లా మనసుల కలకల అనిపిస్తది. గంతెత్తు పెరిగి, బుద్దెరిగిన పిల్లలు. వాల్లు పారి పోయినా, లేచిపోయి

కథ

పెండ్లి చేసుకున్నా మంచిగుండు! దానికి అమ్మా నాన్నలంటే ఎంత ప్రేమో..! ఎంత అటాచ్ మెంటో! నన్ను నా మనసును అర్థం చేసుకోలేదని అలిగి ఇద్దరు కలిసి సూసైడ్ చేసుకునిరి! పోగొట్టుకొని ఇపుడు ఏడ్వ వట్టిరి. గట్ల మల్లెవలు కావద్దు. మనమే ఒప్పించి పెండ్లి చేద్దామంటవు.'

అదే మండలంలో అందరిని కలిసి పిలిసి ఒప్పించి పెండ్లి చేయాలనే నీ ఆశయం మంచిదేనే! మనం మోరల్ సపోర్ట్‌గ నిలబడాలంటవు! పోగొట్టు కున్నంక ఎంత ఏడిస్తే ఏమస్తదంటవు! నీ హృదయావేదన అర్థం చేసుకోగలను.



సరే! పోదాం. ఎన్ని మాటలన్నా పడుదాం! జాహ్నవి, సీత, రమేష్ కూడ మనతో వస్తున్నరంటె నాక్కూడ సంతోషంగనే ఉన్నది. కాని పోయిన పని కాక నల్ల ముకంతోని వస్తే మధురమైన ఆనాటి తీపి జ్ఞాపకాలన్ని చేదైపోతయేమో! అట్లేం కాదు. ఊరు చాలా మారిందంటవు. మనుషులు చాలా మారిన్రంటవు!

ఎం.పి లాడ్స్‌తో రచ్చబండ చౌరస్తా కాడ పెద్దలైట్లు పెట్టిన్రంటవు!

ఊర్లె లైబ్రరీ పెట్టిన్రంటవు! ఆ వూర్లె టీవీ డిష్ కనెక్షన్లు మూడు వందలైనయా? ఇంకేందే? ప్రపంచమే ఆ వూర్లెకు వచ్చింది. ఇంక దాన్ని పల్లెటూరని ఎట్లంటవు? రోజుపాల వ్యాన్ల జగిత్యాలకు పాలు పోతున్నయంటవు! రెండువందల డెబ్బయి మంది రోజు జగిత్యాలకు ప్రయివేటు స్కూల్లకు పోతున్నరంటవు! తెలంగాణ గ్రామీణ బ్యాంకు పెట్టిన్రంటవు.

హైదరాబాద్ల నలుబయి కిలోమీటర్ల దూరం వున్నా సిటీ అనే అంటున్నం!

మరి ఆ వూరు జగిత్యాల కు పది పన్నెండు కిలోమీటర్లు గూడలేదు. అందుకని అది మునుపటి పల్లెటూరు తీరుగ ఎట్లుంటదంటవు? ఆ వూర్లె తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు చాకలి అయిలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ, కె. జయశంకర్ సార్ విగ్రహాలు పెట్టిన్రంటవు! చైతన్యం బాగా పెరిగిందంటవు! ఇపుడు సంజీవ్ ప్రతిమను చేసుకుంటే ఆ వూర్లె

> **"సారీ సుజాతా! నువ్వన్నట్టు చాలా కాలమై పోయింది. మనం కలిసి మల్ల పోవుడే కాలేదు. ఎపుడో కుక్కి డొక్కు జీపులో పోయినం. ఆనాడు రోడ్డు సరిగ్గ లేక ఆ కుక్కి జీపులో ఎత్తేస్తుంటె నడుం విరిగినంత పనైపాయె. నీకు తొంటి పట్టుకునె! ఆ రోజులల్ల అన్ని వూర్లు గట్లనే ఉండెననుకో! జీపులు, ఎడ్లబండ్లు ఎక్కడవడితే అక్కడ బురుద నీల్లల్ల దివదుతుండె.**

అదేమంత కొత్త విషయం కాదని సంతోషం పడుతరంటవు!

సరే నువ్వన్నట్టే కాని! మా ఆయనను రెండు రోజులు స్వంతంగ వంట చేసుకొమ్మంట! అందరం ఒకే ఇన్నోవా లో ముచ్చట్లు పెట్టుకుంట కలిసే పోదాం!

మాట ముచ్చట అయితే ఎంగేజ్ మెంటుకూడ అదే రోజు చేద్దామంటవు! జెడ్పీపీ చైర్ పర్సన్ రమ కూడ యాల్లకు వస్తదంటవా? నీది మాస్టర్ మైండే! తప్పక పోదాం! పుణ్యకార్యం గదా! మరి సంజీవ్‌కు చెప్పు! పిలువంగనే పది నిమిషాల్ల ప్రతిమ గూడ దోస్తులతోని వచ్చేటట్టు... జగిత్యాల చేరి రెడీగ ఉండుమని చెప్పు! అదే రోజు ఎంగేజిమెంటుతో పాటు అవే ఫోటోలతో వీలైతే అదే రోజు మ్యారేజ్ రిజిస్ట్రేషన్ కూడా చేపిద్దాం. వాళ్ళను డేటాఫ్ బర్త్ సర్టిఫికేట్ కూడా రెడీగ ఉంచుకొమ్మని సంజీవ్‌కు చెప్పు! ప్రతిమకు చెప్పుమను!"

వాట్సప్‌ల గోదావరి పంపిన మెసేజ్ చూసి సుజాతకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. ప్రోగ్రాం ఫిక్స్ చేస్తూ చింతకింది లచ్చన్నకు, సంజీవ్‌కు, అందరికి ఫోన్లు కలిపింది సుజాత.

(తమ ప్రేమను అంగీకరించలేదని అమ్మా నాన్నల మీద అలిగి జగిత్యాల పక్కన గల హైదర్ పల్లెలో ఆత్మహత్య చేసుకున్న యువ ప్రేమికులకు...... మల్లా అలా జరగకూడదని ఆశిస్తూ కన్నీటితో అంకితం).

# భారతీయ సాంస్కృతిక వైభవం - జాషువా సాహిత్యం

జాషువా కవిత్వం లో
సాంస్కృతిక కోణం ఆవిష్కరించిన వ్యాసం...



డా॥ సిద్దెంకి యాదగిరి

'వడగాడ్పు- నా జీవితమైతే, వెన్నెల - నా కవిత్వం' అని తన గురించి తాను చెప్పుకున్న కవి. అవమానాల జడివానలో తడిసి సన్మానాల శాలువాలతో వినూత్నంగా విరాజిల్లే వరకు అవిశ్రాంత కృషి చేసిన సాహిత్య కృషీవలుడు. అక్షర జ్ఞానం లేనితనం నుంచి అక్షర శాసనాలను రూపొందించిన అనఘుడు. అవమానాలను ఆయుధాలు చేసుకుని అజరామర కీర్తి పొందిన సాహితీ గేస్తుడు. పేదరికం పెద్ద విద్యాశాల. లజ్జ కానబడదని వ్యక్తీకరిస్తూనే కాలాన్ని కైగట్టి, పొడిచేటి పొద్దు మీద, నడిచే సాహిత్యాకాశంలో అస్తమించని ఆధునిక పద్య భాస్కరుడు. పురివిప్పిన కావ్య పుంజమై తెలుగు సాహిత్య లలాటంను సువర్ణ లిఖితం చేసిన పరిమళ సింధూరం గుర్రం జాషువా.

జాషువా తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు జీవించే సజీవ కవి. ఆధునిక కవుల్లో అత్యాధునికుడు. ఆలోచనల్లో మేథ. అవమానాలే గాథలు. భారతీయ సాంస్కృతిక వైభవాన్ని జాషువా దృక్పథంలోంచి పర్యాలోచన చేద్దాం. ఆధునిక తెలుగులో అజరామర కవి గుర్రం జాషువా (సెప్టెంబర్ 28, 1895 - జూలై 24, 1971). జన్మస్థలం వినుకొండ గుంటూరు. పుట్టింది చిన్న గ్రామమే. ఆకాశమే హద్దుగా ఎదిగిన కవి. హృద్యంగా పద్యంతో తెలుగు వారికి వండివార్చిన రస నైవేద్యం.

**సాంస్కృతిక వైభవం...**

సమాజంలోని మానవులు అలవర్చుకున్న జ్ఞానమూ, నమ్మకాలూ, కళలూ, నీతులూ, చట్టాలూ, ఆచారాలూ, అలవాట్లూ ఇంకా ఏయే విషయాలనైతే మానవులు అలవర్చుకుంటారో, ఆ విషయాలన్నింటినీ కలుపుకుని ఆ మొత్తాన్ని 'సంస్కృతి' అనవచ్చు - అని టైలర్ చెప్పాడు.

సమాజపు ఆర్థిక నిర్మాణ చట్రం ఆ సంబంధాల అసలైన పునాది. ఆ పునాది మీదనే చట్టబద్ధ, రాజకీయ ఉపరి నిర్మాణం వేస్తుంది. సామాజిక చైతన్యానికి సంబంధించిన ప్రత్యేక రూపాలు, దానికి అనుగుణంగానే ఉంటాయి. భౌతిక జీవితానికి సంబంధించిన ఉత్పత్తి విధానమే, మొత్తం మీద, సామాజిక- రాజకీయ, బౌద్ధిక జీవిత క్రమాన్ని నిర్దేశిస్తుంది." (మార్క్స్, 1859. 'అర్థశాస్త్ర విమర్శ చేర్పు'కి రాసిన ముందు మాటలో- మార్క్స్, ఎంగెల్స్ 'సంకలిత రచనలు' 2వ భాగం. 'ప్రగతి' ప్రచురణాలయం, మాస్కో 1981)

సంస్కృతి (లాటిన్, స్పానిష్, పోర్చుగీస్ Cultura, ఫ్రెంచ్, ఆంగ్లం Cultura, జర్మన్, స్వీడిష్ Kultur) అనేది మానవ సమాజం జీవన విధానంలో ప్రముఖమైన విషయాలను - అనగా జీవనం, ఆచారాలు, వ్యవహారాలు, ప్రమాణాలు, మతం, సంబంధాలు, పాలన - వంటి వాటిని సూచించే పదం. దీనికి ఆంగ్ల పదమైన కల్చర్ (సంస్కృతి) లాటిన్ పదం. కల్చుర లేదా కొలెరె అనేవి "పండించడం." అనగా వ్యవసాయం చేయడం నుండి ఉద్భవించాయి.

భారతదేశం భిన్న సంస్కృతుల ఏకత్వం. భారతదేశం లోని వివిధ భాషలు, మతాలు, సంగీతం, నృత్యం, ఆహారం, నిర్మాణ కళ, ఆచారాలు, వ్యవహారాలు దేశంలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో విధంగా వైవిధ్యంగా ఉంటాయి. భారతీయత అనేక సంస్కృతుల సమ్మేళనంగా పిలువబడుతున్నది. భారత్‌లో ఉన్న భారతీయ మతాలు, భారతీయ తత్వశాస్త్రం, భారతీయ వంటకాలు వంటి అనేక అంశాలు ప్రపంచవ్యాప్తంగా బలీయమైన ప్రభావం కలిగి ఉన్నాయి.

భారత దేశం ఎంతో వైశిష్ట్యం గల

వ్యాసం

దేశం. (బ్రహ్మ, విష్ణు, శివుడు) త్రిమూర్తులకు ఉగ్గు పెట్టావు. బ్రహ్మ అంతటి వాడిని వణికింపజాలిన మునులను భరించినావు. దేశంలో మునులు ఋషులు, తపస్సులు, కళాకారులు, కవుల ప్రతిభ నుంచి ఈ దేశాన్ని జాషువా వివరిస్తూ...

"ఉర్వి పుట్టకముందే నీవుంటె వేమొ సకల శాస్త్రపురాణముల్చదివినావు

గౌన బుసిరిగల భాగ్యపు నిధివి నీవు, భారతంబ మణీ! నమస్కార మమ్మ!

యైకమత్యంబం గలిగి నిన్న భవించు, కొరత పూరింపవే మాకు భరత మాత"

అని ఈ ప్రపంచం పుట్టకముందే నీవు సకల పురాణాలు చదివావు. గౌనబుసిరి గల సిరిసంపదలు గల భాగ్యశాలివి నీవు. ఓ భారతమాత నీకు నమస్కారమమ్మ అని ప్రణుతించినాడు.

**చరిత్ర...**

నిన్నటి గత వైభవోపేతమైన వర్తమాన వ్యవహారాలు, గొప్పతనాన్ని అభివ్యక్తి చేస్తాడు.

హరిశ్చంద్రోనలో రాజ, పురుకుత్స: పురూరవా: / సగర: కార్త వీర్యశ్చ, షడేతే... చక్రవర్తిన: అనే శ్లోకంలోని అంతరార్థాన్ని జాషువా ఒకే పద్యంలో గొప్పగా చెప్పిన విధం చూడండి.

"సగర మాంధాతాది షట్చక్రవర్తుల / అంక సీమలనిలిపినట్టి సాధ్వి ....

సింధు గంగానదీ జల క్షీరమెప్పుడు / గురిని బిడ్డల పోషించుకొనుచున్న

పచ్చి బాలెంతరాలు మా భరతమాత / మాతలకు మాత సకలసంపత్సమేత."

అని షట్చ చక్రవర్తుల గొప్పతనము, కాళిదాసాది సత్కవి కుమారులతో కీర్తి పొందింది. బుద్ధాది మునుల తపంతో అనేక కన్నీళ్ళకు కారణాలు కనుగొన్నాయి. జీవనదుల వల్ల ఈ దేశపు పిల్లలే నిత్యం సాదుతున్న పచ్చి బాలింతరాలు అని వ్యక్తీకరిస్తాడు.

భారతీయతను తన అనేక పద్యాలలో వివరించాడు.

**శిల్పకళా వైభవం...**

కళలతో తులతూగుతున్న శిల్ప సంపద గల దేశం భారత దేశం. శిల్పానికి మొక్కుతున్న సమాజం శిల్పిని, శిల్పి జీవన స్థితిగతులను మరిచిపోయిన విషయాన్ని గుర్తుచేస్తాడు. స్ఫురణకురాని అంశాలను వెతికి తీయడమే జాషువా ముఖ్య ధ్యేయం. శిల్పిని స్తుతిస్తాడు.

'సున్నితమైన నీ చేతి సుత్తె నుండి
బయలుపడె ఎన్ని ఎన్ని దేవస్థలములు
సార్థకము గాని ఎన్ని పాషాణములకు
గలిగె నీనాడు పసుపు కుంకుమల పూజ'

అని శిల్పి గురించి చెబుతాడు. ఓ శిల్పి సున్నితమైన నీ చేతిలో ఉండే సుత్తి నుండి ఎన్నో గొప్ప గొప్ప శిల్పాలు బయటపడ్డాయి. ఏమిటికీ పనికిరాని రాళ్ళకు పసుపు కుంకుమల పూజ కొనసాగుతున్నది. ఇదంతా శిల్పి నైపుణ్యం వల్లనే.

కవి కలంబునగల అలంకార రచన కలదు కలదోయి శిల్పి నీ యులి ముఖమున గాకపోయినా పెను రాతి కంబములకు / కుసుమవల్లరులే రీతి గుచ్చినావు' అని కవికీ శిల్పికీ ఎలాంటి తేడా లేదని చెబుతూ కుసుమ వల్లరు లేరీతిగా గుచ్చుతావు? అని ప్రశ్నిస్తాడు. కవనమున చిత్రములు కూర్చు కవికి నీకు తారతమ్యం లేదు అబద్ధం కాదు అని చక్కగా చెబుతాడు.

"జగంబులోన చిర జీవిత్వంబు సృష్టించుకోగల నీకెవ్వరు సాటి వచ్చును నమస్కారంబు నీ ప్రజ్ఞకున్" అని

> **గబ్బిలం కావ్యంలో గబ్బిలానికి తోవ చెప్పుతూ ఈ దేశంలోని ప్రతి స్థలంలోని గొప్ప తనాన్ని రంగరిస్తాడు. చారిత్రక గత వైభవ విశేషాలను దృశ్యీకరణ చేసి పాఠకుల మదిలో సింగారిస్తాడు. మందిరాలను, శిల్పకళా నైపుణ్యాలను, పేరు ప్రఖ్యాతులను ఆవిష్కరిస్తాడు.**

సంస్కారంతో శిల్పికి వారెకాక మనతో నమస్కార హృదయం కలుగజేస్తాడు. గురువు దైవము ఇద్దరూ ఒకేసారి ప్రత్యక్షమైతే నేను గురువుకు దండం పెడతా అని అన్న కవి కబీర్ మాటలు ఇక్కడ సంఘసంస్కరణ సాహిత్య దృష్టితో చూస్తే దేవుని పరిచయం చేసిన శిల్పికే మొక్కుతానంటాడు జాషువా.

గబ్బిలం కావ్యంలో గబ్బిలానికి తోవ చెప్పుతూ ఈ దేశంలోని ప్రతి స్థలంలోని గొప్ప తనాన్ని రంగరిస్తాడు. చారిత్రక గత వైభవ విశేషాలను దృశ్యీకరణ చేసి పాఠకుల మదిలో సింగారిస్తాడు. మందిరాలను, శిల్పకళా నైపుణ్యాలను, పేరు ప్రఖ్యాతులను ఆవిష్కరిస్తాడు.

**సాహిత్య వైభవం...**

సాహిత్యం సాంఘిక, సమకాలీన అంశాలను దర్పణం పడుతుంది. భారతీయ సాహిత్యం, వివిధ భాషల సాహిత్యం, తెలుగు కవులు, సాహిత్య పోషకులను కొనియాడినాడు జాషువ. సంస్కృత సాహిత్య విశేషాలను ఉగ్గడిస్తాడు. అక్షరాలతో దేదీప్యమానం చేస్తాడు.

"కాళిదాసాది సత్కవి కుమారుల గాంచి / కీర్తి నందిన పెద్ద గేస్తురాలు"

అని కాళిదాసు, దండి, భవభూతి మొదలైన వాళ్ళను, వారు సృజించిన సాహితీ సేవను కొనియాడుతాడు.

తెలుగు ఆదికవి నన్నయ్య, తిక్కన్న, శ్రీనాథుడు, వేమనలాంటి కవుల సాహిత్య వైభవాన్ని కొనియాడుతాడు.

**పండుగల గురించి...**

తెలుగు వారు పండుగలు, వ్రతాలు, నోములు, పూజలు ఎంతో భక్తి శ్రద్ధలతో చేస్తారు. ఆ పండుగల గురించి వివరిస్తాడు.

ఉగస్య ఆది అనేదే ఉగాది. "ఉగ" అనగా నక్షత్ర గమనం - జన్మ - ఆయుష్షు అని అర్థాలు. వీటికి 'ఆది' అనగా మొదలు 'ఉగాది'. అనగా ప్రపంచం గమనంలో మొదటిరోజు కనుక ఉగాది అయింది. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల

వ్యాసం

పాడ్యమి నాడే అనగా ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణాలలో చెప్పబడింది. పండుగలు ఆయా ప్రాంతాల్లోని ఆయా సమూహాల ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తాయి. తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాదిగా పిలవబడుతుంది. ఈ ఉగాదికి ఒక్కో సంవత్సరం ఒక్కో పేరు ఉంటుంది. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలకడం ఉగాది యొక్క ప్రధాన ఉద్దేశం ప్రతి నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు ఇవ్వాలని ప్రతి కవి కోరుకుంటాడు.

"దరియున్ దాపు లేని కాల్గ మన్వంతరవృత్తి నీళ్ళాడగా ఖర సంవత్సర బాలకుండిపుడు సాక్షాత్కారమున్ చెంది.... నూత్న సమాజానికిన్" అని పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన ఖర సంవత్సరాన్ని జాషువా ఆహ్వానిస్తాడు.

సంక్రాంతి అనగా నూతన క్రాంతి. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు. అయితే ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారు. ఈ పండుగను పెద్ద పండుగగా ఆంధ్రులు జరుపుకుంటారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాలగవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటి రోజు భోగిమంటలతో,



రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గో పూజలతో అలాగే మాంసప్రియులకు మంచి కూరలతో, మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుంది.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరొక ఒక ప్రముఖమైన పండుగ సంక్రాంతి. ఈ సంక్రాంతి ముందే వ్యవసాయదారుల పంటలు ఇంటికి వస్తాయి. ఈ సంక్రాంతి లో పిండి వంటలు రంగవల్లులు గంగిరెద్దులాటలు. కోడి పందాలు. రకరకాలైన కార్యక్రమాలు నిర్వహించబడతాయి. సంక్రాంతి గురించి జాషువా ఒక పద్యంతో

"ఒడలన్, జెమ్మటలూర కర్షక జన వ్యూహంబు రేయింబవల్
పుడమిన్ దున్నిన దీర్ఘ కష్ట ఫలితం బున్ ధాన్య రూపంబుతో
నిడి విశ్రాంతి యొసంగ పండగవు, దేవీ! నీవు ఆనందపు
కడలిన్ నేల సమస్త లోకమును సంక్రాంతీ నమోవాకముల్."

ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు పరువు నిష్టగా ధ్యానించే అంశం సిలువ వేత. అందరి పాపాల నిమిత్తం ఏసు క్రీస్తుప్రభువును, వారు మరణించిన విషయాన్ని ప్రస్తావిస్తూ తన 'సిలువ వేత' ఖండకావ్యంలో

"కర చరణాంగకములలో
నరములు నెమ్ములు చిదికి నవ నాడులలో
మెరుపులు మెరియ బిగించిరి
మర మమేకులతో శిలువ మాను క్రీస్తున్."

అని క్రీస్తు పొందిన బాధలను మర మేకులతో అరచేతుల్లో అరికాళ్ళలో మేకులు కొట్టి నప్పుడు నవనాడుల బాధను అనుభవించాడు అని చెప్తుందా పద్యం. వీరి క్రీస్తు చరిత్ర కావ్యంకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్న రచన.

**జాషువా తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు జీవించే సజీవ కవి. ఆధునిక కవుల్లో అత్యాధునికుడు. ఆలోచనల్లో మేథ. అవమానాలే గాథలు. భారతీయ సాంస్కృతిక వైభవాన్ని జాషువా దృక్పథంలోంచి పర్యాలోచన చేద్దాం. ఆధునిక తెలుగులో అజరామర కవి గుర్రం జాషువా (సెప్టెంబర్ 28, 1895 - జూలై 24, 1971). జన్మస్థలం వినుకొండ గుంటూరు. పుట్టింది చిన్న గ్రామమే. ఆకాశమే హద్దుగా ఎదిగిన కవి. హృద్యంగా పద్యంతో తెలుగు వారికి వండివార్చిన రస నైవేద్యం.**

జాషువా ఒక కంట కన్నీళ్ళని, మరో కంట కారుచీకట్లను ఏక కాలంలో కాంచుతాడు. ఈ రెండు వైరుధ్యాలు ఒకే పద్యంలో వ్యక్తీకరించే నేర్పు జాషువా సొంతం. 'గబ్బిలం' కావ్యంలో పండుగల గురించి వివరిస్తూ

"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయింత్రు గాని" అనే ఒక్క మాటతో ఈ దేశం దేవుళ్ళ పెళ్లిళ్లకు లక్షలు, కోట్లు వెచ్చిస్తారు. పక్కనే ఆకలి బాధితున్ని ఏమాత్రం కనికరించరనే విషయాన్ని కళ్ళకు కడుతాడు.

గోపూజ: భారతీయ సంస్కృతిలో గోవును గోమాతగా పూజిస్తారు. అలాంటి గోమాత మీద తన పద్యం వింటుంటే అనంతమాత్యుని పద్యాలు గుర్తుకు రాకమానవు. నన్ను అర్థం చేసుకోవడానికి నా కన్నీటి సమన్వయం సేయ అర్థ హృదయంబు కొంతవసరము అని చెప్పుకున్నట్లు గోమాతతో తదాత్మ్యం చెందుతాడు.

"అనుగు లేదూడ యంభారావ మాలించి పొడుగునా దుగ్ధంబు పొంగిపోవ...

అత్రు నాకేడు నిను గాంచి యాగ్రహించి, బడియ చేబూని దండించు స్వామి నరసి కలత చెందక అవ్వలకు బోవు, నీదు సహనంబు నా గుండె నీరు సేయు" తన బిడ్డ (దూడ)కు పాలిస్తున్నపుడు పాలు ఇస్తూ యజమాని దండిస్తుంటే తొణకకుండా ఆవలికి పోతుంటావు. నీ సహనం చూస్తే నా గుండె తరుక్కు పోతుందని బాధపడుతాడు.

మేఘుడు, దుర్యోధనుడు, కృష్ణుడు, మొదలైన పురాణ పాత్రల్ని, బుద్ధుడు మొదలైన పాత్రల్ని అద్భుతంగా వర్ణిస్తాడు. స్త్రీల గురించి, ప్రకృతిని కడు రమ్యంగా ఆవిష్కరిస్తాడు. శిశువు పద్యాలు నెమరువేయని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కాదేదీ కవితకనర్హం అన్నట్లు శ్మశాన పద్యాలు వింటే ఇహలోక సౌభాగ్యల మీద వైరాగ్యం పుట్టకమానదు. ఆగర్భ దరిద్రుడు, ఆగర్భ శ్రీమంతుడు కలుసుకునే శ్మశానాన్ని భస్మ సింహాసనం అని సంబోధిస్తాడు.

**దేశ భక్తి...**

జాషువాకు దేశమన్నా, దేశభక్తి అన్నా వల్లమాలిన ప్రేమ. అయన పద్యాలు ఆనాటి సమాజాన్ని ప్రతిబింబిస్తాయి. స్వాతంత్ర ఉద్యమ నేపథ్యంగా ఎన్నో కావ్యాలు వచ్చాయి. జాషువాది విభిన్నమైన శైలి. స్వాతంత్ర ఉద్యమాన్ని వధువుగా ఈ దేశ ప్రజలందరూ వరులుగా భావించి రాసిన కావ్యం స్వయంవరం. శాంతి సత్యం అహింసా పద్ధతుల్లో స్వాతంత్రం సాధించిన ప్రపంచంలో ఏకైక దేశం భారతదేశం. భారత స్వాతంత్ర సమరోత్సాహన్ని పొగడిన విధానాన్ని చూస్తే అబ్బురమనిపించక మానదు.

"సేతు శీతాద్రి వరకు భాసించి ఆంగ్ల గజము నెదురించి తొడగొట్టు గడియెలవ్వి" అని ఆ కాలాన్ని తన పద్యాల్లో స్వాతంత్ర్యోద్యమము ఖండకావ్యం లో నిక్షిప్తం చేస్తాడు.

చైనా - భారత యుద్ధం జరిగినప్పుడు తన పద్యాల ద్వారా ఆనాటి మానసిక ఉత్పరివర్తనాలు అభివ్యక్తి గావించాడు. "చైనీయ రుధిరనిర్జరుల స్నానము చేసి భారత సైనికకోటి మరలు దాక" ఊరుకోదని చెబుతాడు.

అటల్ బిహారీ వాజపేయిగారు ఇందిరాగాంధీని కొనియాడిన విషయం స్మరించేలా "మంచుమల మీద దృష్టి కెత్తించుదాకా / నిద్రవోవదు భారత కాళి నేడు" అని పేర్కొంటాడు.

గాంధీ, నేతాజీ, సర్దారు పటేల్, అంబేడ్కర్ మొదలైన వారి కీర్తిని అద్భుతమైన పద్యాలతో అలంకరించాడు. దేశభక్తిని అత్యున్నతిగా ప్రశంసిస్తాడు.

**పరహితాన్ని కోరడం...**

ఈ దేశంలో అసహనం పెరుగుతున్న కాలానికి పొంచి పెట్టుకున్న తీరున అగుపించక మానదు. అంటరానితనం నిరసిస్తూ పల్నాటి గాథలని వివరిస్తాడు.

"అంటరానితనంపు అడుసులో దిగబడ్డ కడజాతులకు ముక్తికలుగజేసి ప్రజల రక్తము ద్రావు రణపిశాచులనెల్ల

**మే**ఘుడు, దుర్యోధనుడు, కృష్ణుని వర్ణన, మొదలైన పురాణ పాత్రల్ని, బుద్ధుడు మొదలైన పాత్రలు అద్భుతంగా వర్ణిస్తాడు. స్త్రీల గురించి, ప్రకృతిని కడు రమ్యంగా ఆవిష్కరిస్తాడు. శిశువు పద్యాలు నెమరువేయని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కాదేదీ కవితకనర్హం అన్నట్లు శ్మశాన పద్యాలు వింటే ఇహలోక సౌభాగ్యల మీద వైరాగ్యం పుట్టకమానదు. ఆగర్భ దరిద్రుడు, ఆగర్భ శ్రీమంతుడు కలుసుకునే శ్మశానాన్ని భస్మ సింహాసనం అని సంబోధిస్తాడు.

దశదిశాంతములకు తరిమివేసి .....

పావనంబగు మానవత్వము సృజించి ధర్మమును ప్రతిష్ఠించు నుద్యమము నాది" అని బ్రహ్మనాయుడి అంతరంగావిష్కరణ గావిస్తాడు.

**జోల పాటలు:** చిన్న పిల్లలను నిద్ర పుచ్చడానికి తల్లులు పాడే పాటలే జోలపాటలు. జనపదబాణీలోనూ ఉంటాయి.. శివాజీ వీరుడవ్వడానికి తల్లి ఉగ్గుపాలతో నేర్పిన వీరగాథలే పురికొల్పాయి. జాషువాగారు రాసిన జోలపాటలో ఆంధ్ర సాంస్కృతిక వైభవం కళ్ళకుకడుతాడు. తల్లుల నోట పాడే పాటలో గత ప్రాశస్త్యాన్ని వివరిస్తాడు.

"చిచ్చో హాయీ, ఏడువకు నాయన్న!- ఏడువకు తండ్రి!,

ఏడిస్తే నీ కండ్లు-ఎరుపెక్కుతాయి, ఎరుపుజూచి తల్లి-కరిగిపోతాది

ఖడ్గ తిక్కన పంచ-కళ్యాణి హయము, సకిలించి నాయన్న-సరస నిల్చింది అని రెడ్డి రాజులు, ఆంధ్ర పౌరుష శక్తి, ఓరుగంటి, కొండవీటి రెడ్లు, కృష్ణరాయని, అభిమన్యుని, భీమసేనుని,..... పరాక్రమ శక్తుల్ని వివరిస్తాడు.

**లుప్తమవుతున్న సంస్కృతి...**

పైన పటారం లోనలొటారమన్నట్లుగా

వ్యాసం

ఉన్న సంస్కృతిని చూసి బాధపడుతాడు. ఆధునికతల వల్ల ధ్వంసమవుతున్న నాగరికతను చూసి జాలిపడుతాడు. కవిగా మేల్కొని అందులోంచి మనల్ని మేలుకొల్పుతాడు. మనుషులకు కట్టుబాట్లు లేవు, ఆచారములు లేవు. సంప్రదాయములు లేవు. ఆధునిక నాగరికతను వివరిస్తున్నారు.

కట్టుబాట్లు లేకపోవడం వలన పతనానికి కారణమవుతున్న సంస్కృతిని నూతన నాగరికత అని పిలువడం ఎంతవరకు సమంజసం అని ఎత్తిపొడుస్తాడు.

"హృదయానలేని లాహిరీ భక్తిభావంబు నటియించి యభివాగ్దానంబు లిడుట తనవారు కాకపోయిన్ మహేంద్రుడకాని పొరపొచ్చెముల నాడిపోసికొనుట"

శపథాలు పదివేలు సలిపి యాసలు



గొలిపి విసిగించి మొగము దప్పించుకొనుట, ముక్కు మొకం తెలియకున్న మహేంద్రుడని పొగడుట. భక్తి భావం లేకున్నా నమస్కారం చేయడం, పొరపొచ్చములు ఆడిపోసుకొనుట, అవసరానుసారం హామీలు ఎన్నో ఇచ్చి మొకం దాచుకొనుట మొదలైనవి నేడు ఎన్నో చేస్తున్నారు.

భారతీయ సంస్కృతి తన పద్య కావ్యం, ఖండ కావ్యం, నాటకాలు, సినీ గీతాలలో నభూతో నభవిష్యతి అన్నట్లు చిత్రించి తెలుగు సాహిత్యంలోనే గాకుండా విశ్వ నరుడుగా ఆలోచించి, విశ్వకవిగా నిలబడ్డాడు. విశ్వ విఖ్యాత సాహిత్యాన్ని సృజించినాడు. నాలుగు కాలాలు నిలిచే సాహిత్యాన్ని సృజించి తెలుగు పాఠకుల హృదాయాల్లో "సుకవి" జీవించే ప్రజల నాలుకలపై అన్నట్లు తాను జీవిస్తూనే ఉంటాడు. భారతీయ సాంస్కృతిక వైభవాన్ని, వారి పద్య మాధుర్యాన్ని ఆస్వాదించడానికి ఒంటపట్టించుకోవాలి. జాషువా శ్రేష్ఠతని ఆవాహన చేసుకోవాలి. ఆచరించాలి. ఆ సాహిత్యాన్ని పాఠాలుగా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి. వారి ఆశయ సాధనలో మనమూ విశ్వ నరులమవ్వాలి. విశ్వ మానవ విపంచులమై వెలుగొందాలి. మనమిచ్చే అసలైన నివాళి అదే.

దృశ్య సాహిత్యం

# స్పాట్ లైట్




చిత్రం: **స్పాట్ లైట్,**
దర్శకుడు : **థామస్ మెక్ కార్తీ**, భాష : **ఇంగ్లీష్**

స్పాట్ లైట్ చిత్రం బోస్టన్ నగరంలో జరిగిన నిజ జీవిత కథ ఆధారంగా జాన్ సింగర్ రాసిన ఈ కథని ప్రముఖ దర్శకుడు మెక్ కార్తీ తెరకెక్కించారు. 2001లో, ది బోస్టన్ గ్లోబ్ యొక్క సంపాదకుడు మార్టి బారన్ 80 మందికి పైగా అబ్బాయిలను పూజారి అయిన జాన్ జియోఘన్ వేధించాడని ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి పాత్రికేయుల బృందాన్ని నియమిస్తాడు. ఎడిటర్ వాల్టర్ "రాబీ" రాబిన్సన్ (మైఖేల్ కీటన్) నేతృత్వంలో, విలేకరులు మైఖేల్ రెజెండెస్ (మార్క్ రుఫలో), మాట్ కారోల్ మరియు సాచా ఫైఫెర్ ఇంటర్వ్యూ బాధితులు మరియు సున్నితమైన పత్రాలను తెరవడానికి ప్రయత్నిస్తారు. రోమన్ కాథలిక్ చర్చిలో లైంగిక వేధింపులను కప్పిపుచ్చకుండా రుజువు చేయడం విలేకరుల లక్ష్యం.ఎవరు నమ్మలేని విధంగా ఒక చర్చ్ లో పిల్లలని వేధించడం ఎక్కడ చూడలేని వింతగా ఉంటుంది. ఈ బాధితుల్లో చాలామంది స్పాట్ లైట్ బృందానికి చాల సహకరిస్తూ వాళ్లు పడ్డ వేదనను వివరిస్తారు దీని ద్వారా వాళ్ళందరినీ తన విచారణలో తెలుసుకొని అందరికి శిక్ష పడేలా చేస్తుంది స్పాట్ లైట్ బృందం.స్పాట్లైట్ "లోతైన సత్యాన్ని కూడా చూపిస్తుంది, దుర్వినియోగం వల్ల కలిగే మానసిక గాయం, బాధితులకు మాత్రమే కాకుండా ప్రతిచోటా భయపడిన కాథలిక్కులకు." స్పాట్లైట్ "విశ్వాసాన్ని కలిగిస్తుంది. మాజీ పూజారి మరియు మానసిక వైద్యుడు ఇందులో ముఖ్యమైన పాత్రలు . "మార్క్ తన నటనతో ప్రపంచ స్థాయిలో ప్రేక్షకులను మాద్యులేట్ చేస్తాడు. దర్శకుడు మెక్కార్తీ మరియు అతని బృందం ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు బోస్టన్‌ను నగరాన్ని చూపించడం చాల కొత్తగా ఉంటుంది. "బోస్టన్" నగరం దాని గందరగోళ వలస-యుగ వీధులు మరియు చర్చి స్క్వేర్స్ ఆచరణాత్మకంగా ప్రతి మూలలో ఆకాశంలోకి దూసుకెళ్లడం సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే కూడా అద్భుతంగా ఉంటుంది ఆ విభాగంలో కూడా ఆస్కార్ అవార్డు లభించింది.

# వరూధినీ ప్రవరులు

## మార్కండేయ పురాణం - మారన



క్రీ.శ.1289-1323 తెలుగులో తొలి పురాణానువాదం చేసినకవి మారన. ప్రతాపరుద్రుని సేనాని గన్నయమంత్రికి అంకితం చేశాడు. గోదావరీ తీర ప్రాంతం. మార్కండేయ పురాణంలో అనేక కథలున్నాయి. వాటిని ప్రబంధశైలికి మార్చి అనువదించాడు మారన. వరూధినీ ప్రవరాఖ్యుల కథ మార్కండేయ పురాణంలోనిది. ఆ కథానువాదంలోని ఒక సన్నివేశం. హరిశ్చంద్రుని కథ మొదలైనవి ఈ పురాణంలో ఉన్నాయి. వాటిని కావ్యాలుగా తీర్చిదిద్దాడు. తరువాత ఎందరో కవులకు మార్గదర్శకుడు మారన.

చ. అనికడువంతగూరుచు హిమాద్రితటంబున సంచరించు వి
ప్రుని మకరాంకసన్నిభుని వరూధిని నాజను నొక్క యప్సరాం
గన లలితాంగ కాంతిజిత కాంచన విభ్రమచంచదబ్జలో
చన కలహంసయాన కని సంభ్రమసంచలితాంతరంగయై

ఉ. ఈ సుకుమారుడెవ్వరొకొ యిందులకెందుల నుండి వచ్చెనో
భాసుర దివ్య రూపజిత భావజ చంద్రుడితండు రాగలీ
లాసరసత్వమెన్న కడు లాలసుడైనను జూచెనేని నే
జేసిన పుణ్యమెవ్వరును జేయరు కాముని దక్కనేలుదున్

గీ. ఈ కుమారునిమీద నాహృదయమిప్పు
డధికరాగరసోద్రిక్తమైనమాడ్కి
నితని మనమును నాయందు నతులరాగ
లలితమగునేని యది జన్మఫలముగాదె

సీ. భక్ష్యభోజ్య లేహ్య పానీయములు రత్న
మండపములు వస్త్రమాల్యములును
కర్పూరచందన కస్తూరికాదులు
నేనర్థియాగొని నింపుమిగుల
గా సుఖించుచులీలగంధర్వ కిన్నర
వేణు వీణాగీత వివిధ గతులు
వినుచు మందానిలంబనుభవించుచు నిమ్మ
హా శైలసానుపర్యంకతలము

గీ. నందు రమియింపు భవదీయ మందిరమున
కలుగునే యిట్టి దివ్యభోగంబులనుచు
రాగసాగర మగ్నయై రాజవదన
కదిసి భూసురవరు చక్క కౌగిలించె

ఉ. ఎక్కడినుండి వచ్చెనతడీతుహినాద్రికి వేడ్కనూని? యే
నక్కట! యక్కుమారు రుచిరాకృతియాదట నేలజూచితిన్?
మక్కువ యేలనాటె మది? మన్మథుడేల సహించు నన్ను? వా
డెక్కడ వచ్చునింక? నదియేల పొసంగు? దురాశయేటికిన్?

వ్యాసం

# కరోనాపై కవిత్వ సమరం

**కరోనా సర్పాన్ని గురించి కవి కులం యొక్క వ్యాకులాన్ని తెలిపిన వ్యాసం...**



గుడిపాటి

సమాజ గమనంలోని ప్రతి అంశంపై స్పందించడం కవుల సహజసిద్ధ స్వభావం. కరోనాపై వస్తున్న కవిత్వాన్ని ఇందులో భాగంగా చూడాలి. కరోనా కేవలం ఒక వైరస్. నిర్జీవ పదార్థం. అయినప్పటికీ యావత్ ప్రపంచాన్ని కల్లోలానికి లోను చేస్తున్నది. ప్రపంచచరిత్రలో మొట్టమొదటిసారిగా మానవులంతా ఇంట్లోనే కూర్చుండిపోయే పరిస్థితిలోకి నెట్టివేసింది. దేశాలకు దేశాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో జనజీవనమంతా స్తంభించింది. చలనశీలత ప్రాణంగా చరించే మనుషులంతా భయంతో బిగుసుకుపోయారు. ఈ నేపథ్యంలో ఉన్నచోటు నుంచి ఉన్నపళంగా కదలక తప్పడంతో కోట్లమంది వలస కార్మికులు భీతావహస్థితితో తల్లడిల్లారు.

కరోనా వైరస్ ఒక్కదానిపైన కాదు, మానవ స్వార్థంపైన, మార్కెట్‌శక్తుల దుర్మార్గంపైన, ప్రకృతిని కబళించే బేహారుల మీద నిరసన వెల్లువెత్తింది. ఆ నిరసన స్వరాల కవితాగానమే ఈ 'ఊపిరిపాట'. లక్షెట్టిపేట పరిసర ప్రాంతాలకు సంబంధించిన 32 మంది కంఠస్వరాల్నించి ఒలికిన కవిత్వమిది. కరోనా వైరస్ నైజమే కాదు, వ్యవస్థల మీద కవులకు నిర్దిష్ట అవగాహన ఉంది. అయితే వ్యవస్థ వైఫల్యాల మీద ఫిర్యాదు చేసినంతమాత్రాన సరిపోదు, తక్షణం వైరస్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోడమూ తప్పనిసరి. ఆ ఎరుకతో స్పందించిన గళాలని ఈ పుస్తకంలో వినవచ్చు.

ఈ పుస్తకంలో ప్రధానంగా ఆరు రకాల అంశాలకు సంబంధించిన కవితలున్నాయి.

1. కరోనా తీవ్రతని గురించి హెచ్చరిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పడం.
2. వలస కార్మికుల సంవేదన
3. ప్రకృతి, పర్యావరణం పట్ల పట్టింపు
4. అభివృద్ధి పేరిట జరుగుతున్న ధ్వంసంపై పునరాలోచన
5. కరోనా తీవ్రతతో పెరుగుతున్న పరాయీకరణ, మానవ సంబంధాల విధ్వంసం
6. పిల్లల, యువకుల భవిష్యత్... మహిళలపై లాక్‌డౌన్ భారం

ఈ ఆరు అంశాల గురించి కవుల భిన్నరూపాల్లో స్పందించారు. ఏదో ఒక అంశానికే పరిమితం కాలేదు. ఈ ఆరు అంశాలలో కనీసం రెండు మూడు అంశాలపైన ప్రతి ఒక్కరు కవిత్వం రచించారు. ఈ క్రమాన వస్తు వైశాల్యం సంతరించుకుందీ కవిత్వం. వ్యక్తీకరణలో ఎవరి పద్ధతిని వారు అనుసరించారు.

ల్యాదాల గాయత్రి చెప్పినట్టు ఇది విచిత్ర సంగ్రామం.

'అదృశ్యశత్రువుతో/ అలుపు లేని పోరాటంలో
స్వీయ నిర్బంధంలో/ గడప లోపలే ఉండి' తలపడకతప్పదు.

ఆర్నెల్లు దాటినా కరోనా ఉధృతి ఆగడం లేదు. కందుల తిరుపతి చెప్పినట్టు -

"నెర్రెలు బాసిన నేల
వాన చినుకుల కోసం చూసినట్లు
కనబడని కరోనా అంతం కోసం
ప్రపంచమే కునుకు లేక చూస్తున్నది"

అన్న మాట అక్షర సత్యం. 'నెర్రెలు బాసిన నేల' అనడం ద్వారా కవికి పల్లె జీవనంతో ఉన్న అనుబంధం వ్యక్తమైంది. కరోనా కారణంగా మనుషులకు దూరం కావల్సిన పరిస్థితి విషాదం. ఈ విషాదాన్ని ఒక అవ్వ పరిభాషలో చెప్పినట్లు లేదాళ్ళ రాజేశ్వరరావు అక్షరీకరించిన తీరు ఆకర్షణీయం -

"ఈ రోగం మంట్లె పోను
దుబాయిల గూడ మోపయిందట
పన్లేదు, పైసల్లేవు
ఎట్లనే అవ్వ ఆడికి రానిత్తలేరు
అన్నడు పోన్ల, తిన్న బువ్వ
కలికలిగావట్టే
ఉన్నొక్కపోరడు, ఆడోకాడ మేమోకాడ

వ్యాసం

రోడ్లన్ని మూసింద్రు, కరోనా రోగం
పూల్లెకు రాకుండ
వొంటికి రోగం అంటకుంట
సూసుకుంటం గని
మా మనసుల మనాది ఎవ్వరు
మాన్పుతరు బిడ్డ...!" అన్న ప్రశ్నకు ఇప్పటికీ జవాబు లేదు. ఎందుకంటే ఎవరికివాళ్ళు ఇదంతా ఎప్పుడు ముగుస్తుందనే మనాదితోనే ఉన్నారు. ఈ బాధ ఉన్నా తప్పనిసరయిన స్థితిలో ఐ.వి.సుబ్బాయమ్మ అన్నట్టు "నేటి మన స్వీయ గృహనిర్బంధమే/రేపటి మన ఆరోగ్య మహాభాగ్యం" అన్న సత్యం మరువకూడదు.

"అనివార్యమైతే ఆమోదించు" అంటాడు ప్రముఖ రచయిత డేల్ కార్నెగి. ఈ అవగాహనతోనే

"శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకో
మాస్క్ వేసుకో, రెక్కాడందే డొక్క నిండదు
బతుకుపోరులో ముందుకు సాగిపో
నీవే వైద్యుడివి, సిపాయివి, సఫాయివి
నీకు నీవే రక్షకుడివని మరువకు...!"

అంటున్నారు ముత్యం మల్లేశం.

కరోనా భయంతో ఎన్నాళ్ళని ఇంట్లో కూర్చోగలరు సామాన్యులు. బయటికెళ్ళకతప్పదు, అయితే జాగ్రత్తలు తప్పనిసరి. ప్రభుత్వాలు చేతులెత్తేసాయి కాబట్టే 'నీకు నీవే రక్షకుడివని' గుర్తు చేస్తున్నాడు కవి. ఈ నేపథ్యంలోనే 'ఖబర్దార్ కరోనా' అంటున్నారు నూటెంకి భారతి... "ఇగ నువ్వు చేసింది చాలు గని / మేం నిన్ను మట్టుబెట్టకముందే/ నీ నెత్తి మీద నువ్వే / నీ మూడోపాదం మోపుకొని / పాతాళానికి తొక్కేసుకో" అని హెచ్చరిస్తున్నారు. అయిదు నెలలుగా కరోనా ఉధృతిలో మాటాముచ్చట లేకుండాపోయింది. నలుగురు కలిసిందీ, ఆడిపాడిందీ లేదు. లాక్‌డౌన్‌కు ముందున్న బతుకుంతా ఒక కలగా మిగిలింది. అందుకే

"వివాహ వేడుకలలో తలమునకలైన
బంధువుల్ని
సాయంకాలాలలోని మిత్రుల సరదా
సంభాషణల్ని
కలగన్నాను... నేను కలగన్నాను...!
కలలో... ఎక్కడా కనిపించలేదు
విచిత్ర వస్త్రధారణలు, భౌతిక
దూరాలు
మాస్కులు, శానిటైజర్లు, రెడ్ ఆరెంజ్
జోను...!
కరోనా గ్రహణకాలం వీడి
నా కల సాకారమైతే ఎంత
బాగుండు" అన్నది జయ లేదాళ్ళ ఆకాంక్ష మాత్రమే కాదు, అందరి మనసుల్లో తిరుగాడే కోరిక ఇది. మనుషులు కలవకుండా ఉండలేనితనం ఎంత దుర్భరమో కరోనా విజృంభణ తెలియజెప్పింది. అందుకే కరోనా రాకముందటి గురించి కలగనడం సహజం. ఆ స్వప్నానికి తార్కాణం 'కలగన్నాను' కవిత. ఈ కలని నిజం చేయాలన్న లక్ష్యంతోనే వ్యాక్సిన్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నందునే "నీ వినాశనానికి జరుగుతున్నాయి పరిశోధనలు/ నిన్నంతం చేయడానికి కత్తులను




**వలసజీవుల రక్తం మరకలు ఎప్పటికీ మరిచిపోనివి, మాసిపోనివి..." అన్న సలిగంటి మల్లేశ్ మాటలు వర్తమాన చరిత్రకు చెదరని సాక్ష్యాలు. పాలకులు వివేచనతో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే ఈ దారుణాలు జరగకపోయేవి. ఎవరి దయాదాక్షిణ్యాల కోసం బిచ్చగాళ్ళుగా బతకాల్సిన దుస్థితి ఉండేకపోయేది అనే జనాల మనోగతం నూటెంకి రవీంద్ర కంఠస్వరంలోంచి వినిపిస్తున్నది...**

నూరుతున్నాం" అంటున్న కొండు జనార్దన్ మాటలు వాస్తవం. ఈ వాస్తవం త్వరగా సాకారం కావాలన్నదే మానవుల ఆరాటం. ఇది నిజం కావాలంటే వైరస్‌కు దూరంగా ఉండాలి. అందుకోసమే "శత్రువు బలహీనతను/ వాడుకోకపోతే నువ్వే ఓడిపోతావు/ నువొక్కడివే కాక, ఏ పాపం తెలియని నీ వాళ్ళనీ బలి చేస్తావ్..." అంటూ జనాల్ని అప్రమత్తం చేస్తున్నాడు కవి నాగవర్మ ముత్యం. ప్రస్తుతానికి వైరస్‌కు దూరంగా ఉండటమే తప్ప మరో మార్గం లేదు.

...

కరోనా వైరస్ ఒకవిధమైన విపత్తయితే వ్యవస్థ వైఫల్యాలు మహావిపత్తుగా పరిణమించి కోట్లాదిమంది వలసకార్మికుల దీనగాథల్ని లోకానికి తెలియజెప్పాయి. ఆకస్మిక లాక్‌డౌన్ వలసకార్మికుల పాలిటి పిడుగుపాటు.

"నగరాలకు బతకవచ్చిన వాళ్ళు
కాళ్ళను నమ్ముకుని బయలుదేరారు
ఎంతని నడుస్తారు... ఏమైపోతారు
పిల్లలు, వృద్ధులు, బాలింతలు
ఈ చోటుని తప్పించుకుంటే చాలని
రాత్రి పగలు పరుగోపరుగు
దీనావస్థలకు బాధ్యులెవరు" అంటూ

ప్రశ్నిస్తున్నారు గోపగాని రవీందర్. పనుల్లేక, పస్తులుండలేక సొంతూళ్ళకు తరలక తప్పని స్థితిలో వలస కార్మికుల

అగచాట్లు వర్ణనాతీతం. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు వలస కార్మికుల బతుకుల్లో సృష్టించిన విషాద బీభత్సం చెప్పనలవికానిది. ఈ కరోనా కాలంలోనే విశాఖలో స్టైర్లిన్ వాయువు లీక్, భోపాల్ విషాదాన్ని గుర్తు చేసిన తీరుని చెబుతారీ కవి. ప్రభుత్వాలు ప్రకటించిన ఉద్దీపనలు పెత్తందార్లకే లబ్ధిని చేకూర్చాయని స్పష్టంగా చెప్పారు. 'కొన్ని విజ్ఞప్తులు' శీర్షికన కరోనా కాలపు దారుణ నిజాలకు కవిత్వరూపం ఇచ్చారు.

వలస కార్మికుల లాంగ్‌మార్చ్ ఈ దేశ పేదరికాన్ని కళ్ళకు కట్టినట్టు చూపింది ప్రపంచానికి.

"పూట పూట చేసుకొని బతికేటోళ్ళు
పూట గడవక రాష్ట్రాలు దాటినోళ్ళు
మాయదారి మహమ్మారి ముసురుకోగా
ఊరు జేరుతారా ఊపిరి ఆగే లోపైనా...!"

అని 'వలసగోస'ని చెబుతున్నారు వినయ్‌కుమార్ కొట్టె. ఊరు బాట పట్టినవారిది ఒక గోస అయితే, వారి కోసం ఎదురుచూసే అయ్య అమ్మలది మరో వేదన.

"బతుకు దెరువు కోసం బాటసారివై
ఈడ వుండిన నీడను విడిచి ఎల్లి పోతిరి
ఏడ వుంటివో... ఎట్ల వుంటివో
కాటిదాక పోకముందే కడసారి సూపుకైన వస్తవని
కాటికాడ పిట్టవోలే మీ కోసం ఎదురు చూస్తుండిరి..." అని పల్లెల్లో ఉన్న అయినవాళ్ళ ఆవేదనని రాచకొండ శ్రీనివాస్ చిత్రించారు.

పల్లెల్లో ఉన్నవారి కోసం కాలినడకన బయలుదేరిన వలసకూలీల మృత్యువు పాలవడం ఎంత ఘోరం!

"అలసిపోయి ఆగిన వాళ్ళెందరో
రైలు కూతపెట్టినా వినిపించని నిద్రలోనే
పట్టాలపైన రక్తం ఏరులై పారింది
వలసజీవుల రక్తం మరకలు ఎప్పటికీ మరిచిపోనివి, మాసిపోనివి..." అన్న సలిగంటి మల్లేశ్ మాటలు వర్తమాన చరిత్రకు చెదరని సాక్ష్యాలు. పాలకులు వివేచనతో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే ఈ దారుణాలు జరగకపోయేవి. ఎవరి దయాదాక్షిణ్యాల కోసం బిచ్చగాళ్ళుగా బతకాల్సిన దుస్థితి ఉండేదకపోయేది అనే జనాల మనోగతం నూటెంకి రవీంద్ర కంఠస్వరంలోంచి వినిపిస్తున్నది...

"ఒక్క రెండొద్దుల యెసులుబాటిచ్చి
ఎక్కడోల్ల నక్కడికి బంపితే
గీ తిప్పలుండేది గాదు, గిన్ని సిక్కులుండేవి గావు
బంజేరుదొడ్ల తోలినట్టు శిబిరాలల్ల దోలితిరి
కారట్లు గీరట్లు లెవ్వని కసిరిచ్చుకోవడ్తిరి
బిచ్చ మేసినట్టు మా బొచ్చెల్ల
గిన్నన్ని మెతుకు లిదిలిస్తే యేడికి మొదలైతది?
పుణ్యాత్ములు దానధర్మం జేసుకుంట
సెల్ఫీలు ఫోట్వలు దిగుతాంటే ఇజ్జత్‌కే సగం పానం బోతంది" ఎవరో శిబిరాలు పెట్టి దానం చేస్తున్నట్టుగా పోజు పెడితే రెక్కల కష్టమ్మీద బతికే వారు అవమానంగా భావిస్తారు. ఆ అవమానపు తీవ్రతని వారిదయిన భాషలో వ్యక్తం చేయడం నూటెంకి రవీంద్ర కవిత్వ ప్రతిభకు నిదర్శనం. ఈవిధంగా ఈ సంకలనంలోని చాలామంది కవులు వలసజీవుల శ్రమైక జీవన సౌందర్యాన్ని తలపోస్తూనే వారిని నానాయాతనలకు గురిచేసిన పాలకుల దుర్మార్గం మీద కవితాస్త్రాలు సంధించారు.

**కరోనా భయంతో ఎన్నాళ్ళని ఇంట్లో కూర్చోగలరు సామాన్యులు. బయటికెళ్ళకతప్పదు, అయితే జాగ్రత్తలు తప్పనిసరి. ప్రభుత్వాలు చేతులెత్తేసాయి కాబట్టే 'నీకు నీవే రక్షకుడివని' గుర్తు చేస్తున్నాడు కవి. ఈ నేపథ్యంలోనే 'ఖబర్దార్ కరోనా' అంటున్నారు నూటెంకి భారతి... "ఇగ నువ్వు చేసింది చాలు గని / మేం నిన్ను మట్టుబెట్టకముందే/ నీ నెత్తి మీద నువ్వే / నీ మూడోపాదం మోపుకొని / పాతాళానికి తొక్కేసుకో" అని హెచ్చరిస్తున్నారు. అయిదు నెలలుగా కరోనా ఉధృతిలో మాటాముచ్చట లేకుండాపోయింది.**

"బ్రతుక్కు భరోసా పొందలేక పోయినోళ్ళు
వలస కూలీలో - అసంఘటిత రంగ కార్మికులో
ఎవరైతేనేం? వాళ్ళే గదా భారత భాగ్యసృష్టి విధాతలు" అంటూ ఈ దేశం సుసంపన్నం కావడానికి తోడ్పడుతున్న శ్రమజీవులని తన కవితాక్షరాలతో సత్కరిస్తారు 'సత్యా'పతి.

...

కరోనా కాలం మన అభివృద్ధి నమూనాలని, జీవనశైలిని పునర్విశ్లేషణ చేసుకోవలసిన అవసరాన్ని తెలియజెప్పింది. ఈ వాస్తవాన్ని మనసుకు హత్తుకునేలా చెప్పారు కొందరు కవులు. అలాగే ఈ దుర్భర కాలాన "ఎవరికెవరు లేరు/ ఎవరి కోసం ఎవరూ రారు" అని ఎరుకపరుస్తూనే "మానవత్వమే మనిషితనమని మరొక్కసారి నినదిద్దాం/ మనిషే మనిషికి ఎప్పుడూ తోడని / ఇకనైనా మేల్కొందాం" అంటారు యస్. నీలాదేవి. అలాగే వలస కార్మికుల సంవేదనలకు చలించిపోతూ "నడకదారుల నరక వేదనల కన్నీళ్ళు/ మా కళ్ళ ముందే కదలాడుతుంటే/ మానవత్వం సవాల్ చేస్తుంది" అని గుర్తు చేస్తారు యం.ఏ. గఫార్. "కళ్ళుండీ చూడలేక/ నోరుండీ మెదపలేకపోతున్న" మనుషుల తీరును వెన్న మహేష్ అభిశంసిస్తారు.

"కనిపించని సూక్ష్మజీవి వారి జీవితాలను ఛిద్రం చేసింది" అంటూ తోపుడుబళ్ళ టిఫిన్ సెంటర్ల వారి బతుకుదైన్యాన్ని మల్లూరి శ్రీనివాస్ తమ కవితలో వినిపించారు. బయట తినడం



మాసిపోయి ఇంట్లో తినడం అలవాటయ్యాక మహిళలకు మరింత సమయాన్ని వంటింట్లోనే వెచ్చిస్తున్న మహిళల మనోభావాలకు 'కిచెన్ ఫ్యాక్టరీ' కవితలో నగధర్ వేల్పుల చిత్రిక పట్టారు.

ముఖ్యంగా ప్రకృతిని జయించే పేరిట ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్న మానవుల్ని పునరాలోచనలో పడేసింది కరోనా సందర్భం. "ప్రకృతి వరాలైన కొండలను పిండి చేశాము/ అడవిని మింగేశాము/ నదుల గతిని మా స్వార్థానికి మార్చేము" అంటూ జరిగిన వినాశనాన్ని ఏ.వి.మూర్తి గుర్తు చేశారు.

ప్రకృతినీ, సాటి మానవులనీ స్వార్థానికి వాడుకునే వారు కరోనా మహమ్మారికి బెంబేలెత్తిపోతున్న సమయాన "నీకు సృష్టించ నలవి కాని సహజవనరులను/ నీ విలాసం కోసం వాడేస్తున్నప్పుడు, తోడేస్తున్నప్పుడు నీకన్యాయం అనిపించలేదా" అని ప్రశ్నిస్తారు రత్నం తులసిపతి.

కనుకనే "ప్రకృతి రక్షణే తనకు శ్రీరామరక్ష అనీ/ ప్రకృతిని భక్షిస్తే తన ప్రకోపానికి బలి కాక తప్పదనీ/ మనిషి గ్రహించిన నాడే ఇలాంటి విపత్తుల నుండి/ జగతికి విముక్తి" అన్న నాగశ్రీ కవితా పంక్తులు అందరికీ అంగీకార యోగ్యం. ప్రకృతిని మన్నించడం మానవునికి శ్రేయస్కరం. కరోనాని జయించాలన్న సహజమైన

> **ఇంతటి భయానక పరిస్థితిలో సేవలందిస్తున్న వైద్యులని "పోరాట యోధులు"గా మిట్టదొడ్డి వెంకట సుధాకర్ అభివర్ణించడం అభినందనీయం. వైద్యులకు వందనాలు సమర్పిస్తూనే "పురివిప్పిన కరోనా దారులు మూయాలి/ అంటుకున్న కరోనా హారాన్ని తుంచాలి" అన్న పెద్ది భరత్ మాటలు పాలకుల, ప్రజల కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నాయి.**

ఆరోగ్యపద్ధతులు అనుసరించాలని "ప్రకృతియే నీకు పరమౌషధం/ విశ్వ మైత్రి తోడ విజయమును సాధించు...!" అన్న శ్రీనివాస్ గుర్రాల మాటలు శిరోధార్యం. ఈ సంక్షుభిత స్థితిలో కాసం కుమారస్వామి సృజించినట్లు "ప్రకృతి మాత సహజత్వాన్ని కాపాడుదాం/ సానుకూలతే మార్గంగా జీవిద్దాం". ఇదే ఇపుడున్న సరికొత్త జీవనవిధానం.

ఇంకా అనేకానేక కఠోర వాస్తవాలకు కవితారూపం ఇచ్చారు ఈ సంకలనంలోని కవులు. "ప్రతి మనిషిలో ప్రాణభీతిని కలిగించావు/ ప్రతి మనసులో పరిశుభ్రతా రీతిని రగిలించావు" (దాసరి జనార్దన్) అన్నది ఇవాళ మన నిత్యజీవితంలో అంతర్భాగమైన నిజం. గూడ రాజేందర్ చెప్పినట్టు "మనిషి బంధాలని బందీ చేసింది". ఇంతటి భయానక పరిస్థితిలో సేవలందిస్తున్న వైద్యులని "పోరాట యోధులు"గా మిట్టదొడ్డి వెంకట సుధాకర్ అభివర్ణించడం అభినందనీయం. వైద్యులకు వందనాలు సమర్పిస్తూనే "పురివిప్పిన కరోనా దారులు మూయాలి/ అంటుకున్న కరోనా హారాన్ని తుంచాలి" అన్న పెద్ది భరత్ మాటలు పాలకుల, ప్రజల కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నాయి. కరోనా విలయం కారణంగా సకల రంగాలు స్తంభించి పోయాయి. ముఖ్యంగా "ఆగమగమయిన చదువులు/ అర్థాంతరంగా ఆగిన కొలువులు" ఎలాంటి సంవేదనలకీ, సంఘర్షణలకీ కారణమయ్యాయో 'కరోనా తరుణం' ద్వారా బత్తుల ద్వారకామాయి ఆర్ద్రతతో తెలియజెప్పారు.

అనేకానేక సంక్లిష్టతలతో ముడిపడిన ఈ కరోనా సందర్భంలో తమ అంతరంగంలోని అలజడిని కవిత్వం చేయడానికి కవులు చేసిన ప్రయత్న ఫలితమే ఈ సంకలనం. ఊపిరి తీసే కరోనాని ప్రతిఘటించాలన్న సంకల్పం, దృఢచిత్తం ఈ కవిత్వం నిండా పరుచుకుంది. పాఠకులని అప్రమత్తం చేయడమే కాదు, ధైర్యంగా ఎదుర్కొందామనే ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేయడం ఈ కవిత్వం సాధించిన సాఫల్యం. లక్సెట్టిపేట కేంద్రంగా కవులు సృజించిన ఈ కవిత్వం ప్రత్యేకమైంది. ఈ కాలానికి అవసరమైంది. వస్తువులో వైవిధ్యం, వ్యక్తీకరణలో సరళత, స్పష్టత సంతరించుకున్న కవిత్వమిది. ఆర్తితో, ఆర్ద్రతతో స్పందించిన కవులకు అభినందనలు. లక్సెట్టిపేట సాహిత్యకేంద్రంగా మరింత మంది సృజనాత్మక రంగంలోకి రావడానికి ఈ 'ఊపిరిపాట' దోహదం చేస్తుందన్నది ఆకాంక్ష.

వ్యాసం

# నరసింహుని కొలువులో శేషప్పకవి

ప్రజల నాలుకల మీద నడయాడే పద్యాలు రాసిన శేషప్ప కవి గురించి....



ఆచార్య వెలుదండ నిత్యానందరావు

శతకం తెలుగు వారి కెంతో ప్రీతి పాత్రమైన సాహితీ ప్రక్రియ. నోరు తిరగడం మొదలుపెట్టిన నాటి నుండి శతక పద్యాలను వల్లె వేయడం మొదలు పెట్టేవారు. ముఖ్యంగా సుమతి వేమన శతకాలు. దాని వల్ల ప్రాథమికంగా స్ఫుటమైన ఉచ్చారణను అలవర్చుకోవడం జరిగేది. క్రమేపి తమకు తెలియకుండానే మంచి తలంపులు, సామరస్యధోరణి, సౌజన్యశీలం ఏర్పడడానికి అవసరమైన భావశుద్ధి జరిగేది. అట్లాగే రచనలు చేయడం మొదలైన దశలో అభ్యాసం కోసం శతక పద్యాల నాశ్రయించేవారు. ఒక మకుటం నిర్ణయించుకొని తదనుగుణమైన ఛందస్సులో భావాభివ్యక్తి చేయగలిగే నైపుణ్యం కలిగించుకునేవారు. కథా పరమైన పూర్వాపర సంబంధాలు లేకపోవడం వల్ల స్వేచ్ఛగా పద్యరచనా భ్యాసానికి శతక ప్రక్రియ ఉపయోగపడేది. భగవత్పరమైన శతక రచన చేసే వారిలో ఆత్మసమర్పణభావం, ఆర్తి ద్యోతకమయ్యేది. అధిక్షేప శతక రచనలో అయితే సామాజిక అభ్యున్నతి, దోషఖండనం వస్తువులయ్యేవి.

సుమతి, వేమన శతకాలు బాలుర కభ్యాస నిమిత్తం పనికి వస్తే, కాస్త పెద్దవారై పని పాటలు చేసుకొంటున్న వారికీ, మరీ జీవితంలో వయసయిపోయి అలసిపోయి విశ్రాంతి తీసుకుంటున్న పెద్దవారికీ ఆలంబనగా నిలిచింది శేషప్ప కవి రచితమైన నరసింహశతకం. జీవితాన్ని అన్ని రకాలుగా అనుభవిస్తూనే, ఆస్వాదిస్తూనే, ఆనందిస్తూనే తదతీతమైన మరొక వ్యవస్థ ఉందనీ, పారలౌకికతను విస్మరించి, ఇహలోక లంపటం లోనే కూరుకపోరాదని హెచ్చరించడం శేషప్ప నరసింహశతక ప్రయోజనమైంది. భగవత్పరమైన సమర్పణనైజాన్ని పెంచుతూనే భగవంతుని సర్వశక్తి మత్వాన్ని, సర్వవ్యాపకత్వాన్ని మనిషి పరిమితత్వాన్ని శేషప్పశతకం గుర్తింప చేసింది. గర్వాన్ని తలకెక్కించుకొని ఇతరుల పట్ల బాధాకరంగా ప్రవర్తించ రాదనీ, వినయంతో ప్రేమాదరాలతో, పరస్పర సహాయసహకారాలతో మెలిగినపుడే సమాజంలో శాంతి సామరస్యాలు కుసుమిస్తాయని శేషప్ప శతకం ప్రబోధించింది.

శేషప్ప 18వ శతాబ్దంలో ధర్మపురిలో జన్మించాడు. ఏ సుముహూర్తంలో శేషప్ప ఈ శతకం రాశాడో కాని ఇది తెలుగునాట ఎంతో ప్రీతి పాత్రమైపోయింది. పోతన మహాకవికి ఎంత జనాదరణ లభించిందో అంత జనాదరణ శేషప్పకూ లభించింది. ఎంత మంది నాలుకల మీద ఈ శతక పద్యాలు నర్తించాయో చెప్పలేం. శేషప్ప శతకానికి సామాన్య పాఠకులే ఆలంబనగా నిలిచారు. తెలుగులో గ్రంథ ప్రచురణం తొలి అడుగులు పడుతున్న కాలంలోనే, ఎవరు ప్రచురించారో తెలియదు కానీ 1870లో శేషప్ప నరసింహశతకం మొదటిసారి ముద్రిత రూపమెత్తింది. తల్లా వజ్జల శివశంకర శాస్త్రి గారు 1868లోనే తొలి ముద్రణ వచ్చినట్లు తెల్పారు. ఆర్. వెంకటేశ్వర్ కంపనీ 1909లో వెలువరించింది. వెస్టువార్డు అండు కంపెనీ వారి అమెరికన్ డైమండ్ ముద్రాక్షరశాలలో 1932లో మరోముద్రణ వచ్చింది. ఆ తర్వాత ఆనాటి సాహిత్య అకాడమీ, గొల్లపూడి వీరాస్వామి సన్స్, బాలసరస్వతి బుక్ డిపో, పావని సేవా సమితి, వసుంధరా పబ్లికేషన్స్ లాంటి అరవైకి పైగా విభిన్నమైన సంస్థలు ఎన్నెన్నో సార్లు ప్రచురించాయి. ఇటీవలే డా॥ సంగనభట్ల నరసయ్య శేషప్ప కుటుంబీకులకు సంబంధించి ఎన్నో అమూల్యమైన వివరాలను తెలుపుతూ మంచిపుస్తకం రాశారు. మహా సంస్కృత విద్వాంసులు చిట్టిగూడూరు వరదాచార్యుల, ఆచార్య రవ్వా శ్రీహరి ^

వేర్వేరు కాలాల్లో శేషప్ప శతకాన్ని సంస్కృతంలోకి అనువదించారు. శ్రీ ఎస్. లక్ష్మీనరసింహశాస్త్రి కన్నడంలోకి అనువదించారు. కే. రంగారావు ఆంగ్లతాత్పర్యాలతో ప్రకటించారు. ప్రముఖ గాయకులు శ్రీ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం కమనీయంగా పాడి రికార్డు విడుదల చేశారు. చెన్నపురి రాజధానిగా తెలుగు తమిళ ప్రజలు దేశ స్వాతంత్ర్య సిద్ధి దాకా కలిసి ఉండేవారు. ఆ కాలంలో తమిళ ప్రాంతానికి చెందిన షోలింగర్‌లోనున్న ఘటికాచల నరసింహస్వామికి అన్వయించి యథాతథంగా ఈ తెలుగు ధర్మపురిశతకాన్నే ప్రచురించడం ఒక సరదా ముచ్చట.

ఈ ప్రచురణల నన్నింటిని పరిశీలిస్తే పాఠభేదాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. ప్రజల్లో ఈ శతకం బాగా పాదుకొని పోయిందనడానికి ఈ పాఠాంతరాలు కూడ ప్రబల నిదర్శనమే. గత ప్రచురణ లన్నింటిని సేకరించి శేషప్ప శతకానికి ఒక సంశోధిత ముద్రణానికి ఔత్సాహికులు పూనుకోవచ్చు

నాగేంద్రశయన! నీ నామమాధుర్యంబు
మూడు కన్నుల సాంబమూర్తి కెఱుక
పంకజాతాక్ష! నీ బల పరాక్రమ మెల్ల
భారతీపతియైన బ్రహ్మ కెఱుక
మధుకైటభారి ! నీ మాయా సమర్థత
వసుధలో బలిచక్రవర్తి కెఱుక
పరమాత్మ! నీ దగు పక్షపాతిత్వంబు
దశశతాక్షుల పురందరుని కెఱుక
వీరి కెఱుకగు నీ కథల్ వింత లెల్ల
నరుల కెఱు కన్న నెవరైన నవ్వి పోరె?
భూషణ వికాస! శ్రీధర్మ పురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

దేవున్ని రకరకాలుగా సంబోధించడం, ఆయన లీలలను ప్రస్తావించడం, తన పరిమితులను, దేవుని అపరిమితత్వాన్ని పేర్కొనడం చివరకు తనకు ముక్తి నిచ్చే బాధ్యత నీదే అని శరణు వేడడం. ఇది శేషప్ప శతక పద్యాల్లో పాటింపబడిన రచనా శిల్పం.

విష్ణుమూర్తి మహత్త్వాన్ని పేర్కొనా లంటే సాధారణ వ్యక్తులు సరిపోరు. అలాంటి సామాన్యులు చెప్పడం ఆయన గొప్పతనానికి కొలమానం కాదు అని శేషప్పకు బాగా తెలుసు. అందుకే ఎంతో ఔచితీవంతంగా శివుడు, బ్రహ్మ, బలిచక్రవర్తి, ఇంద్రులను తీసుకొని వచ్చాడు. అంత గొప్ప వారికి మాత్రమే తెలిసేవాడు విష్ణువు. అంటే నిజానికి అంత గొప్పవారికి కూడ సమగ్రంగా విష్ణు మహత్త్వం తెలియదని ధ్వన్యాత్మకంగా చెబుతున్నాడు. అప్పుడు మామూలు మనుషుల సంగతి ఇక వేరే చెప్పాలా? వారికి ఎట్లాగూ చేత కాదు అని శేషప్ప ఆంతర్యం. బ్రహ్మ, శివుడు, బలి, ఇంద్రునిలో ఉన్న శక్తి నాకు ఉంటే నేను కూడ నిన్ను కీర్తిస్తాను అని గూఢంగా మొరపెట్టుకున్నాడు. నాగేంద్రశయనుడు విష్ణువు. ఆదిశేషుని మీద విష్ణువు పడుకోవడం ప్రసిద్ధం. ఇది ప్రతీకాత్మకత.

ఆది-శేషం రెండు కలిగి ఉన్నవాడు కనుక ఆది శేషుడు. ఆది- శేషం రెండు ఉన్నాయంటే మధ్య కూడ అనివార్యంగా ఉంటుంది. సృష్టి సర్వత్ర వ్యాపించింద నడానికి ఆది శేషుడు ప్రతీక అయితే విష్ణువు "విష్ -వ్యాపనే" అంతటా వ్యాపించిన వాడు విష్ణుమూర్తి. బ్రహ్మ సృష్టికారకుడు. శివుడు లయకారుడు. ఆది అంతాల్లో వారిద్దరూ ఉంటారు. విష్ణువు ఈ ఆది అంతాలను కలుపుకొని అంతటా ఉండడం మూలాన స్థితికారుడయ్యాడు. అన్నీ తానై, నిర్వహిస్తున్న విష్ణువు స్థితివ్యాపకత్వాన్ని "సర్వమున్నతని దివ్యకళామయ మంచు" బ్రహ్మ శివులు దర్శించగలరు. వచ్చినవాడు విష్ణువనీ తెలుసు. గురువు శుక్రాచార్యులు వద్దని వారిస్తున్న సంగతీ తెలుసు. తనకు ప్రాణహాని కలుగబోతుందన్న సంగతీ అర్థమౌతుంది. అయినా "విష్ణుకరంబు క్రిందై తన కరంబు మీదౌట మేల్గాదె" అన్న వ్యామోహంలో పడిపోయాడు బలిచక్రవర్తి. ఈ వ్యామోహమే "విష్ణుమాయ".

ఇంతింతై వటుడింతయై త్రివిక్రమరూపం దాల్చి తనను పాతాళానికి పంపిన విష్ణుమూర్తి మాయాసామర్థ్యం అనుభవపూర్వకంగా బలిచక్రవర్తికి బాగా తెలుసునని శేషప్ప పేర్కొంటున్నాడు. విష్ణు లీలలు దర్శించడానికి మానవుల కుండే రెండు చర్మ చక్షువులు, కీర్తించడానికి ఒకనోరు చాలవు. కనుక శేషప్ప సమగ్రంగా కీర్తించలేడు . కాని వేయి కన్నులు ఉన్న ఇంద్రుడు రెండు కన్నులుండే సామాన్య మానవుల కన్న ఐదువందల రెట్లెక్కువగా చూడగలడు. వేయినాలుకలు కలిగిన ఆదిశేషుడు అంతే ఎక్కువగా కీర్తించగలడు అంటూ ఎంతో సాభిప్రాయంగా సముచితమైన రీతితో శేషప్ప తన భక్తి భావాన్ని పాఠకులకు అందిస్తాడు.

విష్ణుసహస్ర నామాలకు సమానమైన ఒకనామం చెప్పవలసిందని పార్వతీదేవి "కేనోపాయేన లఘునా విష్ణోర్నామ సహస్రకమ్" అని శివుని అడుగుతుంది. అప్పుడు

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ

> **విష్ణుమూర్తి మహత్త్వాన్ని పేర్కొనా లంటే సాధారణ వ్యక్తులు సరిపోరు. అలాంటి సామాన్యులు చెప్పడం ఆయన గొప్పతనానికి కొలమానం కాదు అని శేషప్పకు బాగా తెలుసు. అందుకే ఎంతో ఔచితీవంతంగా శివుడు, బ్రహ్మ, బలిచక్రవర్తి, ఇంద్రులను తీసుకొని వచ్చాడు. అంత గొప్ప వారికి మాత్రమే తెలిసేవాడు విష్ణువు. అంటే నిజానికి అంత గొప్పవారికి కూడ సమగ్రంగా విష్ణు మహత్త్వం తెలియదని ధ్వన్యాత్మకంగా చెబుతున్నాడు. అప్పుడు మామూలు మనుషుల సంగతి ఇక వేరే చెప్పాలా? వారికి ఎట్లాగూ చేత కాదు అని శేషప్ప ఆంతర్యం.**

వరాననే

అని శివుడు చెప్తాడు. ఇది విష్ణుసహస్రనామాలను పారాయణం చేసే ప్రతి వారికి తెలిసిన అంశం. ఇది మనసులో స్ఫురించే కాబోలు భక్త కవి శేషప్ప “నాగేంద్రశయన! నీ నామ మాధుర్యంబు మూడు కన్నుల సాంబమూర్తి కెఱుక” అని ఎంతో సార్థకంగా అన్నాడు. ఇందులో గమనించవలసిన మరో చమత్కారముంది. “సాంబమూర్తి”కి బదులు “శంకరుండు” అన్నా ఛందస్సు సరిపోతుంది. కాని పార్వతి అడగడం వల్ల శివుడు చెప్పాడని చెప్పడానికి అంబతో కూడిన శివుడు అని అర్థం వచ్చే విధంగా సాంబమూర్తి అని సాభిప్రాయంగా ప్రయోగించాడు. రామ రామ రామ అని మూడు సార్లు జపిస్తే చాలు విష్ణువు వేయి పేర్లు స్మరించినట్లే అని చెప్పిన వాడు వట్టి శివుడు కాడు. మూడు కన్నుల వాడు. నరసింహుని “ఆకంఠం విష్ణురూపాయ అత ఊర్ధ్వం శివరూపిణే” కంఠం దాక విష్ణువు ఆపైన శివుడు అని నరసింహుని శివకేశవాభేదంగా అన్వయించిన సంప్రదాయం కూడ లేక పోలేదు. విష్ణురూపాయ నమశ్శివాయ- విష్ణురూపంలో వున్న శివునకు నమస్కారం అన్నదీ జగత్ప్రసిద్ధమే.

“పరమాత్మ ! నీ దగు పక్షపాతిత్వంబు దశ శతాక్షుల పురందరుని కెఱుక” అనే పాదం కొన్ని ప్రతుల్లో “పరమాత్మ! నీ దగు ప్రబల శూరత్వంబు దశ శతాంబకపురందరుల కెఱుక” అని కనబడుతుంది.

“వీరి కెరుకగు నీ కథల్ వింతలెల్ల” అనే పాఠంలో “వింతలౌను” అన్న మార్పు కనిపిస్తుంది. “నరుల కెరుక” అన్న బహువచన పాఠం ఏకవచనంలోకి మారి “నరున కెరుక”గా మారింది. “మాయాసమర్థత” కొన్ని ప్రతుల్లో “మాయసామర్థ్య”మైపోయింది.

అర్థ లేమైననిన్నడుగ వచ్చెద రంచు
క్షీర సాగర మందు జేరినావు
నీచుట్టు సేవకుల్ నిలువకుండుటకునై
భయద సర్పము మీద బండినావు
భక్త బృందము వెంటబడి చరించెద రంచు
నెగసి పోయెడి పక్షి నెక్కినావు
మౌనులు నీ ద్వార మాసింపకుంటకు
మంచి యోధుల కావలుంచినావు
లావు గలవాడ వైతి వే లాగు నేను
నిన్ను జూతును నాతండ్రి నీరజాక్ష!
భూషణ వికాస! శ్రీధర్మ పురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

శేషప్ప భగవంతుని వ్యాజస్తుతి మార్గంలో కీర్తిస్తున్నాడు . భగవంతుని విమర్శించి నట్లు కనిపిస్తుంది .

అది కావాలనీ, ఇది కావాలనీ ఆరాటపడేవారు నిన్నడగడానికి వచ్చి నీ ప్రశాంతతకు భగ్నం కలిగిస్తారని పాలకడలిలో దాక్కున్నావు. సేవకుల వల్ల సేవాభాగ్యం కలిగినప్పటికీ, ఏకాంతం కూడ వాంఛనీయమే. సేవకుల వల్ల ఏకాంతానికి భంగం కలుగుతుందని సర్పం మీద పడుకుంటున్నావు. దాని భయం వల్ల సేవకులు నీ దరికి రాకున్నారు. అట్లే భక్త బృందానికి చిక్కకుండా పక్షి నెక్కి చరిస్తున్నావు. దాసులు నీ దరికి రాకుండా జయవిజయులనే యోధులను కాపలా ఉంచావు. ఇంత బలశాలివి. సాధారణ పరిపాలకుల చుట్టే ఎంతో మందీ మార్బలం, రక్షణ ఉంటుంది. వారిని కలవాలంటే ఎంతో తతంగం, కాలహరణం ఉంటుంది. మరి చతుర్దశ భువనాలకు అధిపతివైన నీకు రక్షణవలయాలు ఉండడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. ఆ రక్షణవలయాలను దాటుకొని తండ్రీ! నిన్నెలా చేరగలను? నాకలాంటి శక్తిఎక్కడిది? అని భగవంతునికి ఆర్తితో మొరపెట్టుకుంటు శరణాగతి చెందుతున్నాడు. “నా తండ్రి” అని ఎంతో సాభిప్రాయంగా శేషప్ప వాడాడు. అధికారి ఎంత గొప్పవాడైనా, మందిమార్బలం ఉన్నా, ఎంత కార్యవ్యగ్రత ఉన్నా సరే కొడుకు చెంత చేరడానికి ఎవరూ ఆటంకపరచజాలరు. భగవంతుడు ఎంతో గొప్పవాడే కాని “తండ్రి” కనుక సులువుగా నీ దరి చేరగలను అని సమన్వయించవచ్చు.

**కొండంత దేవునకు కొండంత పత్రి సమర్పించలేం. ఆది మధ్యాంత రహితునకు, అపరిమితునకు, కాలస్వరూపునకు తగిన రీతిలో సామాన్యులు అర్చన చేయలేరు. అనంతమైన వేదాలే ఆ భగవంతుని సమగ్రత్వాన్ని కీర్తించలేక పోయినవి. ఏవో నాలుగు సొమ్ములు నా శక్తి మేరకు కానుకగా ఇచ్చి నిన్ను ప్రసన్నుని చేసుకొందామంటే సాక్షాత్తు కౌస్తు భమణి నీ చెంత ఉంది.**

“దాసులు నీద్వార మాసింపకుంటకు మంచి యోధుల కాపలుంచినావు” అన్న దానికి పాఠాంతరం కనిపిస్తుంది. “మౌనులు నీ ద్వార మాసింప కుండంగ మంచి యోధుల కాపలుంచినావు” అని 1932 నాటి ప్రతిలో ఉంది. బహుశ కవి రాసిన పాఠం ఇదే అయి వుండవచ్చు. సేవకులు అని రెండవ పాదంలో వచ్చాక దాసులు అవసరం లేదు. కాని పండితులు ప్రాస నిర్దుష్టత కోసం దాసులు అని కల్పించివుంటారు. కవి మౌనులు నీ ద్వార మాసింపకుండంగా అని అఖండయతి వేశాడు అని భావించవచ్చు. పద్య ప్రారంభంలో “అర్థులేమైన” అన్న దానికి “అందరేమైన” అని కూడ కనిపిస్తుంది. “ఎగసి పోయెడి పక్షి” మధ్యలో లోకుల నాలుకల్లో నాని నాని “ఎగిరి పోయెడి పక్షి” గానిలిచిపోయింది.

నీకథల్ చెవులలో సోకుట మొదలుగా
బులకాంకురము మేన బుట్టువాడు
నయమైన నీ దివ్య నామకీర్తనలోన
మగ్నుడై దేహంబు మఱచువాడు
ఫాలంబుతో నీదు
ప్రేమతో దండ మర్పించువాడు

హా! పుండరీకాక్ష! హా! రామ! హరి!
యంచు
వేడ్కతో గేకలు వేయువాడు
చిత్తకమలంబునను నిన్ను
జేర్చువాడు
నీదు లోకంబునం దుండు నీరజాక్ష!
భూషణ వికాస! శ్రీధర్మ పురనివాస!
దుష్టసంహార! నరసింహ!
దురితదూర!

లోకులు ఎప్పుడూ లౌకిక కార్యాల పట్ల, లౌకిక ప్రయోజనాల పట్ల దృష్టి పెడ్తారు. కాని ఆధ్యాత్మికులు భగవంతుని పట్ల దృష్టి పెడ్తారు. వారు భగవంతుని కథాంశాలు వినడంలో పులకరించిపోతారు. భగవంతుని సంకీర్తనంలో మైమరచిపోతారు. నామస్మరణంలో పరవశించిపోతారు. భగవంతుని హృదయకమలంలో చేర్చుకొంటారు. అలాంటి భాగవతోత్తములే విష్ణులోకంలో వసించడానికి అర్హులు అని శేషప్ప ఎలుగెత్తి చాటుతున్నాడు. యజ్ఞయాగాదులు, జపతపాదులు, నియమనిష్ఠలు, శాస్త్రోక్తవిధివిధానాలు అలసులు, మందమతులు, అశక్తులు అయిన నేటికాలపువారికి సరిపోవు. నామసంకీర్తనమే భవసాగరతరుణోపాయ మన్న పెద్దల హితవచనాలకు శేషప్ప కల్పించిన పద్యరూపమిది.

శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణం,
పాదసేవనం
అర్చనం, వందనం, దాస్యం, సఖ్య,
మాత్మనివేదనం

అన్న ప్రసిద్ధ నవ విధ భక్తి విధానాలను "తనదైన అనుభూతి తనది కాన" అన్నట్లుగా నిసర్గ సుందర శైలిలో పేర్కొంటున్నాడు.

నిగమగోచర! నేను నీకు
మెప్పగునట్లు
లెస్సగా బూజింపలేను సుమ్మి
నాకు దోచిన భూషణములు పెట్టెద
నన్న
గౌస్తుభమణి నీకు గలదు ముందె
భక్ష్యభోజ్యముల నర్పణము జేసెదనన్న
నీవు పెట్టితి సుధ నిర్జరులకు
గలిమి కొద్దిగ గానుకల నొసంగెదనన్న
భార్గవీదేవి నీ భార్య యయ్యెనన్ని
గలవాడ వఖిల లోకాధిపతివి నీకు
సొమ్ములు పెట్టనే నెంతవాడ
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ!
దురితదూర!

కొండంత దేవునకు కొండంత పత్రి సమర్పించలేం. ఆది మధ్యాంత రహితునకు, అపరిమితునకు, కాలస్వరూపునకు తగిన రీతిలో సామాన్యులు అర్చన చేయలేరు. అనంతమైన వేదాలే ఆ భగవంతుని

> **శేషప్ప శాస్త్రపాండిత్యంతో, భాషాపటాటోపంతో అదరగొట్టే కవి కాదు. సామాన్య జనుల్లో తాను ఒకడిగా కలిసిపోతాడు. జీవితంలో ఏవో కష్టసుఖాలు, ఈతి బాధలు అన్నీ అనుభవించాడు. తనకు రావలసినదేదో రాలేదన్న అసంతృప్తికి కూడా లోనయివుంటాడు. భారతీయుల్లో ఉండే సహజమైన వేదాంతభావనను ఒంట బట్టించుకున్నాడు.**

సమగ్రత్వాన్ని కీర్తించలేక పోయినవి. ఏవో నాలుగు సొమ్ములు నా శక్తి మేరకు కానుకగా ఇచ్చి నిన్ను ప్రసన్నుని చేసుకొందామంటే సాక్షాత్తు కౌస్తు భమణి నీ చెంత ఉంది. భక్ష్యభోజ్యాలతో నిన్ను తృప్తి పరుద్దామంటే దేవతలకే అమృతాన్ని ప్రసాదించ గలిగినవాడివి. నీకేమైన ధనాన్ని ఇద్దామంటే సాక్షాత్తు లక్ష్మిదేవియే నీ భార్యామణి-అన్నీ ఉన్న వాడివి. అన్ని లోకాలకు నీవే అధిపతివి. ఏదైన నీకు లేనిది, నీవు కోరినది, నీకు కావలసినది ఇద్దామన్న తలంపు ఉన్నా సర్వం నీవే అయిన నీకు ఏమి ఇవ్వగలను? ఇన్ని ఉన్నా నీవు భక్త సులభుడవు కూడ. పరిపూర్ణమైన త్రికరణ శుద్ధితో నిన్ను శరణువేడితే చాలు నీవు లొంగిపోయే అత్యంత కారుణ్యమూర్తివి అని శేషప్ప భగవంతుని వేడుకుంటున్నాడు. "నీకు సొమ్ములు పెట్టనే నెంతవాడ", "నీకు భూషాదులను పెట్టనెంతవాడ" అని రెండు తీరుల పాఠాలను వల్లె వేసినా శేషప్పను యతిదోషం నుండి కాపాడలేం. అయినా కవి తన భావప్రసరణానికి అఖండయతి తప్పనిసరై వేస్తున్నప్పుడు కాదనడానికి మనమెవరం? ఈ శేషప్ప పద్యాన్ని చదువగానే కృష్ణమాచార్యుల "సింహగిరివచనాలు" మదిలో మెదలకమానవు.

దేవా! పెద్దతనంబు చేసి మిమ్ము
మెప్పించుదు నంటినా
జాంబవంతుడు మీసన్నిధినే
యున్నాడే.
దేవా ! ధనధాన్యంబులచే మిమ్ము
మెప్పించుదు నంటినా
శ్రీమహాలక్ష్మి నీయుదర
మందేయున్నదే
దేవా ! శాంత శమ దమాది
గుణంబులచేత ఓర్పు
గలిగియుండెదనంటినా
భూదేవి మీసన్నిధినే యున్నది.
దేవా ! వాహనారూఢుండనై
భరింతునంటినా
గరుత్మంతుడు మీసన్నిధినే
యున్నాడే.

అని సాగే "సింహగిరివచనాలు" శేషప్ప పద్యం బింబ ప్రతిబింబాలుగా తోస్తాయి. అసలు భక్తులహృదయాలు, ప్రవర్తనలు, ఆలోచనాతీరులు అన్నీ ఒకేతీరుగా ఉంటాయి. అందువల్ల రచనల్లో పోలికలు గోచరించడంలో వింతేమీ లేదు.

శేషప్ప నరసింహశతకం పైన కూచిమంచితిమ్మకవి కుక్కుటేశ్వర శతకం, గోగులపాటి కూర్మనాథుని సింహాద్రి నారసింహ శతకం, కాసుల పురుషోత్తమ కవి ఆంధ్రనాయక శతకం ప్రభావం అపారం. ఇవన్నీ సీసపద్య శతకాలే. అధిక్షేపవిన్యాసాలే. ఇంచుమించు ఏకకాలికాలే. కూచిమంచితిమ్మకవి

వ్యాసం

కుక్కుటేశ్వర శతకంలో నున్న "భూనుతవిలాస! పీఠికాపురనివాస! కుముదహితకోటి సంకాశ! కుక్కుటేశ"! మకుటాన్ని శేషప్పనరసింహశతకం లోనున్న "శ్రీ ధర్మపుర నివాస ! దుష్టసంహార! నరసింహ! దురితదూర" ! మకుటాన్ని సరిపోల్చి చూస్తే రెండు మకుటాలు కవలపిల్లల్లా తోచక మానవు. నేనింత భక్తుడి నయినా భగవంతుడు నాకే తక్కువ చేస్తున్నాడు అన్నతీరుగా ప్రపత్తితో శేషప్ప నరసింహశతకం సాగిపోతుంది. అసలు భగవంతునికే దిక్కు లేకపోతే ఇంక సామాన్యుని గతేమిటి? విధర్మీయుల ఆగడాలనుండి నిన్ను నీవే రక్షించుకోవాలి సుమా! అని భగవంతునే అధిక్షేపించే రచనగా చారిత్రక ప్రతిపత్తితో గోగులపాటి కూర్మనాథుని సింహాద్రి నారసింహ శతకం కొనసాగుతుంది. శేషప్ప, కూచిమంచితిమ్మకవి, గోగులపాటి కూర్మనాథుని శతకాల్లోనున్న వైయక్తికమైన అనుభవ స్పర్శ సులువుగా పాఠకులకు అందివస్తుండగా సాహితీపరమైనవైదుష్యంతో, భావుకప్రతిభతో కాసులపురుషోత్తమకవి ఆంధ్రనాయక శతకం పాఠకులను సమ్మోహితులను చేస్తుంది.

శేషప్ప శాస్త్రపాండిత్యంతో, భాషాపటాటోపంతో అదరగొట్టే కవి కాదు. సామాన్య జనుల్లో తాను ఒకడిగా కలిసిపోతాడు. జీవితంలో ఏవో కష్టసుఖాలు, ఈతి బాధలు అన్నీ అనుభవించాడు. తనకు రావలసినదేదో రాలేదన్న అసంతృప్తికి కూడా లోనయివుంటాడు. భారతీయుల్లో ఉండే సహజమైన వేదాంతభావనను ఒంట బట్టించుకున్నాడు. నరసింహ శతకం చదువుతుంటే గ్రామీణ ప్రాంతాల్లో, ఇంకా ఆధునిక నాగరికత విజృంభించని కాలంలో మీదకు కట్టిన తెల్లని ధోవతి, కమీజు, తలకు ఒక పెద్దరుమాలు దాల్చి, ఒడ్డు పొడుగు ఉన్న ఓ మోస్తరు పెద్ద మనిషి మనకు ప్రత్యక్షమవుతాడు. శేషప్ప భక్తులలో భక్తుడు. సామాన్యులలో సామాన్యుడు. మనలో ఒకడు. ఆ భగవంతుడు శేషప్పకు, మనకు, సర్వ సృష్టిజాలానికి శుభాన్ని చేకూర్చుగాక!

కవిత

# ప్రయాణమే జీవనం

పక్షి ఏనాడు ఏకాకి కాదు
అది నిండైన భారీ కుటుంబీకురాలు
తన రెక్కల్ని నమ్ముకొని
అవధులు లేని దిక్కుల్ని లెక్కిస్తుంది

అనంత దిగంతాల విస్తీర్ణాన్ని కొలుస్తుంది
పక్షి అతిప్రాచీన రోదసీ శాస్త్రవేత్త
మినీ విమానం లాగా ఎగిరిపోతూ
అంతరిక్షంలో చిత్రవిచిత్ర విన్యాసాలు చేస్తుంది

సుడిగాలిలో తొడగొట్టి సవాలు చేసి
గూటిలో గువ్వల్ని గుండెకద్దుకొని
మాతృత్వపు అనుభవాన్ని మానవాళికి నేర్పుతుంది
ఆ తల్లీ పిల్లల అనుబంధాన్ని
నింగి వంగి సలాం చేస్తుంది

చెట్టు గుట్టలు పరవశించి ప్రశంసలు పంపిస్తాయి
ఉదయ సూర్యునికి దారి చూపిస్తూ
నిఖిల జగత్తును నిదురలేపుతుంది
మధురాతి మధుర గానంలో

కవీశ్వరులలో అపురూప రచనలు కావిస్తుంది
ఒకొక్కసారి సాక్షాత్తు ఆకాశాన్ని
తనపై మోస్తున్నట్టు తోస్తుంది
పక్షి ఉపాధ్యాయిని ఉపదేశకారిణి
మనుగడకు మరోపేరు చలనం
నిర్విరామ ప్రయాణమే జీవనం



ప్రొ॥ పి. లక్ష్మీనారాయణ

## Pilgrim Nation: The Making of Bharatvarsh




భారతదేశం పుణ్యక్షేత్రాలకు నిలయం. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు..ఇలా సర్వమతాలకు చెందిన ఆరాధ్య ప్రదేశాలు మన దేశంలో ఉన్నాయి. వీటన్నిటి గురించిన పూర్తి సమాచారాన్ని ఒకే పుస్తకంలో పొందుపరిచారు రచయిత దేవ్ దూత్ పట్నాయక్. Pilgrim Nation: The Making of Bharatvarsh అనే పుస్తకంలో భారత ఉప ఖండంలోని, వివిధ మతాలకు చెందిన 32 పవిత్ర ప్రదేశాల పూర్తి చరిత్రను వివరించారు. వివిధ ప్రాంతాల, మతాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని ఆరాధించడం, ప్రజల నమ్మకాలు వంటి అంశాలను సైతం ఇందులో పొందుపరిచారు. ఒక పుణ్యక్షేత్రం యొక్క శతాబ్దాల తరబడి చరిత్రను ఈ పుస్తకంలో వివరించడం ఇందులోని ఆసక్తికర అంశం.

## Mahabharata for Children

మహా భారతం.. ఎన్నిసార్లు చదివితే అన్నిసార్లు సరికొత్త విషయాన్ని అందించగల అద్భుత ఇతిహాసం. మహాభారతం 18 పర్వాలు, లక్ష శ్లోకాలతో ప్రపంచంలోని అతిపెద్ద పద్య కావ్యాలలో ఒకటిగా ఖ్యాతికెక్కింది. అంతటి మహాభారతాన్ని పిల్లలకు సైతం వివరించేందుకు 'Mahabharata for Children' అనే పుస్తకం ద్వారా చక్కటి ప్రయత్నం చేశారు రచయిత్రి అర్షితా సత్తార్. మహాభారతంలోని సంఘటలను అనువదించి, పిల్లలకు అర్థమయ్యే భాషలో ఈ పుస్తకాన్ని రచించారు. మహాభారతంలో సంఘటనలు, సన్నివేశాల్లోని మంచి చెడులను




చిన్న పిల్లలు ఈ పుస్తకం ద్వారా సులభంగా అర్థం చేసుకోవచ్చు. మహాభారతంలో ఉన్న సంక్లిష్ట విషయాలను సైతం, పిల్లలకు ఆసక్తి కలిగించేలా వివరించారు రచయిత్రి అర్షితా సత్తార్.

## The Fury of Covid-19




ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కరోనా వైరస్ గురించి ఈ మధ్య కాలంలో చాలా మంది పుస్తకాలు రచించారు. కోవిడ్- 19 వల్ల కలిగిన మరణాలు, ఆర్థిక నష్టాలు వంటి వాటినే ఎక్కువగా ఆయా పుస్తకాల్లో చర్చించారు. కానీ కోవిడ్- 19 సమయంలో ఏర్పడిన సామాజిక, సాంస్కృతిక వైరుధ్యాలు, ప్రభావాల గురించి, కరోనా ఉగ్రరూపానికి దారితీసిన పరిస్థితుల గురించి The Fury of Covid-19 పుస్తకంలో వివరించారు రచయిత వినయ్ లాల్. మనిషి సహజ వనరులను, జీవాలను ధ్వంసం చేస్తూ తన అవసరాలకు వాడుకోవటం, కరోనా మనపై చూపిన ఉగ్రరూపం నుండి నేర్చుకోవాల్సిన విషయాలను ఇందులో ఎక్కువగా వివరించారు. కరోనా కారణంగా వివిధ వర్గాల ప్రజలు ప్రభావితమైన తీరును, సామాజిక వైరుధ్యాలను సైతం ఇందులో పొందుపరిచారు.

## FOSSIL FREE: REIMAGINING CLEAN ENERGY IN A CARBON-CONSTRAINED WORLD




ప్రపంచానికి సవాలుగా మారిన ముఖ్యమైన అంశం..ఇంధనాలు. ప్రస్తుతం వాడుతున్న పెట్రోలు, డీజిల్, బొగ్గు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాల వల్ల వెలువడే కాలుష్యంతో పర్యావరణానికీ, మానవ ఆరోగ్యానికీ ముప్పు వాటిల్లుతుంది. దాంతోపాటు శిలాజ ఇంధనాలు రోజు రోజుకీ తరిగి పోతుండటంతో, భవిష్యత్ తరానికి ఇంధన శక్తికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నయాలు రూపొందించడం, వినియోగించడం వంటి అంశాల ప్రాతిపదికన Fossil Free: Reimagining Clean Energy in a Carbon-Constrained World పుస్తకాన్ని రచించారు సుమంత్ సిన్హా. సౌర శక్తి, పవన శక్తి వంటి పునరుత్పాదక శక్తులను ఎక్కువగా ఉత్పత్తి చేయడానికి ఉన్న అవకాశాలు, సవాళ్లు, ప్రభుత్వ నిబంధనలు, పెట్టుబడులు వంటి అంశాలను ఈ పుస్తకంలో క్షుణ్ణంగా వివరించారు.

వ్యాసం

ఒకరచయిత అంతర్మథనం

# బాధను దించుకోవడానికే కథలు రాస్తున్నాను



పెద్దింటి అశోక్ కుమార్

నేనెందుకు రాస్తున్నాను......? కొన్ని నేనే ఎందుకు రాస్తున్నాను....? ఇలా నాకు నేను తర్కించుకుంటే నేను రాస్తున్ననా లేక పరిస్థితులు నాతో రాయిస్తున్నయా..? ఏమిటా పరిస్థితులు..? ఈ దేవులాటలో ఏండ్ల తరబడి మా ఊరుకు నాకున్న సంబంధం ఏమిటి..? ఊరు నా కథలకు ఊటబాయి ఎందుకయింది? ఎండిన మానేరు నదిలో ఇంకెన్ని వెతలున్నయి..? ఇదిగో.. ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. మొరం దేలి పొక్కిళ్లు మారిన వాకిళ్లకు మూలాలను వెతకాలె.




అన్నింటి కంటే ముందు పుంటి కూరలో ఉప్పులేని నా పేదరికాన్ని, పుట్టెడు రోగాలతో గొడగొడ కన్నీటితో చీము రక్తమయినా బాల్యాన్ని గెలకాలి. ఇది నా బలమో బలహీనతనో కాని నేను కథలు రాయడం మొదలుపెట్టే వరకూ ఎవరికథల గురించి తెలువది. తెలిసిందల్లా అతలాకుతలమైన జీవితం గురించే.

మా ఊరు భీముని మల్లారెడ్డిపేట. రాజన్న సిరిసిల్లజిల్లాలోని ఒకానొక చిన్న పల్లెటూరు. చాలా వాటికీ దూరంగా చాలా వాటికీ దగ్గరగా మానేరు వాగు ఒడ్డున ఉన్నది. ఊరు చుట్టూ నీళ్లు.... యాడాదికి రెండు పంటలు.. ఎండ కాలం వాన కాలం తేడా లేకుండా నిండుకుండల్లా రెండు చెరువులు. మాది వ్యవసాయ కుటుంబం. ఆడింత ఈడింత వక్కలు వక్కలుగా రెండెకరాల భూమి. ఏడుగురం పిల్లలం. పోయేటోళ్లు పోంగ మిగిలింది నలుగురం. నలుగురికి నాలుగు రోగాలు. సంసారం ఈదడం బాపుకు చాలా కష్టంగా ఉండేది. అప్పులంటే పుట్టెడు భయం. "చెప్పుకాలోడు అప్పుకట్టమని ఇంటి కడుప తొక్కద్దు "అనే వాడు. అయినా అప్పులు చేయక తప్పేది కాదు. అవి తీర్చలేక మొఖం దాచుకుని నానా ఇబ్బందులు పడేవాడు. సూడుసూదు మంట అప్పుడే అక్కపెండ్లయింది. ఏ కులగుల్లంత అప్పు ఏనుగంతయింది. కాలేకడుపుకు కాయనో పండో తిని కూటి గింజలను కూడా అమ్ముకునేది. ఇది నాకు బుద్ధి తెల్సినప్పుడున్న మా యాతన సంసారం. ఇదే రానురాను నా కథలకు జీవసారం అయింది.

చిన్నప్పుడు మా ఇంట్లో నాటకాలు నేర్చుకునే వారు. బాపు ఐదో పదో వస్తయని రాత్రంతా నాటకాలు నేర్పేవాడు. నేను రాత్రంతా మేల్కొని రిహార్సల్స్ చూస్తుండేవాన్ని. నేర్చుకునే వాళ్ళంతా నాటకాల్లో రాజులుగనీ, పొద్దంతా కష్టపడే వ్యవసాయ కూలీలు, జీతగాల్లే. అయినా రాత్రంతా నిద్రలేకుండా నేర్చుకునే వారు. వారిలో ఉన్న ఆ "జిల"నాకు విచిత్రంగా అని పించేది. నేను వాళ్ళకు పాత్రలు రాసిచ్చేది.అప్పుడప్పుడు ప్రాంటింగ్ చెప్పేది. అలా నాకూ నాటకాల పిచ్చి తలిగింది. రాత్రికి రాత్రి వాడకట్టు మొత్తం మా వాకిట్లనే ఉండేది. నేను నా దోస్తులతో రాత్రి చూసిన బాగోతాన్ని పగలువీధుల్లో ఆడేది. ఈ అనుభవాలే ఆ తర్వాత "మా ఊరి బాగోతం కథలు" రాసిన.

1980లో పెద్దకరువు వచ్చింది.

వ్యాసం

అంతంత మాత్రంగా ఉన్న మా బతుకులు ఆగమైంది అప్పుడే. నేను ఆరవ తరగతిలో ఉన్నా. నేను చిన్నప్పటి నుంచి రోగాల కుప్పనేగదా. దానికి తోడు మా ఊర్లో ఐదవ తరగతి వరకే ఉంది. ఆ పైచదువులకు ఆరు కిలోమీటర్లు నడిచి లింగన్నపేటకు ఒంటరిగా పోవలసిందే. మధ్యలో పెద్ద అడవి. భయమేసేది. ఎండాకాలం ఎండల్ల, వానాకాలం వానల్ల..... పునాస పంటల మీద, కాయలు పండ్ల మీద పదేండ్ల వయసులో పన్నెండు కిలోమీటర్ల నడకలో నాకు ఆరోగ్యం పాడయింది .చదువు మానేసిన. సరిగా తిండిలేక ఆకలి మీద నేను చేసిన పోరాటం సరిగ్గా వైద్యం అందక శివసత్తుల చుట్టూ తిరిగిన గోస అంతా ఇంతా కాదు. ఆ అనుభవమే తర్వాత "అతడు ఆకలిని జయించాడు" "ముల్లు", "తెగారం" కథలుగా రాసిన. చదువు లేదు కనుక బాపు వెంట పొలం పనికిపోతూ పంట కోసం ఆయన "తండ్లాటను" దగ్గరుండి చూసేవాన్ని. తర్వాత... తర్వాత ఆ అనుభవాన్ని "తండ్లాట" కథగా రాసిన. ఆయన భూమితో, పంటతో, పకృతితో, చేసిన చావురేవు పోరాటమే చూసిన కంటితో 'కీలు బొమ్మలు' 'అదృశ్య రూపాలు' 'ఆట కోయిలి పోరడు' 'ఎండమావ' కథలుగా రాసిన.

నన్నే ప్రయోజకుడిని చేయాలనే బాపు ఆలోచనకు నా చదువు ఆగిపోవడంతో ఆయన చాలా బాధపడ్డడు. అప్పుడు వాళ్ల కున్న జ్ఞానంలో డాక్టర్ కంటే శివసత్తులే గొప్పవాళ్లు. వాళ్లపొత్తి, బండారి, నిమ్మకాయలు, తాయతుల మీదనే మందు గోళీల కంటే నమ్మకం ఎక్కువ. అట్లా ఓ ఆరు నెలల పాటు అనారోగ్యంతో శివసత్తుల ఇండ్లచుట్టు తిరిగాను. దించుళ్లు..... తాయితులు..... బండారు ఆనతులు.... అట్లా వాళ్ల జీవితాలను చూసే అవకాశం దొరికింది. సామాజిక హెూదా కోసం శివసత్తులు పడే తపన కనిపించింది. నా రోగం పోయిందో లేదో తెలువదు కాని వాళ్ళు పాడే పాటలు మాత్రం నోటికి వచ్చినయి. కోమటి, బ్రాహ్మణ వెలమ లాంటి ఉన్నత కులాల్లోని స్త్రీలకు రాని పూనకం దళిత స్త్రీ లకే ఎందుకు వస్తుంది అన్న ప్రశ్న నాకు అప్పుడే కలిగింది. ఆ మూలాలను వెదుక్కునే తర్వాత "తెగారం" కథను రాసిన. అదే పేరుతో నాటికను రాసిన. అది నలభై రెండు ప్రదర్శనలు చేసుకుంది.

అట్లా చదువు ఆగిపోయినంక నేను వ్యవసాయం వైపు వచ్చిన. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. మాకు రెండు పూటల తిండి పెట్టడం కోసం జూదం లాంటి వ్యవసాయంతో ఆడుతూ ఓడుతూ అడుగడుగునా మా తల్లితండ్రులు పడే ఇబ్బందులు కంటి నిండా చూసాను. ఆ కొద్ది పంట చేతికి వస్తుందనే లోపు ఒకసారి రాళ్ళవాన పడేది. మరోసారి దోమపోటు లేచేది. ఇట్లా బాపుకు వ్యవసాయం మీద పూర్తిగా మనసు విరిగిపోయింది. నాలో ఏదో భావావేశం పొంగేది. పాటలు పద్యాలు రాసుకునేవాడిని. ఈ ఆవేదనే తరువాత 'దాడి 'నవలగా రాసిన.

వర్షాలు లెవ్వు. కరువుకోరలు సాచింది. ఉన్న దొయ్యలు బీడువారి పోయినయి. మొదటిసారిగా గల్ఫ్ దేశాల వైపు వలసలు అప్పుడే మొదలయ్యాయి. ఏడాది బొంబాయి చుట్టూ తిరిగితే తప్ప వీసా చేతికివచ్చేది కాదు. బొంబాయిలో జోపుడాల్లో వాళ్ళు పడే బాధలు కథలు కథలుగా చెప్పేవాళ్ళు. ఏజెంట్ల జిమ్మిక్కులకు లెక్కనే లేదు. ఇన్ని కష్టాలకోర్చి అక్కడికి చేరుకుంటే ఆరు నెలల దాక ఉత్తరం వచ్చేది కాదు. వచ్చినా ఉత్తరం నిండా కష్టాలే !

**ఇందాక పక్కవాళ్ళకు చూసిన గల్ఫ్ వలస బాధలు ఇప్పుడు మా ఇంట్లో మొదలయ్యాయి. బాపు ఎమాన్ వెళ్ళినంక ఎనిమిది నెలలవరకూ ఉత్తరం రాలేదు. ఎవరిని అడగాలో తెలువది. ఎవరికి చెప్పాలో తెలువది. అమ్మ ఏడ్వని రోజు లేదు. ఏడ్చి ఏడ్చి మంచాన పడ్డది. బతకనే బతకదను కున్న. బాపు రాసినట్టుగా ఒక ఉత్తరాన్ని సృష్టించి తెచ్చిచదివితే కాని ఆమె కోలుకోలేదు. తర్వాత కాలంలో ఇవే అనుభవాలతో పద్నాలుగు వలసకథలతో 'వలసబతుకులు'. 'ఎడారిమంటలు' నవలగా" ఎండమావ' నాటకంగా రాసిన.**

మా వాడకు ఉత్తరాలు నేనే రాస్తుండేవాడిని. అక్కడి నుండి వచ్చిన ఉత్తరాలను నేనేచదువుతుండే వాడిని. అట్లా అక్కడ ఇక్కడ ఇద్దరి బాధలు నన్ను చిన్నతనాన్నే కలవర పెడుతుండేవి. నన్ను కంటతడి పెట్టిస్తుండేవి. మా దూరపు బంధువు ఒకాయన మస్కట్ వెళ్లిన తర్వాత యాడాదివరకూ ఉత్తరం రాలేదు. తర్వాత వచ్చిన ఒకే ఒక ఉత్తరంలో ఉన్న విషయం చదివి వాళ్లతల్లి బెక్కన బెంగటిల్లి పిడాత ప్రాణ మిడిసింది. నాకు మనసు కలికలి అయింది.

తను ఎడారుల గుట్టల నడుమ ఉన్నానని గోర్లు మేపుతున్నానని వారానికి ఒకసారి కనిపించే హరిబాబు తప్ప మనిషి కనిపించడని నెలకు ఒకరోజు స్నానం చేస్తానని ఒక క్యాన్ నీళ్ల వారం దాకాకాపాడుకోవాలని, ఒకసారైతే నీళ్ల



లేక గొర్ల మూత్రం తాగానని రాసిండు. మనిషన్న వానికి ఆ ఒక్క ఉత్తరం చాలు. జీవితాంతం వెంటాడడానికి.

కాలం నడుస్తుంది.ఈ వలస బాధ మాకూ తప్పలేదు. వ్యవసాయం మీద మనసు విరిగిన బాపు ఏజెంటు చేతుల్లో చిక్కుకున్నడు. ఏడాది బాంబే చుట్టు తిరిగిండు. నా ఆరోగ్యం కొద్దికొద్దిగా కుదుటపడుతుంది. బాపు ఇంట్లో లేకపోవడంతో నేను వ్యవసాయ పనులు చూసుకుంటున్న. చదువు మీద మనసుతో పది ప్రైవెట్లో కట్టి పాస్ అయిన. అత్తెసరు మార్కులతో పాస్ అయినగదా.. ఏ గవర్నమెంటు కాలేజీలో సీటు రాలేదు. అప్పుడే నార్త్ ఎనమ్ దేశానికి బాపుకు వీసా వచ్చింది. వెళ్తు వెళ్తు ఎడ్లను అమ్మి వచ్చిన డబ్బుతో డొనేషన్ కట్టి నన్ను ఇంటర్‌లో చేర్చి పోయిండు. నా కోసమే తెరిచినట్టు గంభీరావుపేటలో గవర్నమెంటు కాలేజీ డిసెంబర్‌లో కొత్తగా లేటుగా తెరిచారు.

ఇందాక పక్కవాళ్ళకు చూసిన గల్ఫ్ వలస బాధలు ఇప్పుడు మా ఇంట్లో మొదలయ్యాయి. బాపు ఏమన్ వెళ్ళినంక ఎనిమిది నెలలవరకూ ఉత్తరం రాలేదు. ఎవరిని అడగాలో తెలువది. ఎవరికి చెప్పాలో తెలువది. అమ్మ ఏడ్వని రోజు లేదు. ఏడ్చి ఏడ్చి మంచాన పడ్డది. బతకనే బతకదను కున్న. బాపు

> **99 వారపత్రికల మూసలో కథలు రాయడం మొదలు పెట్టిన. చదువొక్కటే జీవితాన్ని మారుస్తదని తెలుసుకున్నం కట్యూషన్లు చెప్పుకుని డిగ్రీ, బియిడి పూర్తి చేసిన. 92లో పెండ్లి తర్వాత 96వరకు ఊరికి దూరంగా ప్రైవేట్ స్కూళ్ళలో గడిపిన. ఈ కాలంలో ఊరిని చూసింది చాలా తక్కువ. ఈ కాలంలోనే మూడు నాలుగు ప్రేమ కథలు కూడా రాసిన. అదే జీవితంగా సాగిపోతుంది.**

రాసినట్టుగా ఒక ఉత్తరాన్ని సృష్టించి తెచ్చిచదివితే కాని ఆమె కోలుకోలేదు. తర్వాత కాలంలో ఇవే అనుభవాలతో పద్నాలుగు వలసకథలతో 'వలసబతుకులు'. 'ఎడారిమంటలు' నవలగా" ఎండమావ' నాటకంగా రాసిన.

ఇంటర్ చదివేప్పుడు కిరోసిన్ లేక కాగితాలతో అన్నం వండు కోవడం, రోజు రూపాయి కూలీకి బీడి కంపనీలో పనిచేయడం కూరగాయలు కొనలేక కారంతో తినికడుపు నొప్పి తెచ్చుకోవడం ఒక విచిత్ర అనుభవం. అవే 'ఆటకోయిలిపోరడు' 'ముల్లు' 'ఆకలి' కథలకు మూలాలు. రెండేండ్ల తర్వాత బాపు ఉత్త చేతులతో వచ్చిండు. ఎవుసం మూలకు వడ్డంక అమ్మ అష్టకష్టాలు పడి బీడీలు నేర్చుకుంది. ఆమె చేతివేళ్ళు బీడీలు చుట్టడంలో మలిగేవికావు. అయినా ప్రయాస పడేది. అప్పు అప్పులాగే ఉంది. ఉన్న దాంట్లో ఎకరం పొలం అమ్మి చెల్లెపెండ్లి చేసినం. సంసారం తీవ్ర సంక్షోభంలో పడింది. 'మాయిముంత' కథల సంపుటిలోని పన్నెండు కథలకు అప్పటి అనుభవాలే మూలాలు.

అప్పుడు నేను డిగ్రీలో చేరిన. అప్పుల బాధతో అమ్మకు బెంగ పట్టుకుంది. నన్ను చదువు మాన్పించి ఏదైనా కిరాణం దుకాణంలో ఉంచుదామంది. బాపు ఒప్పుకోలేదు. నన్ను డాక్టర్ను చెయ్యాలని ఆయన పిచ్చికోరిక. ఇల్లు అమ్మి అయినా సరే డాక్టర్ చదివిస్తా అనేవాడు. నాకూ కావాలనే ఉండేది. కానీ ఎంత ఖర్చవుతదో ఆయనకు తెలువది. ఏం చదువాలో నాకూ తెలువది. నేను ఎంపిసితో ఇంటర్ చేస్తుండగా గూడా అదే మాటను అనేవాడు. ఈ అనుభవమే 'భూమడు' 'ఇగ వీడు తొవ్వకు రాడు' కథలకు మూలం.

నాకు మొదటిసారిగా కథంటే నవలంటే తెలిసింది డిగ్రీలోనే. ఒక మిత్రుడు ఆంధ్రభూమి వార పత్రికను వరుసగా చదివేవాడు. అది సస్పెన్స్ థ్రిల్లింగ్ నవలల కాలం. వారపత్రికల కథలే కథలనుకునే వాన్ని. అంతవరకు




నేను చూసిన గొర్రె తోకబెత్తెడు జీవితం జీవితమే కాదనిపించింది. వారపత్రికల మూసలో కథలు రాయడం మొదలు పెట్టిన. చదువొక్కటే జీవితాన్ని మారుస్తదని తెలుసుకున్నంక ట్యూషన్లు చెప్పుకుని డిగ్రీ, బియిడి పూర్తి చేసిన. 92లో పెండ్లి తర్వాత 96వరకు ఊరికి దూరంగా ప్రైవేట్ స్కూళ్ళలో గడిపిన. ఈ కాలంలో ఊరిని చూసింది చాలా తక్కువ. ఈ కాలంలోనే మూడు నాలుగు ప్రేమ కథలు కూడా రాసిన. అదే జీవితంగా సాగిపోతుంది. ఈ లోగా ఊర్లో జరగాల్సిన మార్పులు జరిగిపోయినయి. ఊరు దోరమక్కిన పండులా శిదలు శిదలయి కుప్పకూలింది. 1996లో టీచర్ ఉద్యోగం రాకపోతే నేను కథలు రాసేవాన్ని కాను. ఊరి పక్కనే ఉద్యోగం. ఊర్లో మకాం. నా స్వంత ఊరే అయినా ఐదేండ్ల తరువాత వచ్చినగదా ఇప్పుడు కొత్తగా వింతగా ఉంది. మార్పు మార్పుకు ఒదిగి భయం భయంగా ఉంది. అప్పటికీ ఇప్పటికీ తేడాలు చూస్తే ఊరి బతుకులు మరింత ఆగమైనయి. వలసలు పెరిగినయి. కుల వృత్తులు కూలి పోయినయి. ఊరు గ్లోబల్ పడగ నీడలో ఉన్నట్టు స్పష్టంగా కనిపించింది. ఊర్లనే పిల్ల ఏజంట్లు పుట్టుకొచ్చారు. మస్కట్, దుబాయ్ పేరుతో జనాలను ఆగం

చేస్తున్నరు. మారిన ఊరిని చూసినంక ఏడుపు ఆగలేదు. ఊరిలో వయసు మీదున్న మొగోడు లేడు. అగో.. అప్పుడు గుండె బరువుదించు కోవడానికి కథలు రాయడం మొదలుపెట్టిన. కూలిన కులవృత్తుల వెనక ఉన్న కుట్రను చెప్పడానికి పెన్నుపట్టిన. కుమ్మరి, కమ్మరి, వడ్ల, శాల, మంగలి, సాకలి, గొల్ల, తెనుగు, గౌడ,మాదిగ, ఇలా సబ్బండకులాల మీద కులానికో కథరాసిన. అంతే కాకుండా పిల్లి, దోమ, ఈగ, కుక్క, బర్రె, పంది, కోతి, కోడి, పాము, గుడ్డేలుగు, గంగెద్దు.. పల్లెలోని ఏ జంతువును వదలకుండా ప్రతీతాత్మకంగా కథల్లోకి తెచ్చిన. అవన్ని 'ఊటబాయి' 'భూమడు' కథా సంకలనాల్లో రాసిన.

ఒకనాడు పాలకుండలాంటి ఊరును చూసిన. ఉన్నతంగా వెలిగిన వృత్తులను చూసిన. ఇప్పుడు ఆ దృశ్యమే మారింది. ఊరు వాడిపోయిన పువ్వయింది. రెండేండ్లు నాలో నేను తొక్కుకున్న. మధనపడ్డ. ఏడ్చిన. 99 చివరలో మొదటిసారిగా 'ఆశ-నిరాశ' 'ఆశ' కథను రాసిన. కాని మొదటగా ప్రచురితమైన కథ మాత్రం "కన్నతల్లి". 2000 సంవత్సరం నాటికి కథలు రాయకుండా ఉండలేని స్థితికి వచ్చిన. అంతదాక తెలంగాణ కథ రైతుకూలీల దగ్గరనే ఆగింది. మరి కిందికి దింపి అట్టడుగున ఉన్న నా ఊరు జన జీవితాలను కథలుగా నా ఊరి భాషలో రాయాలనుకున్న. నా చుట్టూ ఉన్న జీవితాలనే తీసుకున్న. అన్నీ సజీవమైన పాత్రలే. పేర్లు మాత్రమే మారుస్తున్న. నన్ను కదిలించిన ప్రతీ సంఘటనను అక్షరీకరించడం మొదలుపెట్టిన. అవన్నీ 'జుమ్మేకీ రాత్ మే' 'కథలుగా' 'మానేటి కథలుగ' రాసిన. కాని రాసిన కథల కంటే మనసులో రాయకుండా మసులుతున్న కథలే ఎక్కువ. ఒకప్పుడు చెలిమలూరిన ఊరు ఇయ్యాల్ల గొంతు తడుపుకోవడానికి నీళ్లను కొనుక్కుంటుంది. ఆ కోణంలో గ్రామీణ పర్యావరణ సమస్య మీద "దాడి" నవలను రాసిన. మాయమైన మా బాగోతాల నేపథ్యాన్ని "మా ఊరి బాగోతం"గా రాసిన. చిన్నప్పటి నుంచి నన్ను కలవర పెట్టిన వలసలను "వలస బతుకులు "కథల సంపుటిలో రాసిన. పర్యావరణ కాలుష్యం, మారిన జీవితాలు కూలిన కులం వృత్తులను "ఊటబాయి" కథలుగా రాసిన. రాజకీయాలు మారిన పల్లె జీవితాలను "ఊరికి ఉప్పులం" నవలగా రాసిన. సంచారజాతులమీద 'గోస' 'ఆట' 'రెండుకోతులు' కథలతో పాటు 'జిగిరి' 'సంచారి' నవలలను రాసిన. ఇది తొమ్మిది భాషల్లోకి అనువాదమయింది. అలా ఊరిని అంటుపెట్టుకున్న జ్ఞాపకాలతో రెండు వందల కథలను ఏడు నవలలను పది నాటకాలను రాసిన. హిందీలో, మరాఠీలో, కన్నడంలో మా ఊరి కథలే అనువాదమై సంకలనాలుగా వచ్చినయి.

తెలంగాణ ఉద్యమంలో ఊరు ఉప్పెనై లేచింది. ఆ నేపథ్యంలో ఆరుకథలతో 'పోరుగడ్డ', 'లాంగ్ మార్చ్' నవలను రాసిన. కరోనా లాక్ డౌన్ వలన "ఇంకెంత దూరం" నవలను రాసిన. కథలు నవలలు కాకుండా ఊరి జీవితాలను వెండితెరకు ఎక్కించే ప్రయత్నంలో నాలుగు సినిమాలకు రచనలు చేసిన. మొత్తం మీద ఊరికి దూరమైతే తప్ప..... కదిలిపోవడం, కరిగిపోవడం ఆగితే తప్ప.... మా ఊరి వెతలు కథలు కథలుగా నావెంటవస్తూనే ఉంటాయి. జనం పాత్రలుగా చొచ్చుకస్తూనే ఉంటారు. మా మానేరు వాగు పొంగులా.

# ఒక పాప... మరో బుద్ధుడు



ఓ సాయంత్రం
తనకు అందని బుద్ధుడ్ని
పిలుస్తోంది ఆ పాప
బుద్ధుడు ఎంతకీ అందట్లేదని విచారం

నేనూ ఎగురుతున్నాను
పాపతో పాటే
రెండు మూడు నాలుగు...
అలసటనేదే లేకుండా ఎగురుతూనే ఉంది
పాప క్రింద పడిపోవటాన్ని మాత్రమే
తల్లి చూసింది
బుద్ధుడ్ని అందుకున్న సంగతి
ఆమెతో పాటు ఎగురుతున్న నాకూ
పాపకు తప్ప మరెవరికీ తెలియదు
నేనూ ఎగరనైతే ఎగిరాను కానీ
నాకు బుద్ధుడు అందలేదు
పాపలా ఎగరనన్నా ఎగరాలి
ఎదగనన్నా ఎదగాలి
నన్ను ఎదిగి రమ్మంటున్నాడు బుద్ధుడు
పడిపోతానని క్రిందకూ దింపాడు
తదాదిగా ఎగురుతూనే ఉన్నాను
ఎదగలేక పడుతూనే ఉన్నాను
ఇంతకీ నాకు అందని బుద్ధుడు
ఎంత ఎత్తో
ఆ పాప అందుకున్న బుద్ధుడు
ఎంత కురచో...!



సీతారాం

అనువాద కథ

# నమ్మశక్యం కానిది

ఆంగ్ల రచన: ఆర్.ఎం. ప్రభులింగ శాస్త్రి

తెలుగు అనువాదం:
**అచ్యుతుని రాజ్యశ్రీ**

'ఆ.. ఇది కోస్గీ పల్లె కదయ్యా..?' బస్సులో ఉన్న నాగయ్య సంశయంతో అడిగాడు. డెబ్బై ఐదేళ్ల తర్వాత నూరేళ్ల ఆ పండు ముసలి నాగయ్యకు ఆ సందేహం రావటం సహజమే మరి..! తన స్వస్థలంలో ఎన్ని మార్పులు చేర్పులు..!

'అవునయ్యా! నీవు ఏడనుంచి వస్తుండావు? నీవు ఎవరివి?'

ఎవరో ప్రయాణికుని స్వరం, బస్సు దిగుతూ అడిగింది.

'గుల్బర్గా (కలిబుర్గి) నుంచి వస్తున్న ఆమె పేరు సరోజ'.

'ఎవరు నువ్వు తాతా? ఎక్కడ్నించి వస్తున్నావు?'.

'నా పేరు నాగయ్య. పాకిస్తాన్‌లోని సింధ్ నించి వస్తుండా.

'ఏంటీ? పాకిస్తాన్ నించా? నీకు మా కోస్గీలో బంధుమిత్రువులెవరైనా వున్నారా?' సరోజ ప్రశ్నకు దృఢంగానే జవాబిచ్చాడాయన.

'అవును, పాకిస్తాన్ కాడనించే వస్తుండా. నా పెళ్లాం ఈ ఊళ్లనే ఉంటది'.

'ఎవరామె?'.

'సిద్దమ్మ'. ప్రేమ, ఆప్యాయత ఆయన కంఠంలో తొణకిసలాడ్తోంది.

'సిద్దమ్మా? వారి ఇంటి పేరు ఏంటి? ఏ వీధిలో ఉంటుంది?' సరోజ ప్రశ్నల జడివాన కురిపించింది.

'మా యింటి పేరు టెంకాయల, జంగమవాడలో మా ఇల్లు ఉండాది. ఆమె ఆడనే ఉన్నదో, లేదో నాకు ఎరికలేదమ్మా?'

'ఓ.. టెంకాయల సిద్దమ్మనా!' ఆశ్చర్యంగా అంది సరోజ.

'బిడ్డా! ఆమె నీకు ఎరుకేనా?' ఆనందం, ఆత్రం తొణికిసలాడింది. ఆ పెద్దాయన మొహంలో!

'తాతా.. నేనూ జంగమవాడలోనే ఉంటా. మరి నాతో నువ్వు నడవగలవా? టాంగా మాట్లాడేదా? ఆమె కంఠంలో అత్యుత్సాహం, కుతూహలం. తొంగి చూశాడు. రెండు కిలోమీటర్లు ఆ పెద్ద మనిషి నడవలేడని ఆమె అభిప్రాయం.

'ఓ.... జబర్దస్త్‌గా నడుస్తానమ్మా!' సరోజతో అడుగేస్తూ అన్నాడు నాగయ్య.

'మీకు తొంభై ఏళ్లుంటాయా..?' ఆమె దృష్టిలో ఆ వయసు వారు రెండు కి.మీ నడవలేరు.

'నాకు సరిగ్గా వంద ఏండ్లు బిడ్డా!. నా పెండ్లాంకి ఎనభై ఐదు'.

'మీకు బాగా గుర్తుందా మీ వయసులు!' ఆమెలో సందేహం ఇంకా సమసిపోలేదు. కానీ ఆ వృద్ధుని జ్ఞాపక శక్తి అపారం.

తన జ్ఞాపక శక్తికి పరీక్షలా నాగయ్య చెప్పుకుపోసాగాడు. 'నా లగ్గమప్పుడు ఆమెకి ఐదు ఏండ్లు, నాకు ఇరవై. నీకెందుకంత అనుమానం బిడ్డా.. ?'

'అది కాదు తాతా! ఆ రోజుల్లో పుట్టిన తేదీ, సంవత్సరం ఎక్కడా రాసి రికార్డు చేసే వారు కాదు గదా?'

'మా వంశంలో మా భార్య ఇంట జాతకాలు రాసి ఉంచేవారు, మేము పుట్టగానే. అలా మా పుట్టిన తేదీలు, జాతకాల్ని బట్టి లగ్గం టైంల పెండ్లి కూతురు, పెండ్లి కొడుకులకి లగ్గం జరిపేవారు. జాతకం కుదరకుంటే వదిలేసేవారు'.

'ఆ.. మాకూ ఈ పద్ధతే ఉంది తాతా! మరి అవ్వను అలా వదిలేసి ఒంటరిగా ఎందుకు వదిలెళ్లిపోయావు?'.

సరోజ ఆ విషయాన్ని తన చుట్టు ప్రక్కలవారి ద్వారా అప్పటికే విని ఉంది. పెళ్ళి కాగానే నాగయ్య తన ఇంటి వారిని, భార్యని వదిలేసి యాడికో వెళ్లి పోయాడనే అంతా చెప్పుకునేవారు.

'పాపం ఆ పిల్లకీ తెలవదమ్మా? నేను నా వారిని, ఆమెనీ వదిలి ఏడికో పోయిన సంగతి! అమాయకురాలు సిద్దమ్మ.. ఆ.. ఆమె ఇంటిలో ఎవరెవరుంటారు బిడ్డా?'.

'పాపం, ఒకత్తే ఉంటది. బంధు మిత్రులు లేరు ఆమెకి. నాకు తెల్సినంత వరకూ. ఎవరూ ఆమె ఇంటికి రారు.

'ఆమె అన్నదమ్ములు కూడా రారా బిడ్డా?'.

'తాతా, ఆమె ఇద్దరు అన్నదమ్ములు చనిపోయారు. తమ్ముడు కర్ణాటకలో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. నాకు ఇప్పుడు యాభై ఏళ్లు. నా బాల్యం నుంచీ ఆమెను చూస్తున్నా. ఎవరూ రారు, పోరు,

అనువాద కథ

ఒంటిగా ఉంటదా అవ్వ..' సరోజ చెప్పింది.

'పాపం, ఎలా బతుకు ఈడుస్తుందమ్మా...' తాతకు బాధ, పశ్చాత్తాపం. తొంగి చూస్తున్నాడు. నాకూ నా అన్నదమ్ముల గురించి ఎరుకే లేదు'.

'మీరు, ఎన్నాళ్ల అయింది తాతా, ఇల్లు, ఊరు విడిచి..? ఇన్నాళ్లా మీ భార్య గుర్తుకే రాలేదా?' డెబ్బయి సంవత్సరాలు! ఊరునీ, ఆమెనీ యాదిజేకుంటనే ఉండా. నాకు తెలీకుండా చెప్పాపెట్టకుండా ఇర్వై ఏండ్లకే నాకు లగ్గం చేశారు. ఓ పిలగాడిలా ఆడుతూ పాడూతూ తిరిగే నాకు, మా అన్న వదినెల సూటిపోటి మాటలు ముల్లుల్లా గుచ్చుకునేవి. ఏ కారణం లేకుండానే పొద్దస్తమానం నన్ను సతాయించేటోళ్లు. పుల్ల విరుపు మాటలు దెప్పుళ్ళతో నన్ను గాయపరిచేవారు. పానం ఇసిగి నడుచుకుంటా తాండూరు ఎల్లినా. ఆడినుంచి కలిబుర్గి, ఆడినించి షోలాపూర్, ఆపై బొంబాయి చేరిన రెండేళ్లకి. తిండి తిప్పలు లేక, నిద్ర లేక రెండేళ్లు ఆవారాగా పనిపాటా లేక రెండేళ్లు తిరిగినా. బొంబాయిల బట్టల గోడౌన్‌ల కూలీగా చేరి, మా యజమానితో పాకిస్తాన్ లోని సింధుకి చేరాను. నా నీతి నిజాయితీలే నాకు ఆయన కాడ కొలువు ఇప్పించినయి. తన తొమ్మిది మంది బిడ్డలు, ముగ్గురు కొడుకుల పెండ్లి పేరంటం అయ్యే దాకా నేను ఆడనే ఉంటానని ఆయనకి పెమానం చేసినా.

'తాతా! అలా నిన్ను ఎందుకు కట్టిపడేశాడు ఆయన? ' కుతూహలంగా అడిగింది సరోజ. 'ఆయన మూడు లగ్గాలు చేస్కున్నడు. నలభయ్యవ ఏట పన్నెండు మంది పిల్లలు కల్గారు ఆ ముగ్గురు భార్యల వల్ల. నేను సింధుకి వెళ్ళేప్పటికే ఆయన వయసు అర్వై. అందుకే కుటుంబ బరువు, భారం నాపై మోపాడు. తన ముగ్గురు భార్యలకి తమ్ముడిలా అండగా ఉంటానన్నాను. ఆ అమ్మలు కూడా సరే అన్నారు. అలా ఆయనకి ఇచ్చిన వాగ్దానం కోసం నేనుండి పోయాను. ఆయన బతికుండగానే ఇద్దరు కూతుళ్ల పెళ్ళి చేశాడు. ఆయన చనిపోవటంతో వ్యవసాయం వస్త్ర వ్యాపార భారం నాపై పడింది. మిగతా అందరి పెళ్ళి పేరంటాలు చేసి ముప్పై ఏళ్ళు నా స్వామి భక్తిని చాటుకున్నాను. కానీ గత పదేళ్లుగా ఆ పిల్లలు నన్ను ఈసడించి లెక్కచేయడం లేదు. అయినా సహించాను. ఒకడు నన్ను బయటికి గెంటేస్తే అంతా గడ్డప్పగించి చూశారు. నేను వారికి వ్యర్థ పదార్థంగా, భారంగా అనిపించాను. అంతే వారిల్లు వదిలి నా యజమాని పెద్ద కూతురు దగ్గర కెళ్ళి నా గోడు వెళ్లబోసుకున్నాను. ఆమె తన తమ్ముళ్ళ తరుపున క్షమాపణ చెప్పి, అక్కడే ఉండమంది. కానీ నన్ను నా పల్లెకు పంపేయమని వేడుకుంటుంటే, ఆమె చేసిన ఏర్పాట్లతో నేను భారతదేశానికి వచ్చాను. ఇప్పుడు నా పల్లె తల్లిని నా వారు, నా భార్యని కలవాలని, ఇక్కడే తనువు చాలించాలని వచ్చాను బిడ్డా!

'అంటే సిద్దమ్మ గురించి మీకేమీ తెలీదా తాతా? '

'అవును, నాకేమీ తెలీదమ్మా!' పాపం, ఆమె ఎలా బతుకుతోంది? అతని కంఠంలో ఓ బాధ.

తాతా ! మీరు ఊరు విడిచి వెళ్ళాక ఆమె పుట్టింటికెళ్లటానికి ఇష్టపడలేదు. మీ అమ్మా నాన్నల్తోటే ఉంది. ముప్పై ఏళ్ల క్రితం వారు ఈ లోకం విడిచి పోయారు. మీ అన్నలు పోలీసు శాఖలో ఉద్యోగం కాబట్టి హైద్రాబాద్‌లో స్థిరపడ్డారు. మీ తమ్ముడు కర్ణాటకలో స్థిరపడి కలిబుర్గి జిల్లాకి చెందిన ఓ పల్లె ప్రాంత స్త్రీని వివాహం చేసుకున్నాడు. అప్పట్లో అది హైదరాబాద్ రాజ్యంలో ఉండేది. అతని గురించి తెలీదు. మీ మరదలు పుట్టింటి వారు ధనవంతులే. అవ్వ సిద్దమ్మ ఒక్కత్తే 'నా మగడు ఎప్పటికో అప్పటికి వచ్చి తీరుతాడు' అని గట్టి నమ్మకంతో రోజులు వెళ్లదీస్తోంది. ఆయన్ని చూశాకే నా పానం పోతది అని అంటుంది అవ్వ! క్లుప్తంగా సరోజ వివరాలు అందించింది. 'తాతా! ఎంతో మంది అనుకుంటున్నారు ఆమె భర్త ఎప్పుడో గతించి ఉంటాడని. ఆమెని వితంతువుగానే భావించి పుణ్యకారాలకి, పెళ్ళి పేరంటాలకి రానివ్వరు, పిలవరు కూడా. అసలు ఆమెని ఎంత మంది మళ్ళీ పెళ్ళి చేసుకో అని ఎంత నచ్చజెప్పినా ససేమిరా అంది. పెళ్ళి అంటే జన్మజన్మల బంధం అని ఆమె గట్టి నమ్మకం.

'ఆమెను ఎవరూ వంచించలేదా?' పెళ్ళాడమని బలవంతపెట్టలేదా అమ్మ?.

'ఏంటి తాతా, ఆమె శీలాన్నే శంకిస్తున్నావా? ముసలాడివైన నీ మగ బుద్ధి పోనిచ్చుకున్నావు గాదు?'. సరోజ కోపంగా అరిచింది.

> **'అవును, నాకేమీ తెలీదమ్మా!' పాపం, ఆమె ఎలా బతుకుతోంది? అతని కంఠంలో ఓ బాధ. తాతా ! మీరు ఊరు విడిచి వెళ్ళాక ఆమె పుట్టింటి కెళ్లటానికి ఇష్టపడలేదు. మీ అమ్మా నాన్నలతోటే ఉంది. ముప్పై ఏళ్ల క్రితం వారు ఈ లోకం విడిచి పోయారు. మీ అన్నలు పోలీసు శాఖలో ఉద్యోగం కాబట్టి హైద్రాబాద్‌లో స్థిరపడ్డారు. మీ తమ్ముడు కర్ణాటకలో స్థిరపడి కలిబుర్గి జిల్లాకి చెందిన ఓ పల్లె ప్రాంత స్త్రీని వివాహం చేసుకున్నాడు. అప్పట్లో అది హైదరాబాద్ రాజ్యంలా ఉండేది. అతని గురించి తెలీదు. మీ మరదలు పుట్టింటి వారు ధనవంతులే.**

'అదిగాదమ్మా! నా జీవితంలో ఎంత మంచి స్త్రీల దీన హీన స్థితిని చూశానమ్మా! తన మాటను సమర్థించుకున్నాడు.

'నీవన్నది కరక్టే తాతా! కానీ సిద్దమ్మ అవ్వ అంటే గ్రామమంతా చెయ్యెత్తి మొక్కుతారు. ఆమెపై అపవాదు వేయటం, కన్నెత్తి చూడటం ఇంతవరకూ ఎవరూ చేయలేదు. అవునూ, నీవు అక్కడ ఇంకో ఆమెను పెళ్ళాడావా తాతా?'.

'ఊహు, నాకు తాళికట్టిన భార్య తప్ప ఇంకో ఆమెతో పనిలేదు. సిద్దమ్మను

అనువాద కథ

భర్తగా నేను ఏలుకో లేదు కానీ, ఏకపత్నీవ్రతుడిని. నా జీవితంలోకి ఇంకో స్త్రీని ప్రవేశించ నీయలేదు నేను.'

'నిజంగా మీ ఇద్దరూ ఆదర్శ వ్యక్తులు. నిష్కళంక సచ్చీలురు. బ్రహ్మచారి, కన్యలాగ ఎలాంటి దోషం లేని అమలిన జీవితం గడుపుతున్నారు.' ఆనందం, ఉద్వేగం, ఆరాధనా భావం సరోజ స్వరంలో తొణికిసలాడాయి.

'అవ్వా! గావు కేక వేసింది సరోజ'. తన ఇంటి లోపల్నించి సిద్ధమ్మ,

'రా బిడ్డా సరోజ! ఆ.. ఇంకోరు ఎవరు?' అంటూ లోపలికి ఆహ్వానించింది. ఆ ఇద్దరూ చాపపై కూచున్నారు. అవ్వ మాత్రం కూచోలేదు. సరోజ బలవంతంపై కూలబడింది.

'అవ్వా! నాకు మంచి విందు ఇవ్వాలి'. 'నీకేది కావాలంటే అది తీసుకో బిడ్డా!' ఆప్యాయంగా అంది అవ్వ.

'ఆ.. నీకు ఓ వింత ఆశ్చర్యకర విషయం చెప్తాను అవ్వా! ఈ తాత ఎవరో నీకు తెలుసా? గుర్తు పట్టలేదా?' నాగయ్య పెదవి విప్పబోతుండగా వారించింది సరోజ.

'లేదు బిడ్డా! ఈయన నాకు ఎరకలేదు'.

'అవ్వా, నీవు భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్ని, అచ్చమైన హిందూ గృహిణి పుణికి పుచ్చుకున్న స్త్రీ మూర్తివి. జంతు పశుపక్షులు కూడా తమ భౌతిక శారీరక అవసరాలకై, వాటిని సంతృప్తి పరుచుకోవటానికై తెగ తాపత్రయపడి, అవి తీరేదాకా పోరాటం సాగిస్తాయి. నీవు మాత్రం ఆడపిల్లగా పుట్టి కన్నెగా, నిష్కామంగా పవిత్ర జీవితం గడిపిన ధన్యజీవివి. సతీ ధర్మాన్ని తు.చ. తప్పకుండా పాటించి ఆనాటి పురాణ పతివ్రతల అడుగు జాడల్లో నడిచిన సుగుణాల రాశివి. పెళ్ళంటే తెలీని వయసులో తాళి కట్టించుకుని, నా భర్త తిరిగి వస్తాడు అనే ధృఢ నమ్మకం, విశ్వాసంతో ఇంకా ఆయన కోసం ఎదురుచూస్తున్న అమాయక ముగ్ధవి. భర్త మొహం తెలీని నీవు, శీలం కాపాడు కుంటూ, గ్రామ జనాల చేత జేజేలు పలికించుకుంటున్న జేజెమ్మవి.

'అబ్బా.. అది సరే బిడ్డా! అసలు సంగతి చెప్పనీకి వస్తలేదా నీకు?'.

'అవ్వా!ఈ తాత కూడా నీలాంటి వాడే. ఒకే భార్య అని పరస్త్రీ మొహం చూడని పురుషోత్తముడు!'.

'ఆయన ఎవరు బిడ్డా! అది చెప్పు ముందు గల..'.

'ఆయన నీ పెనిమిటి, నీ మెళ్ళో తాళికట్టిన నాగయ్య తాత అవ్వా!'.

నా దేవుడా.. !.

'అవును సిద్దూ!'.

అతని మాటలకు నివ్వెరపోయిన అవ్వ పెదాలు కదిపింది.

'అవును, నన్నెవ్వరూ సిద్దూ అని పిలవరు. నువ్వు నిజంగా నా దేవుడివే. నీ కాల్మొక్కుతా' అంటూనే ఆమె అతని పాదాలపై తెగిన తీగలాగ వాలిపోయింది. స్పర్శ ఎరుగని ఆ వృద్ధ జంట కన్నీటి సంద్రంలో ఈదులాడుతోంది. అలా ఎంతోసేపు ఏడ్చింది. అంతే! హఠాత్తుగా వారి శ్వాస అనంత ఆకాశంలోకెగిసి ఆగిపోయింది.

కవిత

# ఉత్తేజమైన ఆలోచనలు

**గోపగాని రవీందర్**

ఆరంభం లేదు వాటికి
చలనమే శ్వాసగా జీవిస్తుంటాయి
గజిబిజిగా వెంటాడుతూ
ముప్పు తిప్పలు పెడుతుంటాయి
కుదురుగా కూర్చోనీయకుండా
శోధన చేయమని ఆజ్ఞాపిస్తుంటాయి
వినూత్న ఆవిష్కరణలకు
దారులు నిర్మిస్తుంటాయి..!

కొట్టివేతలు లేకుండా
లెక్కలు చేయనట్లుగానే
అక్షర దోషాలు రాకుండా
భావాన్ని రాయనట్లుగానే
సాధన చేయకుండా
ఏది సుసాధ్యం కానట్లుగానే
వికసించిన ముఖానికై
మదిని కవ్వంతో చిలికినట్లుగానే
సాగర ఘోషలోని
అలజడి నిలువనీయనట్లుగానే
రణస్థలంలో వీరుల రుధిరం
ఏరులై పారినట్లుగానే
మస్తిష్కం పొరల్లోని తలంపులు
ఊపిరి సలుపనివ్వనట్లుగానే
తనువంతా అల్లుకొని
అలలు అలలుగా విస్తరిస్తున్నాయి..!

సమాచారమంతా ఎక్కడో ఒకచోట
డేటాబేస్ సర్వర్లలో నిక్షిప్తం చేసినట్లుగా
నియంత్రితమైన గమనంలోని లోచనలు
గగనతలంలో విహరించే విహంగాలు
ఉత్తేజమైన ఆలోచనల అంతరంగాలు
జనసంద్రంలో ఎగిసిన చైతన్య కెరటాలు..!



కవిత



గజ్జెల రామకృష్ణ

# దిగులు వసంతం

వెలుగు రేఖపై పరుగెడుతున్న
రెండుకాళ్ళ యంత్రం సేదదీరు
రాత్రి చెట్టు నీడల రాలుతున్న ఏకాంతం

తెల్లారితే బొడ్డుపేగు
కత్తిరించిన పురిటిబిడ్డ ఏడుపు
బోరుబావిల పడ్డ పసిపాప దుఃఖం
పిల్లావు మూతికి బుట్టికట్టి
తల్లి పాలు పితుకు
వాకిలంత నిట్టూర్పు సెగడు
పగటి పెద్దపులి గాండ్రింపులకు
చీకటి చంకనెక్కిన జింకపిల్ల భయం

అదే పనిగా మోగుతున్న
సెల్లుఫోను రింగుటోను గాలానికి
చిక్కుపడ్డ మనసు మత్స్యావతారం

భారతం వింటున్నట్టు
ప్రపంచాన్ని చదువుతున్నట్టు
కవి మిత్రుడి కమ్మటి పలుకరింపు

జంటహత్యల మిస్టరీ వార్తలో ప్రకటనలా
ధారావాహిక సస్పెన్స్ నాటకంలో
అంతారాయంలా
వెన్నుపోటు దారు వెంటే ఉన్నట్టు

కరెంటు కోత
గాలిలో దీపంలా
ఊపిరి తీగపై పగబట్టిన ఎర్రగీత
సంభాషణ మూగవోయిన

పిడికెడు గొంతుల రక్తబాణం

చాప ముల్లు పొడుస్తున్నట్టు
రెప్పలు మూతపడని కళ్ళలో
గుండె దోసిలి నిండని దిగులు వసంతం.

కథ

# కొత్త కోడలు

**చట్టంతో మానవ సంబంధాన్ని**
**పరిహసించిన యువతి కథ...**



అంపశయ్య నవీన్

"మీ కొత్త కోడల్ని ఎప్పుడు తీసుకొస్తున్నారు సుశీలమ్మ గారు" అంటూ వచ్చింది వరలక్ష్మమ్మ సుశీలమ్మ ఇంటికి. "రండి... రండి... వరలక్ష్మమ్మ గారు... ఎక్కడికో వెళ్ళి వస్తున్నట్టు న్నారు...." అంది సుశీలమ్మ.

"ఈ కరోనా టైమ్‌లో ఎక్కడికీ వెళ్ళేట్టు లేదుకదమ్మా! ఇంట్లోనే ఖైదీలమైపోయాం కదా... హౌస్ అరెస్టంటే ఇదేనేమో..." అంది వరలక్ష్మమ్మ.

- 'ఔనౌను... ఎక్కడికీ వెళ్ళేట్టు లేదు. ఎవరింటికైనా కాస్సేపు కబుర్లు చెప్పుకుందామని వెళ్తే "కరోనా టైమ్ లో వీళ్ళెందుకొచ్చారన్నట్టు"గా చూస్తున్నారు... ఎన్నో జబ్బుల్ని చూశాం గానీ ఇలాంటి పాడు జబ్బునెప్పుడూ కనీవినీ యెరుగమమ్మా... ఎన్నోసార్లు నేనోసారి వరలక్ష్మమ్మ గారింటికి వెళ్ళొద్దామని అనుకున్నాను. కానీ మీరేమనుకుంటారో అనుకొని రాలేదు" అంది సుశీలమ్మ

"నేనేమీ అనుకోను లెండి! ఇరుగుపొరుగు అన్నాక ఒకర్నొకరం కలుసుకొని వ్యథ కథ చెప్పుకోకపోతే ఎలా? అని నేనూ ఎన్నోసార్లు అనుకున్నాను. ఈ పాపిష్టి జబ్బొచ్చి ఎవరమూ ఎవరికీ కాకుండా పోయాం" అంది వరలక్ష్మమ్మ.

ఇద్దరూ సుశీలమ్మ వాళ్ళ డ్రాయింగ్ రూంలో కూర్చొని మాట్లాడుకోసాగారు.

"మీ అవినాష్ పెళ్ళయి ఐదారు నెల్లయినట్టుంది కదూ! ఈ పాపిష్టి కరోనా రాకముందే మీవాడి పెళ్ళి అయిపోవటం మీ అదృష్టమమ్మా! ఈ రోజుల్లో అయితే మీవాడి పెళ్ళిని అంత గ్రాండ్‌గా చేసేవారు కాదనుకుంటాను..." అంది వరలక్ష్మమ్మ.

"మీరన్నది నిజమే వరలక్ష్మమ్మ గారూ! మా బంధువర్గం చాలా పెద్దదే! బంధువర్గంతో పాటు మావాడి ఫ్రెండ్స్... మా ఆయన ఫ్రెండ్స్... అందరూ వచ్చారు. వెయ్యిమంది దాకా భోజనాలు చేశారు. ఈ రోజుల్లో అయితే ఓ వందమంది కూడా వచ్చేవాళ్ళు కాదు..." అంది సుశీలమ్మ.

"నిజమే లెండి! పెళ్ళయి నాల్గు నెలలయినా మీ కోడల్ని తీసుకు రాలేదేమిటి?" అంది వరలక్ష్మమ్మ.

"మా కోడలు బి.టెక్. చదువుతోంది కదా... ఫైనలియర్ పరీక్షలయ్యేదాకా రాదని పెళ్ళికి ముందే చెప్పారులెండి... ఈ పాడు కరోనా చెయ్యబట్టి ఎప్పుడో జరగాల్సిన ఆ పరీక్షలు వాయిదా పడ్డాయట... అయితే మొన్ననే ఆ పరీక్షలు ఆన్‌లైన్‌లోనే జరిగాయట... అదేం చిత్రమో... ఇంట్లో కూర్చొనే కంప్యూటర్ ముందు పెట్టుకొని పరీక్షలు రాసెయ్యొచ్చుట..." అంది సుశీలమ్మ.

"ఔనమ్మా... ఇప్పటోళ్ళంతా కంప్యూటర్లు... ల్యాప్ టాప్‌లు... స్మార్ట్ ఫోన్లు.... స్మార్ట్ టీవీలతోటే కాలం గడుపుతున్నారు... కాస్సేపయినా మనతో మామూలుగా మాట్లాడుతున్నారా? వాళ్ళదో లోకం... మనదో లోకం... మా అమ్మాయి కూడా ఈ సంవత్సరమే బి.టెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తిచేసి జాబ్ లో జాయినయింది. ఎప్పుడూ దానికి కంప్యూటర్‌తో పని... ఓ మాటాలేదు... ముచ్చటా లేదు..." అంది వరలక్ష్మమ్మ.

'ఇప్పటోళ్ళు ముప్పయేళ్ళొచ్చినా పెళ్ళి చేసుకోవటం లేదు. మా పెద్దమ్మాయి హైద్రాబాదులో చదువుతోంది. 28 యేళ్ళొచ్చాయి. పెళ్ళెప్పుడు చేసుకుంటావే అంటే గయ్యిమని లేస్తోంది... అప్పుడే పెళ్ళేంటని... పెళ్ళన్నా, పిల్లలన్నా వీళ్ళు మహా చిరాకు పడిపోతున్నారు...." అంది సుశీలమ్మ.

వాళ్ళిద్దరూ ఇలా మాస్కులు పెట్టుకునే చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు.

"అయితే తొందర్లోనే మీ కోడల్ని తీసుకొస్తారన్నమాట...!" అంది వరలక్ష్మమ్మ.

"యేమోనమ్మా... మనం వాళ్ళకేమన్నా చెప్పేటట్టుందా? మావాడు గచ్చిబౌలీలో యేదో పెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు కదా! రోజూ ఇద్దరూ ఫోన్లో మాట్లాడుకుంటున్నారు... మావాడు మొన్ననే వాళ్ళ నాన్నగార్ని 'మంచి రోజులెప్పుడు?' అని అడిగాడు. 'ఎందుకురా?' అంటే 'నందినిని తీసుకొద్దామనుకుంటున్నాను' అన్నాడు.

'పరీక్షలయిపోయాయా?' అని వాళ్ళ

నాన్న అడిగితే 'పదిరోజుల క్రితమే అయిపోయాయ'న్నాడు మా అవినాష్ గాడు. మా ఆయన అయ్యగార్ని అడిగితే ఈనెల పదో తేదీ మంచిది అని చెప్పాడట... బహుశాః అప్పుడు తీసికొచ్చుకుంటాడేమో..."

"పదో తారీకంటె ఇంకో వారం రోజులున్నట్టుంది. కోడలొస్తే మీ పనిభారం చాలా తగ్గుతుందిలే..." అంది వరలక్ష్మమ్మ.

"యేం తగ్గుతుందో యేమో... ఈరోజుల్లో కోడళ్ళు పనిచేస్తారా? మనతోటే పని చేయిస్తారు" అంది సుశీల.

"అదీ నిజమే లెండి! ఇది కోడళ్ళ రాజ్యం కదా!" అంటూ వరలక్ష్మమ్మ వెళ్ళటానికని లేచింది. "మా ఆయన ఆఫీసు నుండి వచ్చే టైమయింది... వెళ్ళొస్తానమ్మ... కరోనా కాస్త తగ్గిందంటున్నారు కదా... మీరూ అప్పుడప్పుడు మా ఇంటికి వస్తుండండి... ఇలాగే కాస్సేపు కబుర్లు చెప్పుకుందాం" అంటూ "వెళ్ళొస్తా" అని చెప్పి వరలక్ష్మమ్మ వెళ్ళిపోయింది.

అనుకున్నట్టుగానే సుశీలమ్మ కొడుకు అవినాష్ మంచిరోజు చూసుకొని భార్యను తీసుకొని వచ్చాడు. నందిని తల్లిదండ్రులు కూడా హైదరాబాద్ లోనే ఉంటారు.



**వాళ్ళింట్లో అంట్లు తోమటం, ఇల్లు ఊడ్చటం లాంటి మామూలు పనులు చెయ్యటానికో పనిమనిషుంటే, వాళ్ళింట్లోని టాయిలెట్స్ క్లీన్ చేసిపోవటానికి వారంలో రెండు రోజులకొకసారొచ్చే వేరే పనిమనిషి కూడా ఉండేవాడు. మామూలు పనిమనిషి రావటం ఆగిపోయాక టాయిలెట్స్ క్లీన్ చెయ్యటానికొచ్చే టాయిలెట్ క్లీనర్ కూడా వారం రోజులు రావటం నాకు వీలుకాదని, తన కూతుర్ని హాస్పిటల్ లో కరోనా కారణంగా జాయిన్ చేశారని చెప్పాడు.**

రోజూ ఉదయం తొమ్మిదింటికల్లా సుశీలమ్మ భర్త, కొడుకు వాళ్ళు పనిచేస్తున్న ఆఫీసులకు వెళ్ళిపోతుండే వాళ్ళు. వాళ్ళ కూతురేమో ఇంట్లోనే ఉండి కంప్యూటర్ ద్వారా పనిచేసుకునేది.

ఇంట్లో సుశీల, నందిని, సువర్ణ - ముగ్గురే ఉంటుండేవాళ్ళు. పనిమనిషి వచ్చి అంట్లు తోమటం, ఇల్లు ఊడ్వటం, బట్టలుతకటం లాంటి పనులు చేసి వెళ్ళిపోతుండేది.

వాళ్ళ కోడలు నందిని రోజూ తొమ్మిదింటి దాకా పక్కమీది నుండి లేచేదే కాదు. కూతురు సువర్ణ ఎనిమిదింటి కల్లా లేచి కంప్యూటర్ ముందు కూర్చునేది. కోడల్ని తను వెళ్ళి లేపుదామంటే సుశీలకు భయమేసేది. బాగా గారాబంగా పెరిగిన పిల్ల... "అత్తారింటికొచ్చి అక్కడి వాతావరణానికి అలవాటు పడటానికి కొంచెం ఆలస్యం అవుతుందిలే" అనుకుంది.

కొడుకుకు భర్తకు, కూతురికి టిఫిన్లు, కాఫీలు అందించి, భర్తకు కొడుక్కేమో లంచ్ బాక్సులు ప్రిపేర్ చేసివ్వటానికి కోడలేమన్నా సహాయం చేస్తుందేమోనని సుశీల ఆశపడింది. వచ్చి రెండు వారాలైనా అలాంటిదేమీ జరగలేదు.

కథ

ఒకరోజు భర్తతో "కోడలమ్మ రోజూ తొమ్మిదింటి దాకా లేవడం లేదు. చిన్నచిన్న పనిలేమన్నా చేస్తుందేమో ననుకుంటే యేమీ చెయ్యటం లేదు" అంది సుశీల.

"నువ్వు పని చెబితేకదా ఆమె చేసేది... నువ్వేమీ చెప్పకుంటే ఆమె యేం చేస్తుంది..." అన్నాడామె భర్త పరమేశ్వరరావు.

"అదసలు పక్కమీంచి లేవందే యేం చెప్పను?" అంది సుశీల.

"లేవకపోతే లేపాలి. కోడలన్నప్పుడు తన బాధ్యతను తెలుసుకోకపోతే ఎలా? కోడలంటే ఎందుకంత భయపడ్తున్నావు..." అన్నాడామె భర్త.

"భయపడటం లేదండి... గారాబాల పిల్ల కదా... యేమంటే యేం తప్పోనని ఆలోచిస్తున్నా..." "ఇలాగే ఆలోచిస్తూ కూర్చోకు.... రోజూ కనీసం యేడింటికల్లా లేవాలని చెప్పు... ప్రతిరోజూ మార్నింగ్ మీ ఆయన్ను, మా ఆయన్ను వాళ్ళ ఆఫీసులకు పంపించటానికి నాకు చాలా కష్టమౌతున్నదని చెప్పు" అంటూ పరమేశ్వరరావు ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ఆ మర్నాటి నుండి సుశీల నందినిని యేడింటికే లేపడం మొదలెట్టింది. చిన్నచిన్న పనులు చెయ్యమని చాలా మొహమాట పడుతూనే చెప్పసాగింది. కూరగాయలు కోసి పెట్టమనో, బాక్సులు రెడీ చెయ్యమనో, ఆమె భర్త స్నానం చేసి వచ్చాక అతనికి కావలసినవి అందించమనో చెబుతుండేది. అప్పుడప్పుడు పనిమనిషి రానప్పుడు "ఇద్దరం కలిసి అంట్లు తోముకుందామని, బట్టలు పిండుకుందామ"ని చెప్పేది. "ఇల్లు ఊడ్చేపని కూడా నువ్వే చెయ్యి"లని చెప్పేది. ఇలా అత్తగారు పని చెప్పినప్పుడల్లా నందినికి చిరాకు వేసేది. ఇలాంటి పనుల్ని తన తల్లిగారింట్లో ఎన్నడూ చెయ్యలేదు. వాళ్ళమ్మ ఆమెతో ఎన్నడూ ఇలాంటి పనులు చేయించలేదు. "అత్త అయినంత మాత్రాన ఈమె తనతో ఇలాంటి చెత్తపనుల్ని చేయించటం యేమిటి?" అనుకునేది నందిని.

బి.టెక్. రిజల్ట్సు రాగానే తను యేదన్నా ఉద్యోగం చూసుకొని తన భర్త, మామలాగే ఆఫీసులకు వెళ్ళిపోవాలి. సాయంత్రం దాకా మళ్ళీ ఈ ఇంటి మొఖం చూడొద్దు" అనుకునేది. ఆడబిడ్డ సువర్ణ కూడా ఇంట్లో ఉండే ఉద్యోగం చేస్తున్నది. ఆమె కంప్యూటర్ రూం విడిచి బయటికి రాదు. అత్తగారు ఆమెకేమీ పని చెప్పదు. వంట పనంతా సుశీలే చేసేది. కూరగాయల్ని శుభ్రం చేసి కోసిచ్చే పని మాత్రం నందిని చేసేది. పనిమనిషి రానిరోజు అతికష్టంగా ఇల్లు ఊడ్చినట్టు చేసేది. కొంచెం తీరిక దొరకగానే తన బెడ్ రూంలోకెళ్ళి యేదన్నా టీ.వీ. సీరియలో, సినిమానో పెట్టుకొని గానీ, లేదా యేదన్నా పుస్తకమో, ఆరోజొచ్చిన పేపరో చదువుతూ పడుకునేది. సువర్ణ, నందిని ఎప్పుడూ మాట్లాడుకునే వాళ్ళు కారు. తన కూతురి పెళ్ళని చెప్పి పనిమనిషి వారం రోజులదాకా రానని చెప్పింది. అసలు కరోనా వచ్చినప్పట్నించి వాళ్ళ పనిమనిషి ఇదివరకటిలా రావడమే లేదు. బస్సులు బందయినప్పుడైతే అస్సలు రాకపోయేది. యే పుట్టలో యే పాముందో అన్నట్టు ఎవర్ని ముట్టుకుంటే ఈ కరోనా మనకొస్తుందేమోనని అందరూ ఇంట్లోంచి బయటకు రావటం పూర్తిగా మానేశారు. "ఈ పాడు జబ్బేమన్నా తగ్గినట్టనిపిస్తే వస్తా... అప్పటిదాకా రాను" అని చెప్పేది వాళ్ళ పనిమనిషి. ఈ మధ్యనే కరోనా కాస్త తగ్గటం, బస్సులు మళ్ళీ తిరగటం వల్ల పనిమనిషి వస్తోంది.

వాళ్ళ పనిమనిషి కూతురి పెళ్ళని చెప్పినప్పట్నించి నందిని మీద పనిభారం ఎక్కువైంది. అంట్లు తోమటం, బట్టలుతకటం, ఇల్లంతా ఊడ్వటం... ఇవన్నీ నందినిని చెయ్యమని వాళ్ళ అత్తగారు చెబుతుండేది. అత్తగారు పని చెప్పినప్పుడల్లా నందినికి భలే కోపమొచ్చేది. "నాకేమో ఇన్ని పనులు చెప్పడానికి ఈమెకి అధికారం ఎవరిచ్చారు. అత్తయినంత మాత్రాన ఈమె అనుక్షణం నామీద పెత్తనం చెయ్యటమేనా? ఆమె కూతురికి ఏపనీ చెప్పదెందుకని? ఆమెక్కూడా యేదన్నా పని చెప్పొచ్చుకదా!" అనుకునేది. .

ఒకరోజు భర్తతో "ఈ పనులన్నీ చెయ్యటం నాకు రాదండి... నన్ను మా పుట్టింట్లో దింపిరండి... నేను మీ అమ్మగారితో వేగలేను..." అంది నందిని.

"పనులన్నీ రావంటే ఎలా? ఎలా చెయ్యాలో అమ్మ చెబుతుంది. నేర్చుకోవాలి... పరిస్థితులను బట్టి మనం మారాలి... అడ్జస్ట్ మెంట్ అంటారు. పరిస్థితులకు అనుగుణంగా మనం మారాలి. ఆమెతో వేగలేనని, పుట్టింటికి పోతానంటావా? బుద్ధుండే మాట్లాడుతున్నావా? పెళ్ళయ్యాక అత్తగారిల్లే సర్వస్వం అనుకోవాలి. అత్తన్నప్పుడు యేదో ఒకపని చెబుతుంది. తను కూడా చాలా పనులు చేసూనే ఉంది కదా! పనుల్ని ఇద్దరూ షేర్ చేసుకోవాలి. నథింగ్ రాంగ్ యిన్ ఇట్... మన పని మనం చేసుకోవటంలో ఎలాంటి తప్పులేదు. ఎప్పుడూ పనిమనుషుల మీదనే ఆధారపడితే ఎలా? ఇండియా కాబట్టి పనిమనిషులు దొరుకుతారు... అదే అమెరికా లాంటి దేశంలో అయితే పనిమనుషులే దొరకరు... పనులన్నీ మనమే చేసుకోవాలి..." అన్నాడామె భర్త.

"తెలుసు" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పిందామె.

**"మా కోడలు బి.టెక్. చదువుతోంది కదా... ఫైనలియర్ పరీక్షలయ్యేదాకా రాదని పెళ్ళికి ముందే చెప్పారులెండి... ఈ పాడు కరోనా చెయ్యబట్టి ఎప్పుడో జరగాల్సిన ఆ పరీక్షలు వాయిదా పడ్డాయట... అయితే మొన్ననే ఆ పరీక్షలు ఆన్‌లైన్‌లోనే జరిగాయట... అదేం చిత్రమో... ఇంట్లో కూర్చొనే కంప్యూటర్ ముందు పెట్టుకొని పరీక్షలు రాసెయ్యొచ్చట..." అంది సుశీలమ్మ.**

కథ

వాళ్ళింట్లో అంట్లు తోమటం, ఇల్లు ఊడ్చటం లాంటి మామూలు పనులు చెయ్యటానికో పనిమనిషుంటే, వాళ్ళింట్లోని టాయిలెట్స్ క్లీన్ చేసిపోవటానికి వారంలో రెండు రోజులకొకసారొచ్చే వేరే పనిమనిషి కూడా ఉండేవాడు. మామూలు పనిమనిషి రావటం ఆగిపోయాక టాయిలెట్స్ క్లీన్ చెయ్యటానికొచ్చే టాయిలెట్ క్లీనర్ కూడా వారం రోజులు రావటం నాకు వీలుకాదని, తన కూతుర్ని హాస్పిటల్ లో కరోనా కారణంగా జాయిన్ చేశారని చెప్పాడు.

“మన టాయిలెట్స్ మనమే క్లీన్ చేసుకోవలసిన గడ్డు పరిస్థితొచ్చింది...” అంది సుశీల నందినితో. “ఈ వారం రోజులకు వేరే క్లీనర్‌ని చూడండి” అంది నందిని.

“ఈ కరోనా రోజుల్లో కేవలం వారం రోజులకోసం వేరే క్లీనర్ మాత్రం ఇప్పటికిప్పుడు ఎవరు దొరుకుతారు? మనమే ఎలాగో ఆ పనికూడా చేసుకోవాలి” అంది సుశీల.

ఆరోజు నందిని భర్తతో “మీ అమ్మ నన్ను టాయిలెట్స్ ని కూడా క్లీన్ చెయ్యమంటోంది... చూశారా?” అంది. “చెప్పానుగా... మనపని మనం చేసుకోవటంలో తప్పేముంది...”

“మీరిలాంటి నీతులు నాకు చెప్పకండి... వేరే ఎవరినైనా చూడండి” అంది నందిని. “ఇంత అకస్మాత్తుగా వేరే క్లీనర్ ఎవరూ దొరకరు నందినీ!” అన్నాడామె భర్త. “అయితే మీ అమ్మనే ఆ క్లీన్ చేసే పని చేసుకొమ్మనండి... నేను మాత్రం ఆ పని చెయ్యలేను” అంది నందిని.

“మా అమ్మకు డెబ్భైయేళ్ళొచ్చాయి... అతికష్టంగా కొన్ని పనులు చెయ్యగల్గుతోంది... ఆమె టాయిలెట్స్ క్లీన్ చేసే పని చెయ్యలేదు. ఆమె అసలు సరిగ్గా నడవలేకపోతోంది... బాత్ రూంలో జారిపడిందంటే ఆమె పని క్లోజ్! వృద్ధాప్యంలో కాలో, చెయ్యో, తొంటో ఫ్రాక్చరయ్యిందంటే వాళ్ళిక కోలుకోరు...



**“పనులన్నీ రావంటే ఎలా? ఎలా చెయ్యాలో అమ్మ చెబుతుంది. నేర్చుకోవాలి... పరిస్థితులను బట్టి మనం మారాలి... అడ్జెస్ట్ మెంట్ అంటారు. పరిస్థితులకు అనుగుణంగా మనం మారాలి. ఆమెతో వేగలేనని, పుట్టింటికి పోతానంటావా? బుద్ధుండే మాట్లాడుతున్నావా? పెళ్ళయ్యాక అత్తగారిల్లే సర్వస్వం అనుకోవాలి. అత్తన్నప్పుడు యేదో ఒకపని చెబుతుంది. తను కూడా చాలా పనులు చేసూనే ఉందికదా!**

కొద్దిరోజులు ఎలాగో నువ్వే ఆ పని చెయ్యక తప్పదు నందినీ... అర్థం చేసుకో” అన్నాడామె భర్త.

“నన్ను... నన్ను... టాయిలెట్స్ క్లీన్ చెయ్యమంటారా? నేనెవరనుకొని మాట్లాడుతున్నారు మీరు? మీ కంటికి, మీ అమ్మ కంటికి నేనింత చులకనై పోయానా?” అంటూనే ఆమె విసురుగా వాళ్ళ బెడ్ రూంలో కెళ్ళిపోయింది. ఆరోజంతా ఆమె ఆ రూంలోంచి బయటకు రాలేదు. రెండుపూటలా భోజనానికి రాలేదు. అత్త వెళ్ళి “భోజనం చేద్దువు రమ్మ”ని బతిమాలింది. అయినా ఆమె “నాకాకలిగా లేదు” అని మొండికేసింది.

ఆ రాత్రంతా ఆమె భర్తతో యేమీ మాట్లాడలేదు. అతడు కూడా ఆమెను పలకరించకుండానే పడుకొని నిద్ర పోయాడు. తనను వాళ్ళు టాయిలెట్స్‌ను క్లీన్ చెయ్యమని చెప్పిన మాట ఆమె బుర్రలో అనుక్షణం గిర్రున తిరగసాగింది.

ఆమె రెండ్రోజుల వరకు తన రూంలోంచి బయటకు రాలేదు. వాళ్ళ నాన్నగార్కి, అమ్మగార్కి, క్లోజ్ ఫ్రెండుకు ఫోన్లు చేసుకుంది. మూడోరోజు ఉదయం సూట్ కేసు సర్దుకొని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్ళిపోయింది. అత్తగారు “ఇలా అకస్మాత్తుగా వెళ్ళొద్దు... నువ్వేమీ టాయిలెట్స్ క్లీన్ చెయ్యొద్దులే... నేనే చేస్తాలే... ఈ లోపల క్లీన్ చేసేవాడెవరన్నా దొరక్కపోడు... పెళ్ళయిన ఆర్నెల్లకే కోడలు ఇలా వెళ్ళిపోతే ఎంత అప్రతిష్ట... లోకం యేమనుకుంటుంది... నువ్వు వెళ్ళొద్దు నందినీ” అని కాళ్ళావేళ్ళా బతిమాలి ఆమెను ఆపడానికి ప్రయత్నించింది. కానీ ఆమె ఆగలేదు. ఇప్పుడు టాయిలెట్స్ క్లీన్ చెయ్యమన్నారు... రేపు ఇంకేం చెబుతారో, ఇంకెంత హీనంగా చూస్తారో” అనుకుందామె.

ఆమె వెళ్ళిపోయిన నెల రోజుల తర్వాత పోలీసు స్టేషన్ నుండి ఆమె భర్తకో ఫోనొచ్చింది.

“మీ ఆవిడ మీమీద గృహహింస కేసు పెట్టింది... నువ్వూ, మీ అమ్మా, మీ నాన్నా, మీ చెల్లెలు... అందరూ ఈ రోజు సాయంత్రం 4 గంటలకు పోలీసు స్టేషన్‌కు రావలసి ఉంటుంది” అన్నాడు ఆ ఫోన్ చేసిన సర్కిల్ ఇన్ స్పెక్టర్.

అతడు స్తంభించిపోయాడు. నందినిని తను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఇంతపని చేస్తుందా?

రెండేళ్ళదాకా ఆ కేసు నత్తనడక నడుస్తూ సాగుతూనే ఉంది. చివరకు ఆమెకో 10 లక్షల అలిమనీ ఇచ్చి పరస్పర అంగీకారంతో వాళ్ళు విడాకులు తీసుకోవటానికి నిర్ణయమైంది.



## 2015 జ్ఞాన్ పీఠ్ అవార్డు గ్రహీత

# డా॥ రఘువీర్ చౌదరి



ప్రముఖ గుజరాతీ రచయిత, విమర్శకులు డా॥ రఘువీర్ చౌదరి 51వ జ్ఞాన్ పీఠ్ అవార్డుకు ఎంపికయ్యారు. 1938 లో గుజరాత్‌లో జన్మించిన రఘువీర్ రచయిత 80కి పైగా పుస్తకాలు రచించారు. గుజరాతీ భాషలో ఎక్కువ రచనలు చేసిన రఘువీర్ చౌదరి, హిందీ భాషలోనూ కొన్ని పుస్తకాలు రచించారు. 1965లో భాషా అస్తిత్వం పై ఈయన రచించిన అమ్రిత నవల అందరి మన్ననలు పొందింది. రుద్రమహాలయ, సొంతిర్థ్ నవలలు చాలా ప్రాముఖ్యతను పొందాయి. ఈయన రచించిన త్రయ పుస్తకాలు ఉపార్వాస్, సహవాస్, అంతర్వస్ కి 1977లో సాహిత్య పురస్కారాన్ని తెచ్చిపెట్టాయి. రఘువీర్ చౌదరి నవలలతో పాటు, నాటకాలు సైతం రచించారు. ప్రఖ్యాత గుజరాత్ రచయిత చంద్రవదన్ మెహతా జీవిత ఆధారంగా రచించిన త్రిజో పురుష్ అందరి మన్ననలు పొందింది. సికిందర్ సాని, డిమ్ లైట్ నాటకం ప్రాముఖ్యాన్ని పొందాయి.

## నోబెల్ సాహితీ పురస్కారం 2017

# కజువో ఇషిగురో



బ్రిటన్ నవలా రచయిత కజువో ఇషిగురో 2017 నోబెల్ సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. కజువో ఎనిమిది పుస్తకాలు రాశారు. వాటిని 40కి పైగా భాషల్లోకి అనువదించారు. 'ద రిమైన్స్ ఆఫ్ ద డే', 'నెవర్ లెట్ మి గో' నవలలు ఆయన రచనల్లో విఖ్యాతమైనవి. ఈ రెండు నవలలు ఆధారంగా తీసిన సినిమాలకు కూడా విశేష ప్రశంసలు లభించాయి. కజువో ఇషిగురో 1954లో జపాన్‌లోని నాగసాకిలో జన్మించారు. ఆయన తండ్రికి సర్రేలో ఓషనోగ్రాఫర్ ఉద్యోగం లభించినపుడు కుటుంబంతో పాటు ఆయన కూడా ఇంగ్లండ్ వలస వెళ్లారు. కజువో రచనలు జ్ఞాపకం, కాలం, స్వీయ-భ్రమ అంశాల మీద ఉంటాయి. 'ఏ పేల్ వ్యూ ఆఫ్ హిల్స్' అనే ఆయన సిద్ధాంత గ్రంథం (థీసిస్) 1982లో ప్రచురితమైంది. అది ఆయన తొలి నవలగా విమర్శకుల ప్రశంసలు పొందింది.



కవిత

# నాన్న జ్ఞాపకం

**"పిల్లలరూపంలో తల్లిదండ్రులు బతికే ఉంటారు" -సిద్ధార్థుడు**

ఈ మధ్య అప్పుడప్పుడు
నాలోకి నాన్న వచ్చి వెళ్తున్నాడు

చెప్పకుండా వెళ్లిపోయిన నాన్న
ఇన్నాళ్లకు ఎటువైపు నుండో వచ్చి
నన్ను ఆవహిస్తున్నాడు

తాను వదిలి వెళ్లిన కుటుంబాన్ని
నాన్న జ్ఞాపకాలతో బతుకుతున్న అమ్మను
చిన్న మొక్కల్లా తన చేతుల్లో మెదిలి
ఇవాళ నలుగురికి నీడనిస్తూ

వృక్షాల్లా ఎదిగిన తమ్ముళ్లను
తనలాగే నవ్వుతున్న
మనువండ్లను, మనవరాళ్లను
నా కళ్లతో చూసి పులకించిపోతున్నాడు
ఆనందబాష్పాల వానలో తడిసిపోతున్నాడు

నాన్న నాలోకి వచ్చినప్పుడు
నేను ఉన్నట్టుండి
అరవైయేండ్ల వాడినైపోతున్నాను
అప్పుడు నా తనువు, మనసు
నాన్నతో నిండిపోతాయి
జీవితాంతం

**పసునూరి రవీందర్**

నీడలా వెంటాడిన షుగరు నీరసం
తరం నుండి తరానికి ఆస్తిలా వచ్చిన
ఆకలి బాధ నన్ను ఒక్కసారిగా
చుట్టుముడుతాయి
కన్నీళ్ల గేట్లు తెరిచిన ప్రాజెక్టులవుతాయి
ఔను...

రోజూ చావుతో కొట్లాడిన వీరుడు కదా
నాన్న
బుక్కెడు మెతుకుల కోసం
ఎన్ని కన్నీటి సముద్రాలను ఈదిండో...
రిక్షా తొక్కి కాళ్లు, బస్తాలు మోసి ఒళ్లు
నాన్నకంటే ముందే చచ్చుబడిపోయాయి
కంటినిండా నిద్రా
కడుపునిండా తిండి మాటల్లోనే తప్ప
ఏనాడు పొందనివాడు
తనను తాను మరిచి ఎన్ని యుగాలైందో
కష్టాల దండయాత్రల నుండి
తనను కాపాడుకోలేక కాటిపాలయ్యాడు
అయినా నాన్న ఓడిపోలేదు
మమ్మల్ని గెలిపిస్తూనే ఉన్నాడు

కలవరింతల బతుకోడు నాన్న
ఏ కలలు కన్నాడో
ఎన్ని జాగారాలున్నాడో
ఎంత గింజుకున్నాడో
ఎంత లోలోపలే తన్నుకున్నాడో
ఏనాడు ఏ నొప్పిని చెప్పకుండా
మానని మనసు గాయాలను చూపకుండా
బాధలన్నీ లోలోపలే మోసినోడు నాన్న
నాన్న అంతే... నిండుకుండా!

నాన్న లేని శూన్యం
దీపం లేని చీకటిల్లులా
తరాల దు:ఖాన్ని వలపోస్తున్నది

కంటిరెప్పల కింద
కన్నీళ్ల సుడులు తిరుగుతున్నట్టు
రోజూ నాలోనే కలె తిరుగుతున్నాడు నాన్న

ఎన్ని అడగాలని ఉందో నాన్నను
ఎన్ని చెప్పాలని ఉందో నాన్నకు

పెరుగన్నంలో ప్రేమను కలిపి
తినిపించిన నాన్నకు
నా చేత ఒక్క ముద్దైనా
తినిపించాలని ఉంది

చిన్ననాడు నాకు చేపించినట్టే
నాన్నకు స్నానం చేపించాలని
నాకు తన బతుకును కథగా చెప్పినట్టే
నా విజయగాథ నాన్నకు చూపెట్టాలిని
నాన్న ముఖంలో కోటికాంతుల
వెలుగు చూడాలని ఎన్నెన్ని అనుకున్నానో...
మరి ఇప్పుడు నాన్న ఏడి?!
అంతే... తీరని రుణం నాన్న

నాన్న నువ్వు ఉంటే...
నువ్వే ఇచ్చిన గజం ఆత్మగౌరవ వస్త్రాన్ని
ఎట్లా జెండా చేసి ఎగరేస్తున్నానో
చూపించేవాడిని నువు నేర్పిన
విలువల పడవతో
బతుకువరదను
ఎట్లా ఎదురీది గెలుస్తున్నానో చూపేవాణ్ణి
పదిమందిలో నీ కొడుకుగా
ఎట్లా తలెత్తుకు బతుకుతున్నానో
నీ గుండె ఉప్పొంగేటట్టు చేసేవాడిని
ఏవీ చూడకుండానే ఎందుకు నాన్న
ఇట్లా జీవితపు ఇంటర్ వెల్‌లోనే వెళ్లిపోయావు

ఈ దు:ఖం తీరదు

ఈ కథ సుఖాంతం కాదు
నాన్న రాడని తెలిసినా
నాలోకి నాన్న వచ్చే ఘడియ కోసం
దిక్కులన్నీ గాలిస్తున్నాను
ప్లీజ్ నాన్న...
ఈ సారి వస్తే మాత్రం నాలోనే ఉండిపో నాన్న !!



# వచన కవిత్వం వస్తు శిల్పాలు

**నేటి యువతరానికి ప్రోత్సాహంగా...**
**సీనియర్ కవులకు పునశ్చరణగా...**

జాతి సాంస్కృతికాంశాలలో ఆదాన ప్రదానాలుంటాయి. లేకుంటే జాతికి జీవలక్షణం కొరవడి నిర్వీర్యమౌతుంది. అదే సమయంలో ప్రతి జాతికి కొన్ని మౌలిక లక్షణాలు కూడా ఉంటవి. వాటిని కాపాడుకుంటూనే ఆదాన ప్రదానాలపట్ల సౌజన్యం కల జాతి మనగలుగుతుంది.

సాంస్కృతిక అంశాలలో భాష, కవిత్వం చాలా ప్రధానమైనవి. ఈ రెంటికీ ప్రధాన ధర్మం ప్రవాహ గుణమే. ఈ రోజు ప్రపంచభాషగా పరిణమిస్తున్న ఆంగ్లాన్ని తీసుకుందాం. ఈ భాష చాలా చేరికలను ఆమోదించింది .

ప్రాచీనకాలంలో ఆంగ్లేయులు మూడు ద్వీపాల నివాసులు. వారిది celtic భాష. రోమన్ ఆక్రమణ జరిగేవరకు అంటే 55 బి.సి. నుండి లాటిన్ ప్రభావం మొదలైంది. తరువాత ఉత్తర జర్మనీ నుండి దాడి చేసిన Angles, Saxons, Jutes, Tribes భాష నిజమైన ఇంగ్లీషు భాషగా చలామణి అయింది. 15వ శతాబ్ది నుండే ఆంగ్ల భాష Mid Land Dialectగా పిలువబడింది. Metropolis భాషగా నిలువగలిగినది.

భాషలో ఇలాంటి ఆదాన ప్రదానాలున్నట్టే కవిత్వంలోనూ ఉంటాయి. ఒకప్పుడు కవిత్వానికి సంస్కృతం ఉత్ప్రేరకం అయినట్టే ఇప్పుడు ఇంగ్లీషు ఉత్ప్రేరకం అయింది. వచన కవిత్వం దగ్గరికి వచ్చేసరికి వస్తువు పూర్తిగా సామాజికం అయింది.

ఈ నాటి ప్రధాన కవితా మాధ్యమం వచనం, సరే... దాని పరిణామమేమిటి? ఏ సమాజం అనివార్యంగా వచన కవిత్వాన్ని సృష్టించుకొంది? అది సంతరించుకొన్న లక్షణాలు ఏమిటి? వచన కవిత్వంలో ఈ భాషా వినిమయం ఎట్లా ఉండాలి? ఇలాంటి అంశాలన్నీ చర్చించింది ఈ పొత్తం.

వచన కవిత్వం ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు, అనే మూడు దశలని కవులు ఎట్లా నిర్వహించాలో తెలిపింది. లక్ష్మణ చక్రవర్తి, బెల్లి యాదయ్య, యాకుబ్, పెన్నా శివరామకృష్ణ, లాంటి తొమ్మండుగురు కవి విమర్శకుల వ్యాసాలూ ఇందులో ఉన్నాయి.

ఆధునిక కవులు ఈ నిర్వహణ ఎట్లా చేస్తున్నారో వివరించింది. Robert Frost, “It is like playing Tennis without net” అంటాడు. అంటే లాక్షణిక నిర్మాణ సూత్రాలు లేకుండా కొనసాగే వచనకవిత్వ రచన యొక్క క్లిష్టత ఇక్కడ వ్యక్తమైంది.

ముందే నిర్ణయించిన లక్షణాలతో మన భావాన్ని నింపలేం, వస్తువును బట్టి తనకు తానే రూపం ఏర్పరచుకోవాలె. ఈ క్రమంలో కవి ఉద్వేగంతో వస్తువు దానితో పాటు రూపం ఉత్పత్తి చేస్తాడు. ఇక్కడే కవి అభ్యాసం, వ్యుత్పత్తి బాగా పనికి వస్తాయి. సరైన అభ్యాసం లేని వ్యక్తి చోదకం బాల కవిత్వ పరిధికి పరిమితమౌతుంది. అట్లా కాక కవి నిరంతర సాధన నేపథ్యంగా ఉంటే నిర్మాణం అప్రయత్నంగా గాఢత సంతరించుకుంటుంది.

ఈ విషయాలన్నిటినీ గురించి ఈ వచన కవిత్వం వస్తుశిల్పాలు పుస్తకంలో కూలంకషమైన చర్చ జరిగింది. దాదాపు ఈ విమర్శకులందరూ వచన కవిత్వం మీద ఉన్న ఆంగ్లప్రభావాన్ని చర్చించారు.

వస్తువు ఎంపికలో ముఖ్యమైన విషయం దృక్పథం అన్నారు సుంకిరెడ్డి, గుంటూరు లక్ష్మినర్సయ్య కూడా కవి వ్యక్తం చేసే విషయం పట్ల కవికున్న దృక్పథం ఈ విషయం సాధారణ కవిత్వ స్థాయి నుండి ఉత్తమ కవిత్వ స్థాయికి చేరుకోవడంలో కీలక పాత్ర వహిస్తుందని దృక్పథం ప్రాధాన్యత తెలియజేస్తారు.

కే. శివారెడ్డి కవిత్వాన్ని నిర్వచిస్తూ దర్భశయనం, కవిత్వంపై ఆ కవి ముద్ర, అతని అనుభవ సారం, అతని పైన ఒక విశ్వాస ప్రకటన ఎట్లా ఉంటుందో తెలియజేస్తారు. వస్తువును బట్టే కవితా చట్రం అని నిర్ధారించుకున్నాక, వస్తువు కుండే పరిధి ఎంత? ఏమిటి? అన్నది పరిశీలనాంశం అని తన విశ్లేషణ కొనసాగించారు. కాంచనపల్లి గోరా కవి వస్తువును ఎన్నుకోవడానికి, ప్రధానంగా సమకాలీన సామాజిక పరిస్థితులు, తాత్విక నేపథ్యం, కవి వ్యక్తిత్వం దోహదం చేస్తాయని చెప్పారు. అట్లాగే శిఖామణి, కవిత్వం ఒక భావోద్వేగ రచన, నువ్వు ఏం చెప్పినా అది ఎత్తుగడ, వస్తువు, నిర్వహణ, భాష, అన్నీ కలగలిపి కవిత్వ రూపందాలుస్తాయి అని కవిత్వ సమగ్రతని అవిష్కరించడానికి ప్రయత్నించారు.

ఇది తొలి ప్రయత్నం కవులకు ఒక కరదీపిక. అట్లాగే సీనియర్ కవులకి ఒక పునశ్చరణ. వెరసి కవితా ప్రియులంతా చదువదగిన పుస్తకం ఇది. పుస్తకాన్ని అందంగా ముద్రించి మంచి కవిత్వ సృజనకు దోహదం అవుతున్న తెలంగాణా సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఎల్లూరు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జే. చెన్నయ్య మిగుల అభినందనీయులు.



# బాజీరావ్ మస్తానీ

చిత్రం : **'బాజీరావ్ మస్తానీ'**, దర్శకుడు : **సంజయ్ లీలా భన్సాలీ**, భాష : **హిందీ**

దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ 18వ శతాబ్దానికి చెందిన మరాఠా యోధుడు బాజీరావ్ పేష్వా-1, అతని ప్రేయసి మస్తానీ ప్రేమకథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కించారు.

బాజీరావు భల్లాల్ భట్ (రణవీర్ సింగ్) ఓటమి ఎరుగని యుద్ధ వీరుడు. అతన్ని పీష్వా బాజీరావు అని కూడా పిలుస్తుంటారు. 40 యుద్ధాలలో ఓటమి అంటే ఏమిటో తెలియని రికార్డ్ ఆయనది. ఢిల్లీ సింహాసనం నుండి మొఘలులను గద్దె దించాక దేశం మొత్తాన్ని తన పాలన కిందకి తెచ్చుకోవడానికి నిశ్చయించు కుంటారు. ఇందులో భాగంగా యుద్ధాలు చేసుకుంటూ ముందుకు సాగుతుంటాడు. ఆ సంగతి అలా ఉంటే బాజీరావు మస్తానీ (దీపిక పదుకోన్) అనే ముస్లిం అమ్మాయి ప్రేమలో పడతాడు. అప్పటికే బాజీరావుకు కాశీభాయి (ప్రియాంక చోప్రా)తో వివాహం జరుగుతుంది. అయితే బాజీరావు ముస్లిం అమ్మాయిని ప్రేమించడాన్ని కుటుంబ సభ్యులు, అతని తల్లి వ్యతిరేకిస్తుంది. ఓ వైపు భారత దేశం మొత్తాన్ని తన కంట్రోల్ లోకి తెచ్చుకోవాలని యుద్ధాలు చేస్తూనే మరో వైపు తన ప్రేమను గెలుచుకోవడానికి కుటుంబ సభ్యులతో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన కొన్ని ప్రతిష్ఠాత్మకమైన చిత్రాల జాబితాలో 'బాజీరావ్ మస్తానీ' కూడా ఒకటి అని చెప్పుకోవడంలో ఏ సందేహం అవసరంలేదు. ఈ సినిమాని అంతే అందంగా మలచడంలోనూ భన్సాలీ సక్సెస్ అయ్యాడనే చెప్పుకోవచ్చు. హిందూ సామ్రాజ్యస్థాపన కోసం 18వ శతాబ్దంలో మొఘల్స్‌తో దాదాపు 40 యుద్ధాలు చేసి గెలిచిన మరాఠా యోధుడు బాజీరావ్. ఇంతకు ముందెన్నడూ ఆన్‌స్క్రీన్‌పై చూడని అతడి ప్రేమకథని అందంగా తెరకెక్కించిన సంజయ్ లీలా భన్సాలీ... పిక్చరైజేషన్, క్యారెక్టరైజేషన్‌లో తన ప్రతిభకి పదునుపెట్టాడు. టెక్నికల్ వ్యాల్యూస్ పరంగా చూస్తే, ఈ సినిమాని బాగా హైలైట్ చేసిన మరో అంశం సినిమాటోగ్రఫీనే.

సుదీప్ చట్టర్జీ అందించిన సినిమాటోగ్రఫీ బాజీరావ్ సన్నివేశాలకి ప్రాణం పోసింది. యుద్ధ సన్నివేశాలు లైవ్లీగా రావడంలో సినిమాటోగ్రఫీ ముఖ్యపాత్ర పోషించింది. డైరెక్షన్, సినిమాటోగ్రఫీలతోపాటు కాస్ట్యూమ్స్ కూడా సినిమాకి కీలకంగా మారాయి. క్యారెక్టరైజేషన్‌లో కాస్ట్యూమ్స్‌కి ప్రత్యేకస్థానం వుంది. బాజీరావ్‌గా రణ్‌వీర్ సింగ్, అతడి ప్రియురాలు మస్తానీగా దీపికా పదుకునె, బాజీరావ్ భార్య కాశీబాయి పాత్రలో ప్రియాంక చోప్రాల పర్‌ఫార్మెన్స్ బాగుంది. ప్రేమకి మతం లేదు.. ప్రేమలోనే ఓ మతం వుందనే సందేశంతో 'బాజీరావ్ మస్తానీ'ని ఆడియెన్స్ ముందుకు తీసుకువచ్చాడు భన్సాలీ.



సమాజం

# తొలి తరం కథలలో తెలంగాణ (1910-1930)

**తెలంగాణ సామాజిక భూమిక తెలుపుతున్న వ్యాసం మీ కోసం...**



డా॥ కాంచనపల్లి గోరా

సాహిత్యం సమాంతర సమాజ ప్రతిఫలనం అని ఈ రోజు కొత్తగా చెప్పవలసిన పని లేదు, కాగా కొంతమంది సాహితీ వేత్తలు చాలా స్పృహతో సమాజ ప్రాతినిధ్యానికి దోహదపడుతారు. కొంతమంది చాలా ప్రాచీనమైన ఇతివృత్తాన్నే ఎన్నుకొని తమ పద్ధతిలో రాస్తూ పోతారు. అయినా వాళ్ళు అనివార్యంగా సమాంతర సామాజిక స్థితిని ప్రతిఫలించకుండా ఉండలేరు.

కవిత్వం కంటే వచన సాహిత్యంలో ఈ దోహదం ఎక్కువగా ఉండడం తెలిసిందే. ఎక్కువగా కాకపోయినా చాలా ఎక్కువమందికి చేరే విధంగా ఉండడం సహజమే.

తెలంగాణ తొలితరం కథలు, ముదిగంటి సుజాతారెడ్డి, అట్లాగే తొలినాటి కతలు ముదిగంటి సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో వచ్చిన నాటి సంకలనాలు. తెలంగాణాను చీకటి ఖండం అని నిందించిన కాలంలో, తెలంగాణా సాహిత్యం ప్రయత్న పూర్వక విస్మరణకు గురైన కాలం లో వచ్చిన సంకలనాలు ఇవి. తెలంగాణాకు ఇదొక ఆత్మగౌరవ ప్రతీక. ఈ అంశాన్ని గురించి పీఠికాకర్తలు చర్చించారు. ఈ చర్చలో తెలంగాణ లో మధ్యతరగతి వర్గం లేదనే, వివాదాస్పద విషయాలు ఉన్నాయి. కాని ఈ పొత్తం ద్వారా నాటి సామాజిక పరిస్థితులను అవలోకనం చేసుకోవడానికే పరిమితం ఈ చిరు ప్రయత్నం.

కథలో వస్తువు దాదాపుగా సామాజికమే. హృదయ శల్యము, విపరీత సాహసము, లాంటి చారిత్రిక కాలానికి చెందిన కాల్పనిక కథలలో సైతం ప్రాయికంగా నాటి సామాజిక విలువలే చిత్రించబడ్డాయి.

నాటి దాంపత్య ధర్మాన్ని చిత్రించడానికి ప్రయత్నం చేసిన కథ హృదయ శల్యము. మాడపాటి హనుమంతరావు నాడు విలువలుగా భావించిన కొన్ని విషయాలను వ్యంగ్యంగా చిత్రించారు. ఈ కథలో పురుషవేషంలో ఉన్న రుద్రమ దేవి, ఒక స్త్రీని విపరీత పరిస్థితి లో కౌగిలించుకోవడం వల్ల ఆమె భర్త అపార్థం చేసుకుంటాడు. చివరికి రుద్రమ దేవి స్త్రీ అని తెలిసికొని, ఆ దంపతులిద్దరూ ఆమెని క్షమాపణ కోరుతారు. రుద్రమ దేవి పాదాలకు వాళ్ళు నమస్కారం చేసిన తీరు "రాజు విష్ణువు తో సమానుడు" అనే పూర్వ నానుడి స్ఫూర్తినిస్తుంది. అదేవిధంగా భర్త భార్యను అనుమానించడం, భార్య భర్త అనుమానం లోని హేతుబద్ధతను అర్థం చేసుకోవడం చూస్తే నాటి దాంపత్య విధానం అవగతమౌతుంది. ఇది కాకతీయుల కాలం నాడు జరిగిన కథ అని చెప్పినా రచనా కాలం నాటి పరిస్థితులుగా కొన్నిటిని ఈ కథ ద్వారా బేరీజు వేయవచ్చు. విపరీత సాహసము అనే చారిత్రిక కాలానికి చెందినదిగా పేర్కొన్న కథలో ఒక నిమ్నస్థాయి స్త్రీ ఆరాధనా భావం కనిపిస్తుంది. ఈ కథ రాజరికం లోని బహుభార్యత్వాన్ని సాధారణ విషయం గానే చిత్రిస్తుంది. సకీనా అనే ఒక పరిచారిక రాజును గురించిన మోహాంధకారంతో చేసిన సాహసమే ఈ కథ.

విదేశీయానం దానివల్ల జరిగే విపరీతాలు ఈ రోజువరకు చూస్తూనే ఉన్నాం. ఆ రోజుల్లో కూడా విదేశీ విద్య వల్ల వచ్చిన అనర్థం చిత్రించారు, లండన్ విద్యార్థి కథలో. ఈనాటికీ విదేశాలకు వెళ్ళిన వాళ్ళ విపరీత ప్రవర్తన చూస్తుంటాం. ఇక్కడ పెళ్లి చేసుకొని వెళ్లి మళ్ళీ అక్కడ పెళ్లి చేసుకోవడం, లేక అక్కడ పెళ్లయినా దాచిపెట్టి ఇక్కడ పెళ్లి చేసుకోవడం లాంటి సంఘటనలనేకం మనకు కనబడతాయి. ఈ విషయాన్ని చిత్రించి ఈ కథ ప్రాసంగికతను చాటుకొంది. మేజు వాణి అనే కథ ఒక ఊహా ప్రపంచం మన ముందు పెడుతుంది.

ఇక ఒద్దిరాజు సీతా రామచంద్ర రావు రాసిన రక్త మూల్యం ఒక చలన చిత్రం లాగా ఉంటుంది. స్నేహితుడు వ్యాధిగ్రస్తుడైతే ఆర్తితో తన రక్తం ఇచ్చి, చివరికి అతని తో కలిసి మరణించిన విషాదాంతం ఇది. ఆ కాలం కథల్లో విషాదాంతం రాయడం కొత్తదనమే అని

గుర్తించాలి. "ఆదిలక్ష్మి" ఆదిరాజు వీరభద్రారావు కథ. వెనుకబడిన తరగతులలో కూడా అత్తల గయ్యాళితనం, ఆడబిడ్డ, భర్తల మంచితనం, మొదలైన మానవ సంబంధాల చిత్రీకరణ కనబడుతుంది.

భండారు శ్రీనివాసరావు "రాజయ్య సోమయాజులు" కథలో నాటి సంస్కరణోద్యమం లక్షణ స్పర్శ ఉంది. అరవదెనిమిదేండ్ల వృద్ధుడైన "రాజయ్య సోమయాజులు"తో ఎనిమిదేండ్ల లలితాబాయికి వివాహం, మళయాళ వైద్యుని మోసం ఇదంతా సినిమా ఫక్కీలో హాస్యం గా చిత్రించాడు రచయిత.

"బాలికా వివాహము" బాల వితంతువును ఒక దేశ భక్తుడు ఆత్మహత్యల నుండి కాపాడడమే ఇతివృత్తం. ఇది నాటి వ్యవస్థలోని అనాచారాలను కళ్ళ ముందుంచుతుంది. మేఘాద్రి పెరుమాళ్ళ నాయుడు "న్యాయవాదము" కథలో ధన సంపాదనకన్నా సామాజిక సేవే ప్రధానం అని నమ్మిన వ్యక్తికి అతని మరణా నంతరం లభించే గుర్తింపు చెప్పిన కథ ఇది. సామాజిక సేవా దృక్పధానికి, పత్రికా రచనకు ఏనాటికైనా ఆదరణ లభించగలదని చెప్పిన కథ ఇది.

"ఏబది వేల బేరం" కథ ఊహించని మలుపు తిరుగుతుంది. జమీందారు లనెందరినో తన వచోచాతుర్యంతో మోసగించిన ఒక బంగారు నగల వ్యాపారి చివరికి ఒక జమీందారి వేషం వేసిన మోసగాడితో ఎట్లా వంచనకు గురౌతాడో తెలిపే కథ ఇది. జమీందారీ మర్యాదలు, ఆడంబరాలు, అట్లాగే నాటి జనంలో ఉండే కల్లు తాగడం మీద మోజు, వెరసి నాటి సామాజిక పరిస్థితిని, ధన దాహాన్ని చక్కగా చిత్రించిన కథ ఇది. ఈ కథతో బాటు 'అడవి గాచిన వెన్నెల', 'నీవేనా' లాంటి కథలన్నీ ఈ నాటి డిటెక్టివ్ కథల్లా ఉంటాయి. బహుశా తరువాత వచ్చిన అపరాధ పరిశోధనా కథలకు ఇట్లాంటి కథలే బీజావాపన కావచ్చు. అడవి గాచిన వెన్నెలలో నాయకుడుగా కనిపించే వ్యక్తి చివరకు విలన్‌గా రూపొందుతాడు. అట్లాగే మొదట విలన్‌గా బడా చోర్‌గా చెప్పబడిన వ్యక్తి నాయకుడవుతాడు. దొంగలను పట్టుకునే వ్యక్తి కి చోరకళ తెలిసి ఉండాల నేది కనబడుతుందీ కథలో. అట్లాగే నీవేనా అనే కథ లో మొదట భయానక వాతావరణం కనబడుతుంది. చివరికి అదంతా ఇంటి దొంగల పనే అని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

ఈ కథల్లో వాడిన భాష ప్రత్యేకించి గమనించ తగ్గది.

> **మాడపాటి హనుమంత రావు నాడు విలువలుగా భావించిన కొన్ని విషయాలను వ్యంగ్యంగా చిత్రించారు. ఈ కథలో పురుషవేషంలో ఉన్న రుద్రమ దేవి, ఒక స్త్రీని విపరీత పరిస్థితి లో కౌగిలించుకోవడం వల్ల ఆమె భర్త అపార్థం చేసుకుంటాడు. చివరికి రుద్రమ దేవి స్త్రీ అని తెలిసికొని, ఆ దంపతులిద్దరూ ఆమెని క్షమాపణ కోరుతారు. రుద్రమ దేవి పాదాలకు వాళ్ళు నమస్కారం చేసిన తీరు "రాజు విష్ణువుతో సమానుడు" అనే పూర్వ నానుడి స్ఫురిస్తుంది.**

హృదయ శల్యము కథ పూర్తిగా గ్రాంథిక భాషలో నడచిన కథ.హృదయ శల్యములోను, మేజువాణిలోను, లండన్ విద్యార్థిలోను, సందర్భాన్ని బట్టి ప్రాచీన పద్యాల ఉగ్గడింపు ఉన్నది. ఇప్పటి విమర్శకులు ముందుమాటలలో విషయానికి సంబంధం లేని ఆంగ్ల కొటేషన్లు వాడినట్టుగాకుండా ఆ పద్యాలు సందర్భాన్ని బట్టి ఔచితీదాయకంగా ఉంటాయి.

బాలికా విలాపము కథ పూర్తిగా సంప్రదాయానుసారిగా నడిచే భాషతో నడుస్తుంది. చిన్నయ సూరి వ్యాకరణ నియమాల్ని బాగా అనుసరించిన కథ ఇది. అరసున్న కూడా ఇందులో పాటించడం ఉంది. రక్త మూల్యము కథలో నిర్మాణించెను లాంటి ప్రయోగాలు కనబడతాయి. 1910లో వచ్చిన కథలన్నీ గ్రాంథికంలోనే నడుస్తాయి. 'నీవేనా' అనే కథ మాత్రం సరళ గ్రాంథికంలో నడచింది. రచయితలందరికీ అంతశ్చేతనలో కావ్య సంప్రదాయాలు ఉన్నాయి. కథా ప్రక్రియకు మూలమైన ఇంగ్లీషు సంప్రదాయాలు ఇంకా ప్రవేశించని సందర్భం అది. 1920 తరువాత నుండి వచ్చిన కథల్లో భాష కొంత సరళీకరణ చెందడం చూస్తాం. కాగా చదివించే గుణం ఈ కథల్లో ఉంది. బాలికా విలాపము హృదయ శల్యము వంటి కథల్లో తప్పితే సమాస ప్రయోగాలు కనిపించవు.

నాటి సంయుక్త రాష్ట్రం వల్ల తెలంగాణ తన ప్రత్యేకతను కోల్పోయింది. బ్రిటిషు వాళ్ళ ఆధిపత్యం కింద ఉన్న ఆంధ్ర ప్రాంత సాహితీ వేత్తలు తమను తామే మేధావులుగా భావించుకొని ఇవతలి వాళ్ళ అస్తిత్వం గుర్తించడం మానేశారు. ఉర్దూ పాలనా భాషగా ఉండడం వల్ల స్థానికమైన తెలుగు సహజంగా వికసించలేక పోయింది. పాత కావ్యాల ప్రభావం, పాత వ్యక్తీకరణలే ఎక్కువగా ఈ కథలలో చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ మొదటి కథ వెలువడింది తెలంగాణా నుండే అని చెప్పుకోదగిన స్థాయి మన కథా రంగానికుండడం గమనించదగిన అంశం. ఈ కథల్లో సమాంతరం గానే వచ్చిన భాషా వివాదాలు గాని, స్త్రీ వ్యక్తిత్వ వికాసాన్ని గురించిగాని, కులవ్యవస్థకు సంబంధించి గాని ప్రత్యేక చర్చలేవీ కనిపించవు. రాజకీయ సైద్ధాంతిక భూమికలు, హరిజనోద్ధరణ వంటి ఆదర్శాల స్పర్శ కూడా ఉండదు. సమాంతర సమాజం యథాతథంగా కనిపిస్తుంది. కొన్ని మానవ స్పందనలకు సహజంగా అద్దం పట్టే స్వభావం వీటికి ఉంది కాబట్టి ఇవి ఈనాటికి తమ ప్రాసంగికతను కోల్పోలేదు. అప్రయత్నం గానే నాటి సామాజిక పరిస్థితి కనిపించింది కాబట్టి ఇవి తెలంగాణా ఆత్మ గౌరవ ప్రతీకలుగా నిలబడ్డాయి.

# రచయిత తన జన్మతః అబ్బిన సృజనాత్మకతను మెరుగుపర్చుకోవాలి

**కాళోజీ పురస్కారం 2020**
**గ్రహీత రామా చంద్రమౌళితో ముఖాముఖి, మీ కోసం...**



మామిడాల రమేశ్‌బాబు

**మీరు ఇంత గొప్ప సాహితీవేత్తగా పరిణతి చెందడానికి కారణమైన మీ కుటుంబ నేపథ్యాన్ని వివరించండి.**

అసలు నేను ఒక విలక్షణమైన సాహిత్యకారునిగా ఎదగడానికీ, నాదైన ఒక విభిన్న సాహిత్య మార్గాన్ని నిర్మించు కోవడానికి నా కుటుంబ పరమైన నేపథ్యమేమీ లేదు. మనిషిలోని ఏ రకమైన సహజ కళలైనా.. అంటే సాహిత్య, సంగీత, చిత్రలేఖన ఇత్యాది ప్రతిభా పాటవాలన్నీ దైవదత్తంగా సంక్రమించేవే. అగ్నికి కాల్చే గుణంలా, నీటికి జీవ ప్రదానం చేయగల మహిమాన్విత శక్తిలా, చెట్టుకు మనిషిని బ్రతికించే ఆక్సిజన్ వాయువును ప్రసాదించగల లక్షణంలా జన్మతః ఉద్దీప్తమయ్యేవే. ఐతే మనిషి పెరుగుతున్నకొద్దీ వ్యక్తిలో గుప్తమై ఉన్న ఈ సహజ సాధారణ ప్రజ్ఞలన్నీ కూడా వ్యక్తమౌతూ తమ భగవద్దత్త కళలుగా రాణిస్తూ సమాజానికి పరిచయమౌతాయి. ఆయా అంతర్భూతమైన కళలను మనిషి తనకుతాను గుర్తించుకుని వాటిని శిక్షణ ద్వారానో, సాధన ద్వారానో మెరుగు పర్చుకుంటే అవి అసాధారణ ప్రతిభగా చుట్టూ ఉన్న సమాజంచేత ప్రశంసార్హమై అతన్ని లేక ఆమెను ఒక విలక్షణ ప్రతిభాశాలిగా, విశిష్ట వ్యక్తిగా స్థిరపరుస్తుంది. రచయిత కూడా అంతే. తన జన్మతః అబ్బిన సృజనాత్మకతను మెరుగు పర్చుకుంటూ అక్షరకారునిగా



రాణిస్తాడు. నా కుటుంబంలో నేనే మొదటి రచయితను. నాకు ముందు మా ఇంట్లో ఎవరూ సాహిత్యకారులు లేరు.

**మీ ఉద్యోగ జీవితం గూర్చి!**

నేను నా విద్యావిషయిక అర్హతలపరంగా ఒక మెకానికల్ ఇంజనీర్ను. వరంగల్లు పాలిటెక్నిక్ కాలేజ్లో మొదట డిమాన్ స్ట్రేటర్ గా చేరి తర్వాత అసిస్టెంట్ లెక్చరర్, లెక్చరర్.. ఇట్లా ఎదుగుతూ చివరికి ప్రిన్సిపాల్ (ఫుల్ అడిషనల్ చార్జ్)గా 2006లో ఉద్యోగ విరమణ చేశాను. తర్వాత వరంగల్లులోనే 'గణపతి ఇంజనీరింగ్ కాలేజ్' అనబడే ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా పన్నెండేళ్ళు పని చేసి 2018 లో రిటైర్ అయ్యాను. నా చదువు వరంగల్లులోని ప్రసిద్ధ 'రీజనల్ ఇంజనీరింగ్ కాలేజ్ (ఇప్పటి నిట్ )'లో, హైదరాబాద్ లోని 'జవాహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ' లోనూ కొనసాగింది. జాతీయ స్థాయిలో ప్రసిద్ధులైన అతిగొప్ప గురువుల దగ్గర విద్యార్జన చేసే అదృష్టం నాకు దక్కింది. దాదాపు 50 సంవత్సరాల అధ్యాపక వృత్తి నాకు అపారమైన ఆత్మతృప్తిని మిగిల్చి వేలమంది విద్యార్థులను తయారు చేసి ఈ ప్రపంచానికి సమర్పించే భాగ్యాన్ని ప్రసాదించింది.

**మీరు అందుకున్న పురస్కారాల గూర్చి!**

1966 నుండి రచనలు చేస్తున్న నేను అప్పటి సాహిత్య పరిస్థితుల్ని బట్టి 1984 నుండి 2004 వరకు అసలు ఏ రచనలూ చేయలేదు (అంటే 20 ఏండ్ల విరామన్నమాట). తర్వాత తిరిగి రెండవ ఇన్నింగ్స్ వలె 2004 లో నా 'ఏటు.?' కవితా సంపుటితో సాహిత్యలోకం లోకి పునఃప్రవేశించి విడిచిన బాణంలా దూసుకుపోతూ నా పునర్వైభవాన్ని చేజిక్కించుకుని స్థిరపడ్డాను. ఈ క్రమంలో నేను సాధించిన అపూర్వ విజయాలు.. ఒకటి.. 2011 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి 'స్వర్ణనంది' (బెస్ట్ టెలిఫిల్మ్ 2011-భూమిదుఃఖం) పురస్కారం, మొన్న 2020 లో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత సాహిత్య పురస్కారం 'కాళోజీ అవార్డ్-2020'ని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల

చంద్రశేఖరరావు గారి చేతుల మీదుగా స్వీకరించడం, అలాగే 2018లో 'కళారత్న', 2018లో ప్రపంచప్రసిద్ధి చెందిన ఫెంటసి సృజనలోకం (ఫిలిప్పీన్స్) వారి ప్రతిష్టాత్మక 'స్వర్ణలేఖిని', పురస్కారం, 'పద్మరత్న-2019' జీవిత సాఫల్య పురస్కారం.. వంటి ఎన్నో అవార్డును సాధించడం ఆత్మతృప్తిని కలిగించే విషయాలు. ఇక వివరాలలో కొస్తే.....

ఎన్‌టిరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆంధ్రప్రదేశ్లో సాహిత్య అకాడెమీతో సహా అన్ని అకాడమీలూ రద్దు చేయబడ్డాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటైన తర్వాత సాహిత్య సంబంధ సకల కార్యకలాపాలనూ, అవార్డునూ విశ్వవిద్యాలయమే నిర్వహిస్తూ వచ్చింది. అంటే రాష్ట్ర స్థాయిలో అత్యున్నత సాహిత్య పురస్కారం 'తెలుగు విశ్వవిద్యాలయం' ప్రతిభాశీలురకు అందజేసేది. అటువంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అత్యున్నత కవితా పురస్కారం 'తెలుగు విశ్వవిద్యాలయ కవితా పురస్కారం' పేర 2007లో నా ద్విభాషా కవితా సంపుటి 'కిటికీ తెరిచిన తర్వాత (As the window opens)'కి లభించింది. ఈ ద్విభాషా కవిత్వ సంపుటిలోని కవితలను ప్రసిద్ధులైన అనువాదకులు ప్రొఫెసర్ ఎస్.లక్ష్మణమూర్తి, వి.వి.బి.రామారావు. ప్రొఫెసర్ కె.పురుషోత్తం, డా. లంకా శివరామప్రసాద్, రామతీర్థ వంటివారు చేశారు. తర్వాత వివిధ నా కవితా సంపుటాలకు తెలుగు నాట ప్రసిద్ధ కవులపేర ఉన్న అన్ని పురస్కారాలూ నాకు లభించాయి. ఉదాహరణకు 'సి.నా.రె. కవితా పురస్కారం' 2008లో, డా॥ ఆవంత్స సోమసుందర్ కవితా పురస్కారం 2012లో, అన్నమయ్య పురస్కారం 2009లో, గుంటూరు శేషేంద్రశర్మ కవితా పురస్కారం 2012లో, వానమామలై వరదాచార్య సాహిత్య పురస్కారం 2009లో, ప్రతిష్టాత్మక 'ఫ్రీవర్స్ ఫ్రంట్' పురస్కారం 2012లో (అంతర - కవితా సంపుటికి), దేవులపల్లి కృష్ణశాస్త్రి కవితా పురస్కారం 2018లో, ఇవిగాక కథలకు అనేక పురస్కారాలు. అభ్యుదయ రచయితల కథా పురస్కారం, రంగినేని కథా పురస్కారం, జి.ఎం.ఆర్. రావి కృష్ణమూర్తి కథా పురస్కారం, నోముల కథా పురస్కారం, కొలకలూరి భాగీరథీ పురస్కారం, సహృదయ సాహిత్య పురస్కారం, పర్చా రంగారావు కథా పురస్కారం, బి ఎస్ రాములు విశాల సాహితి కథా పురస్కారం వంటివి ఎన్నో ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'నాజి నామన్ ప్రపంచ సాహిత్య పురస్కారం (లెబనాన్)' ప్రపంచవ్యాప్తంగా 2386 మంది సాహిత్యకారులను పరిశీలించి భారతదేశం నుండి నన్నొక్కడిని మాత్రమే ఎంపిక చేసి 'జీవితకాల సాఫల్య పురస్కారం-2019'ను అందజేసింది.

ఇవి గాక SAARC, SUFI, Indian society of authors (INSA), World congress of poets WCP వంటి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ద్వారా భారతీయ ప్రతినిధిగా నేను దేశ, విదేశాల్లో పాల్గొన్నప్పుడు లభించిన ప్రత్యేక పురస్కారాలు ఎన్నెన్నో. అంతర్జాతీయ వేదికలపై పాల్గొని భారతీయ స్వరాన్ని నేను గ్రీస్, తైవాన్, మలేసియా, న్యూజీల్యాండ్, మెల్బోర్న్ ఆస్ట్రేలియా, బీజింగ్, భారతదేశంలో WCP అంతర్జాతీయ ఉత్సవాలు భువనేశ్వర్లో - 2019 జరిగినప్పుడు ఆహ్వానితునిగా పాల్గొని అప్పటిదాకా ప్రతి సభలోనూ ఇంగ్లీష్ లోకి అనువాదమైన నా పుస్తకాలను ఆవిష్కరింపజేసుకున్నాను. జాతీయ స్థాయిలో పేరెన్నికగన్న ప్రసిద్ధ అనువాదకులు శ్రీశ్రీ, వేగుంటతో సహా నా రచనలను అనువదించారు.

ఇంతవరకు నేను 32 నవలలు, 383 కథలు, 14 సంపుటాల కవిత్వం వెలువరించాను. (నా కథలపై తన ఎం.ఫిల్ చేస్తున్నపుడు ఒక పరిశోధకురాలు 2017లో అప్పటికి నేను రాసిన 342 కథల్లో 172 కథలకు ప్రసిద్ధ పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో అవార్డులను పొందినట్లు తేల్చింది.

**కవిత్వం, కథ, నవల ఈ మూడు ప్రక్రియల్లో మీరు మీదైన ఒక ముద్రను వేశారు. ఈ మూడు ప్రక్రియల్లో మీకిష్టమైన ప్రక్రియ ఏది? ఎందుకు?**

అక్షరకారుడెవరైనా తన భాస్వరంలాంటి అక్షరాలతో నిరంతరం వివిధ రకాలైన తన పాఠకులతో సంభాషిస్తూనే ఉంటాడు. రచయిత వాళ్ళకు సరిపోయిన పౌనఃపున్యంలో అనుసంధానం కావాలి. అందుకు ఒక్క



వ్యక్తి బహుళ పరిభాషల్లో అందరికీ చేరువ కావాలి. అలా చేరువ కావడానికి అక్షరకారుడు కవిత్వాన్నీ, కథా, నవలా, పాట వంటి వివిధ పనిముట్లతో, మాధ్యమాలతో దగ్గరౌతూంటాడు.

ఐతే, నావంటి రచయిత నా పాఠకులతో పంచుకోవాలనుకుంటున్న ఆలోచనలు తన మూల లక్షణాలనుబట్టి తనదైన ఒక ప్రక్రియను దానికదే తొడుక్కుని కాగితంపైకి వర్షిస్తుంది. నిజానికి అక్షరకారుడొక నిమిత్తమాత్రుడు. అతని వస్తువే ప్రక్రియను ఆవిష్కరిస్తుంది. ఐనపుడు అది ప్రక్రియ ఏదైనా దాన్ని సమర్థవంతంగా, హృదయంగమంగా, రంజనాత్మకంగా నిర్వహించగలుగుతే అతను లేక ఆమె ఒక ఉత్తమ సృజనకారులుగా వర్ధిల్లుతారు. నేను భిన్నమైన ఇతివృత్తాలతో సన్నద్ధమైనపుడు నా స్వంత గొంతుకను వినిపిస్తూ నాదైన నడకతో పయనిస్తా. అదే నా నుడికారం. ప్రక్రియ ఏదైనా ప్రత్యేకమైన ఆరంభం.. విస్తరణ.. కొనసాగింపుతో అద్భుతమైన ముగింపుతో రచనను పరిసమాప్తి చేసినపుడు ఆ కృతి తప్పక జనరంజక మౌతుంది.

**ఒక గొప్ప ఇతిహాసం వంటి 'కాలనాళిక' అనే బృహత్తర నవలా రచనా నేపథ్యాన్నీ, అసలు అంతపెద్ద నవలను ఎందుకు, ఏ ఉద్దేశ్యంతో రాశారో చెప్పండి.**

ఈ 'కాలనాళిక' అనే బృహత్ నవలను ఆవిష్కరిస్తున్నపుడు ప్రగతి భవన్లో తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆ నవలను మీరన్నట్టు ఒక ఇతిహాసంగా అభివర్ణించారు. తర్వాత వరంగల్లులో భారీ ఎత్తున 'కాలనాళిక' ఆవిష్కరణ జరిగినప్పుడు కూడా ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో సహా వేదిక పైనున్న వక్తలందరూ దాన్ని ఒక ఇతిహాసంగానే శ్లాఘించారు. ఆ గ్రంథానికి ట్యాగ్ లైన్ను కూడా 'గత 80 సంవత్సరాల వరంగల్లు మహానగర చరిత్ర కథాత్మక నవల' అని పెట్టాము. ఇక్కడ ప్రతీకాత్మకంగా వరంగల్లు చరిత్రే తెలంగాణ చరిత్ర. 'కాలనాళిక' నా 32వ నవల. అప్పటికే అన్ని నవలలను రాసిన నేను ఇట్లా ఎన్ని నవలలు రాస్తే నాదైన ఒక అస్తిత్వాన్ని సమకూర్చుకోగలుగుతాను.. నాదైన ఒక స్వంత ముద్రను సాహిత్య రంగంలో వేయగలుగుతాను అని పదే పదే ప్రశ్నించుకుని అతి సాహసోపేతమైన 80 సంవత్సరాల సమీప గతాన్ని అక్షరబద్ధం చేస్తూనే, గత ఇటీవలి 14 ఏండ్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటం తెలంగాణ మలిదశ ఉద్యమంలో మమేకమైన అనేక త్యాగాలను చేసిన వీరుల సజీవ చరిత్రను ఇప్పటికీ మన కళ్ళముందు కనిపించే పాత్రలతో సహా కథను నిర్మించుకోవడం జరిగింది. 1324 లో కాకతీయ సామ్రాజ్యం పతనమై మహమ్మద్ బిన్ తుగ్లక్ చేత ప్రతాపరుద్రుడు బందీగా ఢిల్లీకి తీసుకుపోబడ్డ నాటి నుండి అనేక ముస్లిం చక్రవర్తుల పాలనలో 690 సంవత్సరాలు బానిసలుగా మగ్గిన తెలంగాణ జనజీవితం పూర్తిగా భిన్నమై, ఛిద్రమై దుఃఖదాయకమై మిగిలింది. అది ఒక నిత్యజ్వలిత మహాగ్నిగుండం. కల్లోల సముద్రం, విప్లవాల, తిరుగుబాట్ల రక్తచరిత్ర. 1934 లో వరంగల్లులో నిజాం 'ఆజం జాహి మిల్లు' అనే అతిపెద్ద వస్త్ర పరిశ్రమను స్థాపిస్తే.. దానితోపాటే పుట్టుకొచ్చిన 'రజాకార్ల', నిజాం తొత్తులైన దొరల, దేశ్ ముఖ్ల, సుబేదార్ల, మక్తేదార్ల రాక్షస హింసలో కనలిపోతూ.. తిరుగబడ్డ అగ్నికణాల్లాంటి నిర్భాగ్య జనంలోనుండి.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం' పుట్టి, సమసి, పరాయి పాలకుల చేత వంచించబడుతూ 1969 లో తెలంగాణా రాష్ట్ర సాధన కోసం తొలిదశ పోరాటం హింసాత్మకంగా జరిగి.. 369 మంది అమరులై, మళ్ళీ కె.సి.ఆర్. నాయకత్వంలో 2001 నుండి 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించేదాకా 1069 మంది అమరులై.. దశాబ్దాల పర్యంతం ఒక నిర్విరామ యుద్ధంతో, రాక్షస హింసతో రక్తసిక్తమై, నెత్తుటితో తడిచిన తెలంగాణ భూమిరోదన ఆ 80 ఏండ్ల స్తబ్ధకాలం నివురుకప్పుకున్న నిప్పువంటి పొరల్లోని చరిత్రను ఈ యువతరానికి వినిపించాలని, వాళ్ళలో తమ గత తరాల చైతన్యపు పోరాట పటిమనూ, త్యాగాలనూ స్ఫూర్తిదాయకంగా అందించాలనీ 'కాలనాళిక'ను సృజించాను. ఇది రాయడానికి రెండేళ్ళు పట్టింది నాకు. బోలెడు సమాచారం, అధ్యయనం, సజీవ పాత్రలున్న కథనం కాబట్టి అతి జాగ్రత్తగా కూర్చుకోవాల్సిన కూర్పు.. ఇవన్నీ నన్ను 'వాకింగ్ ఆన్ ద రోప్' లా నడిపించేవి. 2017లో ఈ నవల పూర్తయి వెలువడింది. ఆవిష్కృతమైన తర్వాత ముఖ్యమంత్రి గారితో సహా అనేకమంది సీనియర్ విమర్శకుల చేత ప్రశంసించబడి అది ఒక 'ఇతిహాసమే' అని రూఢిపర్చబడింది.

**ప్రతి వారం, ప్రతి పక్షం రోజులకో రచన చేస్తూనే ఉన్నారు మీరు మీదైన ప్రయోజనాత్మక శైలిలో. ఇంత వేగంగా, ఉత్తమంగా ఎలా రాయగలుగుతున్నారు. దీనికి ప్రేరణ ఏమిటి?**

వేదన. మన చుట్టూ, మన కళ్ళెదుటే జరుగకూడనివి జరుగుతూ, జరుగవలసిన ఆరోగ్యవంతమైన పనులు జరుగక, ఎవ్వరూ చేపట్టక ఉదాసీనంగా ఉంటూండడం, విజ్ఞులు చెప్పినట్టు 'మౌనం యుద్ధ నేరమౌతుందనీ తెలిసినా మేధావులూ, బుద్ధిజీవులూ మౌనం వహిస్తూండడం.. వెరసి ఈ తరం 'ఒక చచ్చు, పుచ్చు' తరంగా పరివర్తిస్తూండడం. చాలా ఆందోళనను కలిగిస్తోంది. ఈ రాయడం ఒక రకమైన ఉపశమనం పొందడమే, అడవిలో అతి బిగ్గరగా అరచి ఉన్మాదించడం వంటి స్థితి ఇది.

**మీరు కేవలం నవలా రచయితగానే ఉంటే ఇంకా గొప్ప నవలలు మీ కలంనుండి వస్తాయని మా నమ్మకం. దీనికి మీరేమంటారు.**

ఉహూ... అట్లా కుదరదు. నేను ఇదివరకటి జవాబుల్లో చెప్పినట్టు ఒక విశాల దృక్పథం ఉన్న రచయిత తనలో ప్రస్ఫుటించే అనేకానేక సామాజిక ఆలోచనలనూ, సంవేదనలనూ, కొంగ్రొత్త

ప్రతిపాదనలనూ పాఠకులకు అందివ్వాలని కాంక్షించే క్రమంలో ఈ ప్రక్రియా వైవిధ్యత తప్పదు. వెనకటి మన పూర్వులు విశ్వనాథ, రావి శాస్త్రి, చాసో దగ్గరినుండి తమిళ్ వంటి ఇతర భారతీయ భాషా రచయితల్లో అగ్రగణ్యులైన జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత డి.జయకాంతన్, అస్సామీ రచయిత శీల్ భద్ర వంటి వారందరూ.. ఎవరూ కేవలం నవలా రచయితలుగా మాత్రమే కొనసాగలేదు. అందరూ అటు కథనూ, ఇటు నవలనూ ఉత్తమంగా సృజిస్తూ వెళ్ళారు. ఈ రెండూ అద్భుతమైన వచన రచనలుగా శక్తివంతంగా శోభిల్లగల జంట ప్రక్రియలు. వస్తువును బట్టే రూపుదిద్దుకునే అక్షర రూపాలు. వీళ్ళందరూ కవులు కాక పోవచ్చును.. కాని కేవలం నవలలను మాత్రమే రాస్తూ కథలను రాయకుండా ఉండలేకపోయారు. కవిత్వాన్ని స్పర్శించని వచన రచయితలున్నారు గాని, కేవలం నవలలను మాత్రమే రాస్తూ కథను సృజించని రచయితలెవ్వరూ లేరు.

**ఇప్పటి రచయితలకు మీరిచ్చే సలహాలూ, సూచనలేమిటి.**

కృషితో నాస్తి దుర్భిక్షం.. అన్న మన పురాతన నానుడే ఇక్కడ అనుసరణీయం. సమాజ హితాన్ని కోరేదే సాహిత్యం అన్న మూల భావనను అర్థం చేసుకుని మనం రాస్తున్నదేదైనా మనిషిని ఉన్నతీకరించేదిగా, వికసింపజేసేదిగా ఉండాలన్న స్పృహను ఎప్పుడూ రచయిత మరువద్దు. ప్రతి రచనలోనూ ప్రయోజనాత్మకత అంతర్లీనంగా ఉండాలె. తన భావాలను శక్తివంతంగా కాగితంపైకి అనువదించగల మాధ్యమమైన భాషను విస్తృతమైన పఠనంతో మెరుగు పర్చుకోవాలె. అన్నింటినీ మించి రచయితకు తాను రాస్తున్న విషయం పట్ల స్పష్టమైన అవగాహనా, పరిణతీ ఉండాలె. ఇప్పటి తరానికి అనేక సామాజిక మాధ్యమాలు అప్పణంగా అందు బాటులోకి వచ్చాయి. అందువల్ల నాలుగు అక్షరాలను గీకి వాటిని ఉచితంగా అందే ఫేస్ బుక్, బ్లాగ్స్, ఇతర డిజిటల్



మాధ్యమాల్లో పెట్టి ఆనందిస్తున్నారు. ఇక మర్నాటినుండి అవార్డుకోసం, సత్కారాలకోసం ఎదురు చూస్తున్నారు. ఈ గోకుడు ఎక్కువైంది ఈ తరంలో. మనం శతాబ్దాల విశేష చరిత్ర ఉన్న మన తెలుగు సాహిత్యంలో విభిన్నతనూ, తనదే అయిన స్వంత గొంతునూ వినిపిస్తున్నామా. లేక మురుగు ప్రవాహంలో కొట్టుకుపోతున్నామా అన్న స్పృహను నిరంతరం కలిగి ఉండాలె.

**కాళోజీ పురస్కారం రావడం, కాళోజీతో మీకు కొంత అనుబంధం ఉండడం.. దాని గురించి చెప్పండి.**

మొట్టమొదట కాళోజీగారు బతికి ఉన్నప్పుడే ఆ మహాపురుషుని సమకాలీన కాలంలో జీవించి అతనితో కొంత సాన్నిహిత్యాన్ని కలిగి ఉండడమే మనందరి ఒక గొప్ప అదృష్టం. కాళోజీ గారిది హనుమకొండ. నాది వరంగల్లు. కాళోజీ గారింట్లో ప్రతి వారం జరిగే 'మిత్రమండలి' సమావేశాలకు అప్పుడప్పుడు మాత్రమే నేను వెళ్ళేవాణ్ణి. ఆయన ఇల్లు ఒక అద్భుతమైన సాహిత్య కేంద్రం. వరంగల్లుకు ఏ గొప్ప సాహిత్యకారుడు వచ్చినా ఆయన ఇంటికి వెళ్ళి కాళోజీని దర్శించుకుని వెళ్ళడం ఆనవాయితీ. మిత్రమండలికి ఒక పాలకవర్గం, ఇతరేతర అన్ని సంస్థల్లో ఉండే పద్ధతులేవీ ఉండేవి కావు. సమావేశాలను నిర్వహించేందుకు మాత్రం ఒక కన్వీనర్ ఉండేవాడు. మొదటి కన్వీనర్ మిత్రమండలికి ప్రఖ్యాత సాహితీ వేత్త వరవరరావు. తర్వాత్తర్వాత ప్రసిద్ధ నవలాకారులు అంపశయ్య నవీన్, నాగిళ్ళ రామశాస్త్రి వంటి ఉద్దండులు అనేకులు కన్వీనర్ గా పని చేశారు. ప్రస్తుతం ప్రముఖ కవి వి.ఆర్. విద్యార్థి కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారు. వయసుతో, నేపథ్యంతో నిమిత్తం లేకుండా ఎవరైనా మిత్రమండలిలో పాల్గొని తన తాజా రచనను అందరిముందు చదివి వినిపించి పెద్దల సలహాలనూ, సూచనలనూ పొందడం ఒక మహత్తర భాగ్యంగా ఉండేది. కాళోజీ రామేశ్వరరావు, అనుముల కృష్ణమూర్తి, ఎస్.లక్ష్మణమూర్తి, పల్లా దుర్గయ్య, సుప్రసన్న, వేన రెడ్డి, పేర్వారం జగన్నాథం వంటి గొప్ప సాహిత్యకారులు ఎందరో వచ్చేవారు ఆ సమావేశాలకు 'మిత్రమండలి' ఒక చరిత్ర.

మా మామగారు, ప్రముఖ ఆర్యసమాజ్ కార్యకర్త చింతకింది పాపవినాశ్ ఆర్య కాళోజీ గారికి సన్నిహిత మిత్రుడు. వారి ద్వారా కాళోజీ గారు నాకు బాగా పరిచయమయ్యాడు. అంతకుముందు చిన్న పిల్లాడిగా ఉన్నపుడు ప్రసిద్ధ వామపక్ష తత్వవేత్త పాములపర్తి సదాశివరావు గారింటికి (వారి కొడుకు పాములపర్తి నిరంజనరావు నా పాఠశాల సహపాఠి కావడంవల్ల) నేను తరచూ వెళ్తూండడంవల్ల 'మేడ' మీద అనేకసార్లు కాళోజీగారిని కలిసేది. యాదృచ్ఛికంగా ప్రసిద్ధ మహబూబియా ఉన్నత పాఠశాలలో చదువుకోవడంవల్ల కాళోజీ గారి గురువు గార్లపాటి రాఘవరెడ్డి గారు నాకుకూడా గురువు కావడం ఒక అదృష్టం. మామగారితో ఉన్న స్నేహం వల్ల నా వివాహానికి కూడా కాళోజీ గారు హాజరై ఆశీర్వదించారు. స్థూలంగా కాళోజీ ఒక మహామానవుడు. శిశు తత్వంగల సున్నిత మనస్కుడు. ఎన్నడూ ఎవరితోనూ రాజీ పడని వజ్ర హృదయుడు. నిర్మొహమాటి. స్వంత ఆస్తి అని ఏదీ లేని యోగి, ఋషి.. జీవితాన్ని ఒక కొమ్మపై వాలిన పిచ్చుకలా జీవించి అలా గాలిలోకి నిష్క్రమించిన ప్రజల మనిషి.

**వరంగల్లు సమీప చరిత్రను మీ 'కాలనాళిక' బృహత్ నవలలో చెప్పారు. అదే ప్రతీకాత్మకంగా మొత్తం తెలంగాణా పోరాట చరిత్రగా పాఠకులు సులువుగానే**

ముఖాముఖి

**గ్రహిస్తారు. తర్వాత యుద్ధభూమి వంటి తెలంగాణ గురించి మరేదైనా రాశారా. రాస్తారా.**

తెలంగాణ రాష్ట్రావిర్భావం తర్వాత భారతదేశంలో ఏ రాష్ట్రమూ చేయని 24 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరాను సాధ్యపర్చి తెలంగాణ ఒక చరిత్రను సృష్టించింది. అదిగాక కాళేశ్వరం వంటి ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రాజెక్టు రూపొందించి దక్కన్ పీఠభూమి పైకి గోదావరి నదిని 'నీరు పల్లమెరుగు' అన్న నానుడికి భిన్నంగా వందల మీటర్ల ఎత్తుగల కొండపోచమ్మ వంటి కొండలనెక్కించి లక్షల ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేశారు. అవిగాక ఇదివరకెన్నడూ ఎవరూ ఎరుగని, వినని ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో దేశాన్నే అబ్బురపర్చారు. ఇదంతా 2017 దాకా సాగిన ప్రతిఫలాలను.. ఉద్యమా నంతర లోలోతు విషయాలను అనుశీలిస్తూ ఒక నవలను రాశాను. అది 'మనిషి పరిచయం' పేర ప్రసిద్ధ అంతర్జాల పక్షపత్రిక 'సారంగ'లో సీరియల్ గా వెలువడి ప్రపంచ తెలుగు పాఠకుల మన్ననలను పొందింది. గత ఆదివారమే వరంగల్లులో జరిగిన పెద్ద సాహిత్య సభలో ఈ నవల ఆవిష్కరించబడి నవలాప్రియుల చేతుల్లోకి చేరింది. మీరన్నట్టు తెలంగాణా ఒక యుద్ధభూమి. దీని ఉజ్జ్వల భవిష్యత్తును ఒక భవిష్యకారునిగా ఊహించి అక్షరబద్ధం చేస్తాను.

దార్శనికుడైన రచయిత ఎప్పుడూ సామాన్య మానవులకంటే పది ఇరవై ఏళ్ళ వాస్తవిక భవిష్యత్తును ఊహించి చెప్పగలు గుతాడని నా నమ్మకం. ఉదాహరణకు సెల్వియా బ్రౌన్ అనే అమెరికన్ రచయిత్రి 2008 లో ప్రచురించబడ్డ తన 'ఎండ్ ఆఫ్ డేస్' నవలలో రాబోయే రోజుల్లో అంటే 2020లో 'కరోనా' వంటి మహమ్మారి వ్యాధి ఒకటి మానవజాతిని గజగజలాడిస్తూ లక్షల మందిని మృత్యుకుహరంలోకి తరుముతుందని ప్రిడిక్ట్ చేసింది. (పుట 312). రచయితలు జ్యోతిష్కులు కారు. కాని భవిష్యకారు లౌతారు తమ దార్శనికతతో.

**పొంతన లేని మీ వృత్తినీ, ప్రవృత్తినీ ఎలా సమన్వయ పర్చుకుంటున్నారు.**

స్థూల దృష్టితో కాకుండా సూక్ష్మ దృష్టితో వ్యక్తి తనను తాను 'తెలుసు' కుంటూ జ్ఞానసంపన్నుడౌతున్నప్పుడు 'ఒక్క మనిషిలోనే పెక్కు మనుషులున్నట్టు' గ్రహిస్తాడు. ఆ 'ఎరుకే' నిశ్చలానందాన్ని ప్రసాదిస్తుంది. ఐతే మనిషి తాను ఇష్టపడి ఎంచుకున్న వృత్తుల్లో ప్రతిదానికీ పూర్తిగా న్యాయం చేస్తూ అంతిమంగా సమాజాభివృద్ధికి తోడ్పడాలె. ఒక ప్రొఫెసర్ గా నేను పూర్తిగా న్యాయం చేసినట్టు నా పూర్వ విద్యార్థులు కలిసినప్పుడు వాళ్ళ ముఖాల్లో విరజిమ్మే వెలుగు నా సఫలతను బుజువు చేస్తుంది. రచయితగా నా ప్రయాణమే నా ఉత్తీర్ణతకు పెద్ద బుజువు. పూర్తిగా సార్థకతను సాధించిన జీవితం నాది. స్వస్తి.

**కృతజ్ఞతలు, నమస్తే సార్.**

**ఉంటాను...**

## ప్రియమైన తంగేడు పాఠకులకు నమస్సులు...




ఇప్పుడు మన ఆరవ సంచిక చేతిలో ఉంది. తెలంగాణ సాహిత్య సాంస్కృతిక వారసత్వ సంపదను అందించడానికి మేము చేస్తున్న కృషిలో మీ సహకారం మరువలేనిది. పరిశోధనా ప్రియులకు భూమికను అందించడం, సీనియర్ సాహిత్య కారులను గౌరవించడం, వర్ధిష్ణువులను ప్రోత్సహించడం మా జాగృతి సంస్థ ద్వారా మేం మొదటి నుంచి చేస్తున్నదే. అందులో భాగంగానే తంగేడు మీ ముందుకు వచ్చింది.

సీనియర్ సాహితీవేత్తల నుండి అప్పుడే కలం పట్టిన రచయితల వరకు మా ప్రయత్నాన్ని అభినందించారు, హర్షించారు. దీనికి మూల్యాన్ని నిర్ణయించమని విజ్ఞప్తుల వెల్లువ కురిపిస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు ప్రతులను కాంప్లిమెంటరీగానే అందించిన మేము మీ అందరి విజ్ఞప్తుల మేరకు కొంత వెలను నిర్ణయిస్తున్నాం. మాకు ఫోన్ చేసి సభ్యులుగా చేరతామన్న వాళ్ళందరూ దీన్ని ఆమోదిస్తారని విశ్వసిస్తున్నాం.

కృతజ్ఞతలతో...
మీ
కల్వకుంట్ల కవిత, ఎడిటర్ (Email: editor@thangedu.co.in)

# మంజీర రచయితల సభ

నాణ్యమైన కవిత్వం కోసం నాలుగు కాలాల పాటు నిలిచే సాహిత్యం కోసం మంజీరా రచయితల సంఘం ప్రతి ఆదివారం 5 గంటల నుండి గూగుల్ మీట్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమమే కవిత్వ నైపుణ్యాలు.

**కవిత్వం నైపుణ్యాలు...**

13లో కవిత్వము దృశ్యీకరణ - మానవీకరణ ప్రకృతీ కరణ అనే అంశంపై ప్రఖ్యాత కవి తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి గారు ప్రసంగించారు. విలువైన అంశాలను వివరిస్తూ కవిత్వంలో దృశ్యీకరణ పాఠకుని హృదయాన్ని చైతన్యం చేయాలన్నారు. మానవీకరణ వల్ల మనుషుల్లో ఉన్న స్వార్థపూరిత భావన పోయి మానవులే అత్యున్నత వారని బోధ చేస్తుందన్నారు. కవిత్వంలో ప్రకృతీ కరణ ముఖ్యమని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శ్రీరాములు, పొన్నాల బాలయ్య, దాసరి మోహన్, సంతోష్ శర్మ, ఏం దేవేంద్ర, వి. సరోజ మొదలైన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం హోస్ట్‌గా చేసిన మంజీరా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ సిద్దెంకి యాదగిరి వ్యావహరించారు.

డా॥ కేతవరపు రాజశ్రీ

# "కరోన... టూరిస్టు కాదు"

## కవితా సంపుటి ఆవిష్కరణ



గత నెల "కరోన... టూరిస్టు కాదు" కవితా సంపుటి ఆవిష్కరణలో జి.కృష్ణవేణి, డా॥ పరంజ్యోతి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥ కె.వి. రమణాచారి, డా॥ కేవతరపు రాజశ్రీ, నియోగి, జంద్యాల కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వీకారం



## వందేమాతరం

(దేశభక్తి, సామాజిక గేయాలు)
ముత్యబోయిన మలయ శ్రీ
వెల: రూ.100



## బడి

లక్ష్మణ్ బూరుగు
9440069837
వెల: రూ.50



## ప్రేమ లహరి

(హాఫెజ్ కవిత్వం)
జలజం సత్యనారాయణ
వెల: రూ.250



## ఒక గురువు గారు నలుగురు శిష్యులు

చీకోలు సుందరయ్య
వెల: రూ:160
9030000696



## మనిషి పరిచయం

రామా చంద్రమౌళి
వెల: రూ.200
9390109993



## స్వీట్, మిల్క్ ఓ చిలుక

డా.కందేపి రాణీప్రసాద్
వెల: రూ.70
వెల:9866160378



## రాచిప్ప

(కథల సంపుటి)
డా॥ కొండపల్లి నీహారిణి
వెల: రూ.125
9866360082



## దేశ భాషలందు తెలుగు లెస్స

(పద్య గేయ కవితా సంకలనం)
వుప్ప అంజయ్య
వెల: రూ.100
9396610639



## భావ వీచికలు

(వచన కవితా సంపుటి)
డా.దాచేపల్లి దుర్గయ్య
వెల: రూ.100
9666553651



## దంతెవాడ

మూర్తి కె.వి.వి.ఎస్
వెల: రూ.80
7893541003


సేద్య బాంధవి....